PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 98 | విజయవాడ, ఆదివారం 10 నవంబర్ 2024 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 10 November 2024 | Rs

విశాఖ నడిబొడ్డున గంజాయి సాగు

- కెజిహెచ్ కొండపై గుట్టుచప్పుడు కాకుండా పెంపకం

2



మస్కట్‌లో జరిగిన 49వ ఎఫ్ఐహెచ్ అవార్డుల ప్రధానోత్సవంలో వీరు అవార్డులను అందుకున్నారు. భారత హాకీ అభిమానులతోపాటు ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక ఓట్లు వీరికి దక్కాయి. దీంతో 2023-24ఏడాదికి 'ఎఫ్ఐహెచ్ ప్లేయర్ ఆఫ్ ది అవార్డు' హర్మన్‌ప్రీత్‌కు, 'గోల్‌కీపర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు శ్రీజేశ్‌కు వరించాయి. హర్మన్‌తో పాటు నెదర్లాండ్స్‌కు చెందిన జోప్-డి-మోల్, థియరీ బ్రింక్‌మన్, హన్నెస్ ముల్లర్(జర్మనీ), జాక్ వాలెస్(ఇంగ్లండ్) కూడా 2024 ఏడాదికి ఉత్తమ ఆటగాళ్లుగా అవార్డులను అందుకున్నారు.



విజయవాడ పున్నమి ఘాట్‌లో సీ ప్లేన్ ముందు...



శ్రీశైలం పాతాళ గంగ వద్ద రోప్‌వేలో

సీ ప్లేన్ ...రోప్‌వే

- శ్రీశైలానికి చంద్రబాబు ఇలా..
- పర్యాటకరంగాన్ని కొత్త పుంతలు తొక్కిస్తామని పకటన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో, కర్నూలు ప్రతినిధి

'విజయవాడ పున్నమిఘాట్ నుండి సీ ప్లేన్‌లో శ్రీశైలం పాతళ గంగ వరకు... అక్కడి నుండి రోప్‌వేలో శ్రీశైలానికి..' అక్కడ పూజా కార్యక్రమాలు ముగిసిన అనంతరం తిరిగి అదే విధంగా విజయవాడకు...! ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి పర్యటన సాగిన తీరిది! అంతకుముందు శనివారం మధ్యాహ్నం పున్నమిఘాట్‌లో సీ ప్లేన్ డెమో లాంచ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో కలిసి సీ ప్లేన్‌లో ప్రయాణం చేసి శ్రీశైలంకు చేరుకున్నారు. పాతాళగంగలో సీ ప్లేన్ సురక్షితంగా ల్యాండ్ అవడంతో అక్కడకు చేరుకున్న ప్రజలు, ప్రజా ప్రతినిధులు హర్షధ్వానాలు చేశారు. అప్పటికే అక్కడకు చేరుకున్న పలువురు మంత్రులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. అక్కడి నుండి రోప్‌వేలో శ్రీశైలానికి చేరుకున్న చంద్రబాబు నేరుగా మల్లికార్జున స్వామి ఆలయానికి వెళ్లారు. అంతకుముందు విజయవాడలో మాట్లాడుతూ రానున్న రోజులో రాష్ట్ర పర్యాటక రంగం కొత్త పుంతలు తొక్కనుందని చెప్పారు. పర్యాటక రంగ అభివృద్ధితో లక్షలాదిమందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని, ఎన్ని కష్టాలున్నప్పటికీ వాటిని అధిగమించి రాష్ట్రానికి పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. రాష్ట్రంలో పిపిపి విధానంలో సంపద సృష్టికి అపార అవకాశాలున్నాయని, నాలెడ్జ్ ఎకానమిలో పెనుమార్పులు వస్తున్నాయన్నారు. రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి ప్రత్యేక విధానంతో కృషి చేస్తున్నట్లు సిఎం వెల్లడించారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ సమస్య ఉంటే టూరిజం రాదని, ప్రశాంత వాతావరణం ఉంటే ప్రపంచం మొత్తం రాష్ట్రానికి వచ్చే పరిస్థితి వస్తుందన్నారు. వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని వెంటిలేటర్‌పైకి నెట్టివేసిందని, రాష్ట్రాన్ని ఇప్పుడిప్పుడే బయటకు తీసుకొస్తున్నామని సిఎం పేర్కొన్నారు. రాష్ట్రాన్ని ప్రమోట్ చేయడానికి, రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు పెంచడానికి . ఉపాధి ఉద్యోగావకాశాలు సృష్టించడానికి అందుబాటులోని అన్ని అవకాశాలను ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

టూరిజం డెస్టినేషన్‌గా ఎపి

ఆంధ్రప్రదేశ్‌ను టూరిజం డెస్టినేషన్‌గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. సీ ప్లేన్ ద్వారా విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి బయల్దేరి శ్రీశైలం పాతాళగంగ వద్ద ఏర్పాటు చేసిన జెట్టి వద్ద దిగారు. దీంతో సీ ప్లేన్ ప్రయోగం విజయవంతమైంది. అక్కడి నుండి రోప్‌వే ద్వారా శ్రీశైలం ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అటవీ, దేవాదాయ, పర్యాటక శాఖ మంత్రులతో కమిటీ వేసి శ్రీశైలం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తామని చెప్పారు. నల్లమల అడవులను పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. మార్చి నుంచి రెగ్యులర్ సీ ప్లేన్ ఆపరేషన్స్ ప్రారంభిస్తామని తెలిపారు. గండికోటకు కూడా సీ ప్లేన్ నడుపుతామన్నారు. గండికోట అభివృద్ధికి రూ.80 కోట్ల నిధుల కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. అరకు, లంబసింగి, రిషికొండ, తిరుపతి వంటి పట్టణాలను కలపగలిగితే పర్యాటకం బాగా అభివృద్ధి చెందుతుందన్నారు. రూ.440 కోట్లతో నిర్మించిన పోలవరం డయాఫ్రమ్ వాల్‌ను నాశనం చేశారని, దీనిని రూ.990 కోట్లతో సమాంతరంగా కడుతున్నామని తెలిపారు. ఓర్వకల్లును డ్రోన్ సిటీగా ప్రకటించామని, డ్రోన్ పైలెట్లను తయారు చేస్తామని వివరించారు. గోదావరి నుంచి బనకచర్లకు నీళ్ళు తెస్తామన్నారు. ఆత్మకూరు, శ్రీశైలం రోడ్డుపై కూడా శ్రద్ధ పెడతామని తెలిపారు. అనంతరం రోప్‌వే ద్వారా పాతాళగంగ చేరుకుని అక్కడి నుండి సీ ప్లేన్ ద్వారా విజయవాడకు తిరుగు ప్రయాణం అయ్యారు. ముఖ్యమంత్రి పర్యటనలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేశ్, ఎన్ఎండి ఫరూక్, బిసి జనార్ధన్ రెడ్డి, ఎంపి బైరెడ్డి శబరి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, కలెక్టర్ జి.రాజకుమారి, డిఐజి కోయ ప్రవీణ్, ఎస్‌పి అధిరాజ్ సింగ్ రాణా, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

కప్పట్రాళ్లలో తవ్వుతున్నాం

- 'యురేనియం'పై 2023లో పార్లమెంటులో కేంద్రం ప్రకటన
- దేశీయ ఉత్పత్తి పెంచడానికంటూ వివరణ

GOVERNMENT OF INDIA
DEPARTMENT OF ATOMIC ENERGY
RAJYA SABHA
UNSTARRED QUESTION NO. 1288
TO BE ANSWERED ON 14.12.2023.

Plan to increase Uranium resources and supply chain in the country

1288 Shri Sant Balbir Singh:

Will the PRIME MINISTER be pleased to state:

(a) whether, after assessing the long-term demand for Uranium and the supply thereof from indigenous sources, Government plans to increase the Uranium resources and supply chain in the country;
(b) if so, the details thereof and the action taken in this regard;
(c) whether Government is taking any steps to explore Uranium in new places to reduce dependence on imports; and
(d) if so, the details thereof?

ప్రజాశక్తి-అమరావతి

' యురేనియం కోసం కప్పట్రాళ్లలో 2018 తరువాత ఎటువంటి కార్యక్రమాలు చేపట్టలేదు. అప్పుడు కొన్ని బోర్లు వేసి శ్యాంపిల్స్ మాత్రమే తీసుకున్నారు' ఇది యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న ప్రజానీకాన్ని ఉద్దేశించి కర్నూలు జిల్లా కలెక్టర్ ఇటీవల చేసిన ప్రకటన! ఆయనతో పాటు జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు కూడా ఇటువంటి మాటలే చెబుతున్నారు. అయితే, వాస్తవం దీనికి భిన్నంగా వుంది. 'కర్నూలు జిల్లా కప్పట్రాళ్లలో యురేనియం కోసం తవ్వుతున్నాం' అంటూ కేంద్ర ప్రభుత్వం గత ఏడాది పార్లమెంటు సాక్షిగా ప్రకటన చేసింది. 2023 డిసెంబర్ 14న రాజ్యసభలో ఆప్ సభ్యుడు సంత్‌బల్బీర్ సింగ్ అడిగిన ప్రశ్నకు ప్రధానమంత్రి తరపున అప్పటి కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఇచ్చిన రాత పూర్వక సమాధానంలో ఈ విషయం తెలిపారు. అధికారులతో పాటు అధికారపార్టీ నాయకులు చెబుతున్న విధంగా 2018 తరువాత స్థానికంగా ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించపోతే 2023లో కేంద్రం అటువంటి ప్రకటన ఎందుకు చేసింది? పైగా ఈ ప్రశ్నకు ముందు అడిగిన మరో ప్రశ్నకు ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్ఆర్, అన్నమయ్య, పల్నాడు, కర్నూలు, ప్రకాశం జిల్లాల్లో యురేనియం నిక్షేపాలను కనుగొన్నట్లు కేంద్రం తెలిపింది. దాని కొనసాగింపుగా అడిగిన ప్రశ్నకు ఆటమిక్ మినరల్స్ డైరక్టరేట్ ఫర్ ఎక్స్‌ప్లోకరేషన్ అండ్ రీసెర్చి (ఎఎండి) ఆధ్వర్యంలో ఈ తవ్వకాల ప్రక్రియ జరుగుతోందని, యురేనియంలో దేశీయంగా స్వయం సమృద్ధిని సాధించడమే ఈ తవ్వకాల లక్ష్యమని ప్రభుత్వం పేర్కొంది. కర్నూలుతో పాటు దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో యురేనియం మిగతా 7లో



మహమ్మద్ షరీఫ్



చాగంటి కోటేశ్వరరావు



మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి



కొమ్మారెడ్డి పట్టాభిరామ్

ప్రభుత్వ సలహాదారులుగా షరీఫ్, చాగంటి

- 57 కార్పొరేషన్లకు చైర్మన్ల నియామకం
- జాబితా విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులుగా శాసనమండలి మాజీ చైర్మన్ మహమ్మద్ షరీఫ్ (మైనార్టీ అఫైర్స్), ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు (స్టూడెంట్స్ ఎథిక్స్ అండ్ వాల్యూస్)ను నియమించనుంది. వీరితో పాటు 59 నామినేటెడ్ పదవులకు సంబంధించిన జాబితా శనివారం విడుదలైంది. అయితే ఇందుకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులు రావాల్సి ఉంది. వీటిల్లో 57 కార్పొరేషన్ల చైర్మన్ల పేర్లు ఉన్నాయి. 49 టిడిపికి, 9 జనసేనకు, బిజెపికి ఒకటి చొప్పున కేటాయింపులు జరిగాయి. టిడిపికి చెందిన మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిని అగ్రికల్చర్ మిషన్ చైర్మన్‌గా నియమించారు. ఇదే పార్టీకి చెందిన కొమ్మారెడ్డి పట్టాభిరామ్‌కు స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ మిషన్‌కు, ఎపి బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్‌గా నీలాయపాలెం విజయకుమార్, జి కోటేశ్వరవును గ్రంథాలయ పరిషత్ చైర్మన్‌గా, ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ ఆథారిటీ చైర్మన్‌గా ఆనం వెంకట రమణారెడ్డి, ఫైబర్‌నెట్ చైర్మన్‌గా జివి రెడ్డి, జనసేన నేత చిల్లపల్లి శ్రీనివాసరావుకు ఎపి వైద్య సేవా మౌళిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా ఎంపిక చేశారు.

నామినేటేడ్ పదవుల జాబితా 7వ పేజీలో

రేపటి నుండి అసెంబ్లీ

- వైసిపి డుమ్మా
- 'కూటమి' పార్టీలే హాజరు
- సమావేశాల స్థాయిని తగ్గిస్తున్న నేతలు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు సోమవారం నుండి ప్రారంభం కానున్నాయి. సమావేశాల నిర్వహణకు అధికారయంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. అయితే, కీలకమైన ప్రజా సమస్యలు ఏ మేరకు చర్చకు వస్తాయన్నదే అనుమానాస్పదంగా మారింది. శాసనసభలోని ఏకైక ప్రతిపక్షం వైసిపి సమావేశాలకు హాజరుకావడం లేదని ప్రకటించడమే దీనికి కారణం. వైసిపిని మినహాయిస్తే శాసనసభలో టిడిపి కూటమి పార్టీలు మాత్రమే ఉన్నాయి. దీంతో ఉన్న ఒక్క ప్రతిపక్షమూ సభకి దూరమైతే అధికారంలో ఉన్న టిడిపి కూటమి పార్టీల సమావేశాలుగా మాత్రమే అసెంబ్లీ మారనుంది. తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వనందుకు నిరసనగా అసెంబ్లీ సమావేశాలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించిన మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డి తన నివాసం నుండే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తానని ప్రకటించారు. తనకు ఎక్కువ సమయం మైక్ ఇయ్యవలసి వస్తుందనే ప్రతిపక్షహోదా ఇవ్వడం లేదని ఆయన అన్నారు. వైసిపి తీసుకున్న ఈ నిర్ణయాన్ని కూటమి పార్టీలు తీవ్రంగా విమర్శిస్తున్నాయి. అయితే, ప్రజా సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి నిర్ణయాలు చేయాల్సిన అసెంబ్లీ సమావేశాలకు ప్రతిపక్షం దూరంగా ఉండటం ఇదే మొదటి సారి కాదు. రాష్ట్ర విభజన జరిగినతరువాత ఏర్పడిన ప్రతి శాసనసభలోనూ ఇదే పరిస్థితి నెలకొంటోంది. రాష్ట్ర విభజన అనంతరం కొత్తగా ఏర్పడిన తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రతిపక్షనేతగా ఉన్న జగన్మోహన్‌రెడ్డి సమావేశాలను బహిష్కరించారు. 2019లో వైసిపి అధికారంలోకి రాగానే ప్రతిపక్షనేతగా ఉన్న చంద్రబాబును అవమానాల పాలు చేయడంతో ఆయన మాత్రమే సమావేశాలకు రానని చెప్పి వెళ్లిపోయారు. మిగిలిన సభ్యులు హాజరయ్యారు. ఇప్పుడు వైసిపి వంతు రావడంతో, సమావేశాలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించింది. అధికార, ప్రతిపక్ష పార్టీ సభ్యుల తీరుతో సమావేశాల స్థాయి కూడా దిగజారుతోందన్న విమర్శలు వస్తున్నాయి. . ఎవరు అధికారంలో ఉంటే వారు ప్రతిపక్ష పార్టీలపై ఏకపక్షంగా విరుచుకుపడటం, హేళన చేయడం, నోటికొచ్చినట్లు మాట్లాడటం ఆనవాయితీగా మారుతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. . కొత్త సభ్యులు సభలో వాడకూడని పదాలు వాడుతున్నా నియంత్రణ కూడా ఉండటం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాటి అమలుపై చర్చలు జరగడం మిగతా 7లో

అసెంబ్లీలో ప్రజల తరపున పోరాడాలి

'ప్రతిపక్షహోదాతో సంబంధం లేకుండా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యులు అసెంబ్లీ సమావేశాలకు హాజరై ప్రజల తరపున నిలబడి పోరాడటం వారి బాధ్యత. ఆ బాధ్యత నుంచి తప్పుకుని సమావేశాలు బహిష్కరించడం సరైంది కాదు. ఇది ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడమే కాకుండా అధికార పక్షానికి మేలు చేకూరుస్తుంది. ఈ విషయాన్ని ప్రతిపక్ష పార్టీ దృష్టిలో పెట్టుకోవాలి. అధికార, ప్రతిపక్షాల సమాహారంగా ఉండాల్సిన అసెంబ్లీ ఏకపక్షంగా జరగడం వల్ల ప్రజాసమస్యల పరిష్కారానికి ఏమాత్రం తోడ్పడదు. ప్రతిపక్ష పార్టీ పనిచేయడానికి వీలైన వాతావరణాన్ని అసెంబ్లీలో కల్పించాల్సిన బాధ్యత అధికార పక్షంపై ఉంది'

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

నిలదీస్తామనే

'వైసిపి సభ్యులకు అసెంబ్లీలో గత సమావేశంలో మైకు ఇచ్చాము. ఇప్పుడు కూడా ఇస్తాము. సభకు వచ్చి వారి అభిప్రాయాలు చెప్పాలి. మైకు ఇవ్వలేదనడం సరికాదు. హోదాలతో పనిలేదు. సభకు వచ్చి వారి అభిప్రాయం చెప్పడానికి ఇబ్బంది ఏమిటి. గత ప్రభుత్వ అవినీతి, అక్రమాలు, నియంతృత్వ పోకడలపై నిలదీస్తామనే వారు సభకు రావడం లేదు'

రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు

వెళ్లడం ఎందుకు ?

'అసెంబ్లీలో సమస్యలపై చర్చించేందుకు సమయం కావాలి. ప్రతిపక్ష హోదా లేనప్పుడు అది సాధ్యం కాదు. అందువల్లే సమావేశాలకు వెళ్లడం లేదు. స్పీకర్ అనుసరిస్తున్న తీరు కూడా సరిగాలేదు. అందువల్లే మేము సమావేశాలకు వెళ్లకూడదని నిర్ణయించుకున్నాం.'

వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి

పేదల గుడిసెలు తొలగింపు


- అడ్డుకున్న వారిపై పోలీసుల ప్రతాపం
- పలువురు గృహనిర్బంధం
- అర్హులందరికీ ఇంటి పట్టా ఇవ్వాలి : సిపిఎం



గుడిసెల తొలగించడంతో ధ్వంసమైన సామగ్రి, బండలు, రేకులు

ప్రజాశక్తి- హిందూపురం

శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం పట్టణ పరిధిలోని కొల్లకుంట సమీపంలోగల ప్రభుత్వ స్థలంలో తొమ్మిది నెలల క్రితం పేదలు నిర్మించుకున్న గుడిసెలను పోలీసులు తొలగించారు. సిపిఎం, ప్రజాసంఘాల నాయకులను గృహనిర్బంధం చేశారు. పోలీసులు అనుమాష్యంగా వ్యవహరించడాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ ఖండించారు. అర్హులందరికీ ఇంటి పట్టా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూ పోరాటంలో భాగంగా సుమారు 8.5 ఎకరాల్లో సిపిఎం ఆధ్వర్యంలో 446 నిరుపేద కుటుంబాలు గుడిసెలు వేసుకున్నాయి. రెవెన్యూ అధికారులు శనివారం తెల్లవారుజామున వందలాది మంది పోలీసులు బందోబస్తుతో జెసిబిలతో గుడిసెలను తొలగించారు. దీంతో, పేదల గుడిసెల్లోని సామగ్రి చెల్లాచెదురైంది. గుడిసెలకు వేసుకున్న బండలు, రాళ్లు, రేకులు ధ్వంసమయ్యాయి. ఈ సందర్భంగా పలువురికి గాయాలయ్యాయి. పోలీసుల చర్యలను అడ్డుకొనేందుకు ప్రయత్నించిన పలువురు సిపిఎం, ప్రజాసంఘాల నాయకులను, పేదలను పోలీసులు అరెస్టు చేసి హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు స్టేషన్లకు తరలించారు. దీనిని నిరసిస్తూ సిపిఎం జిల్లా నాయకులు జడ్‌పి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో పెనుగొండ రహదారిపై పేదలు, సిపిఎం నాయకులు, కార్యకర్తలు రాస్తారోకో చేశారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించాల్సిన పోలీసులు పలువురి నాయకులను అరెస్టు చేసి లేపాక్షి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో, బాధితులతో కలిసి హిందూపురం తహశీల్దార్ కార్యాలయం ముందు సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా పేదల సొంతింటి కల మాత్రం నెరవేర్చడం లేదన్నారు. నిలువ నీడలేని నిరుపేదలు సొంతింటి కల నెరవేర్చుకోవడానికి సిపిఎం ఆధ్వర్యంలో భూ పోరాటంలో భాగంగా నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేయడం అమానుష్యమన్నారు. ఈ ప్రాంతంలో అర్హులైన నిరుపేదలందరికీ, పాత్రికేయులకు కూడా ఇంటి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జర్నలిస్టులు, పేదల పక్షాన నిలబడి పెద్ద ఎత్తున పోరాడుతామని హెచ్చరించారు. ఆందోళన కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఇఎస్ వెంకటేష్, భూ పోరాట కమిటీ నాయకులు, పేదలు పాల్గొన్నారు. అరెస్టు చేసిన వారందరినీ పోలీసులు విడుదల చేశారు.



ఆర్థికం.. మందగమనం

- పడిపోతున్న పట్టణ వినిమయం
- పెరుగుతున్న కుటుంబ రుణ భారాలు
- హెచ్చు వడ్డీ రేట్లతో ఒత్తిడి
- స్టాక్ మార్కెట్ల కుదేలు..

3

పాక్ రైల్వే స్టేషన్‌లో ఆత్మాహుతి బాంబు దాడి

26 మంది మృతి,మరో62 మందికి గాయాలు

- ఇది తమ పనేనన్న బిఎల్ఎ



ఇస్లామాబాద్ : పాకిస్తాన్‌లోని క్వెట్టా రైల్వేస్టేషన్‌లో ఆత్మాహుతి బాంబు దాడిలో 26మంది మరణించారు. 14 మంది సైనిక సిబ్బందితో సహా 26 మంది మరణించారు. మరో 62 మంది గాయపడ్డారు. శనివారం ఉదయం 9గంటల సమయంలో పెషావర్‌కు బయలుదేరడానికి జాఫర్ ఎక్స్‌ప్రెస్ సిద్ధంగా వున్న సమయంలో ప్రయాణికులందరూ ప్లాట్‌ఫారమ్‌పై గుమిగూడి వుండగా ఒక్కసారిగా పెద్ద పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి ఆ ప్రాంతమంతా కకావి కలమైంది. ప్లాట్‌ఫారమ్ పై కప్పు ఎగిరిపడింది. ఆత్మాహుతి దాడికి పాల్పడిన వ్యక్తి లగేజ్‌తో స్టేషన్‌లోకి ప్రవేశించాడని సీనియర్ పోలీస్ అధికారి ఒకరు తెలిపారు.. ఈ దాడి తమ పనేనని తీవ్రవాద సంస్థ బలూచి లిబరేషన్ ఆర్మీ (బిఎల్ఎ) ప్రకటించింది. బలూచిస్తాన్ వనరులన్నింటినీ ఫెడరల్ ప్రభుత్వం హరిస్తూ, రాష్ట్ర అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తోందని బిఎల్ఎ ఆరోపించింది. ఈ విద్రోహ చర్య వెనుక విదేశీ శక్తులు వున్నాయని ప్రభుత్వం ఆరోపించింది. బలూచిస్తాన్‌లోని మత్సంగ్ జిల్లాలో బాలికల పాఠశాల, ఆస్పత్రికి సమీపంలో జరిగిన పేలుడులో ఐదుగురు చిన్నారులతో సహా 8మంది మరణించిన ఘటన మరువక ముందే ఈ దాడి చోటు చేసుకుంది. ఘటన జరిగిన వెంటనే సహాయక బృందాలు స్పందించాయి.

ప్రభుత్వం మారినా పాత విధానాలే

- వి శ్రీనివాసరావు
- శ్రీకాకుళం జిల్లా 18వ మహాసభ ప్రారంభం
- పలాసలో ర్యాలీ, బహిరంగ సభ

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం పోయి టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పాత విధానాలనే అమలు చేస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. సిపిఎం శ్రీకాకుళం జిల్లా 18వ మహాసభ పలాసలో శనివారం ప్రారంభమైంది. పలాస బస్టాండ్ నుంచి కాశీబుగ్గ సంత మైదానం వరకు భారీ ర్యాలీ జరిగింది. అనంతరం అక్కడ నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కరెంట్ ఛార్జీలను పెంచబోమని ఎన్నికల ముందు చెప్పిన చంద్రబాబు ఇంధన, సర్దుబాటు ఛార్జీల పేరుతో యూనిట్‌పై రూ.1.50 వరకు పెంచి ప్రజలపై తీవ్ర భారం మోపుతున్నారన్నారు. జగన్ ప్రభుత్వం అమలు చేసిన వాటిని అమలు చేసేందుకే జనం ఓట్లేశారా అని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు కొత్తగా సంక్షేమ పథకాలు అమలు చేయకపోగా అదానీ, షిర్డీసాయి ఎలక్ట్రికల్ వంటి సంస్థలకు మేలు చేసేలా స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసి ప్రజలపై భారం వేసేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. స్మార్ట్ మీటర్లతో ప్రజలకు తీవ్ర నష్టమని ఎన్నికల ముందు లోకేష్ చెప్పారని, ఇప్పుడు జగన్ విధానాలనే అమలు చేస్తే ఎవరికి ఎలా వాత పెట్టాలో ప్రజలకు బాగా తెలుసునని అన్నారు. భూ సమగ్ర చట్టం, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల ఏర్పాటు ఇలా... మోడీ చెప్పిన ప్రతి పని చేసిన జగన్ ఓటమి పాలయ్యారని గుర్తు చేశారు. మోడీది ధృతరాష్ట్ర కౌగిలి అని, బిజెపితో పొత్తు పెట్టుకున్న అన్నాడిఎంకె, శివసేన నష్టపోయాయని గుర్తు చేశారు. విశాఖలోని రుషికొండను టిడిపి కూటమి ప్రభుత్వం కూడా తమ సొంత విలాసాలకు వాడుకోవాలని చూస్తోందని అన్నారు. అది ప్రజల ఆస్తి అని, దాన్ని మ్యూజియం లేదా శాస్త్ర సాంకేతిక ల్యాబ్ వంటి ప్రజల అవసరాలకు వినియోగించాలని డిమాండ్ చేశారు. మోడీ వికసిత్ భారత్, చంద్రబాబు విజన్ 2047 అన్నీ అమెరికా ఆదేశాలకనుగుణంగానే చేస్తున్నారని వివరించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై ఒక్కో రాజకీయ పార్టీ ఒక్కో తీరున మాట్లాడుతోందని విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుతారనే అక్కడి ఎమ్మెల్యేకు ప్రజలు భారీ మెజార్టీ కట్టబెట్టారని, పెట్టుబడులు ఇవ్వకుండా, గనులు కేటాయించకుండా, ఉద్యోగులందరినీ తొలగించి ఏదోవిధంగా మూసేయాలని చూస్తున్నారని వివరించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ పక్కనే అంతర్జాతీయ స్టీల్ యజమాని మిట్టల్‌కు ఐదు వేల ఎకరాలు ఇచ్చి స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేస్తారని చెప్తున్నారని, దాన్ని ఎవరడిగారని శ్రీనివాసరావు ప్రశ్నించారు. పెట్టుబడులు, ఉద్యోగాల పేరుతో విశాఖ స్టీల్‌ను మిట్టల్ కంపెనీకి దోచిపెట్టాలని కుట్ర చేస్తున్నారని విమర్శించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ మాట్లాడుతూ ఉద్దానం రైతులు పండించే జీడి పిక్కలకు గిట్టుబాటు ధర రాకపోవడానికి మోడీ అనుసరిస్తోన్న దుర్మార్గమైన విధానాలే కారణమన్నారు. కస్టమ్స్ సుంకాలు తగ్గించి విదేశాల నుంచి జీడి పిక్కలు రావడం వల్ల ఇక్కడి రైతాంగం తీవ్రంగా నష్టపోతోందని తెలిపారు. జీడి పిక్కలకు మార్కెట్, కార్మికులకు ఉపాధి గ్యారంటీ ఇచ్చే విధానాల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. జీడిపిక్కలకు మద్దతు ధర కోసం బోర్డు, కార్మికుల రక్షణ చట్టం, మహిళలకు ప్రత్యేక రక్షణలు వంటి విధానాల అమలు ద్వారా కేరళలోని సిపిఎం నాయకత్వంలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ఆదర్శనీయంగా నిలిచిందని తెలిపారు. సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ఉక్కు ప్రయివేటీకరణ కుట్రలను తిప్పికొడతాం : సిఐటియు



ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేసేందుకు కేంద్రంలోని మోడీ సర్కారు పన్నుతున్న కుట్రలను పోరాటాలతో తిప్పికొడతామని సిఐటియు సీనియర్ నాయకులు ఎన్.రామారావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1367వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ ఒబిసి అసోసియేషన్ నాయకులు, ఉక్కు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుపరం చేస్తే రిజర్వేషన్లకు విఘాతం కలుగుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటుపరమైతే జరిగే నష్టాలను తెలియజేశారు.

ఉత్పత్తికి సరిపడా ముడి సరుకు ఇవ్వకుండా, సొంత గనులు కేటాయించకుండా స్టీల్‌ప్లాంట్‌ను మోడీ సర్కారు నిర్వీర్య పరుస్తోందన్నారు. సుదీర్ఘ కాలంగా ఉక్కు పరిరక్షణ పోరాటం జరుగుతున్నా కేంద్రానికి పట్టకపోవడం దారుణమన్నారు. కార్మికుల ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీస్తూ వారి జీవితాలతో ఆటలాడుకుంటోందని తెలిపారు. ఈ చర్యలన్నింటికీ రానున్న కాలంలో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి థీమ్‌తో గన్నవరం ఇంటిగ్రేటెడ్ టెర్మినల్

- జూన్ నాటికి పూర్తి చేయాలి : సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గన్నవరం ఎయిర్‌పోర్టులో రూ.611 కోట్లతో చేపట్టనున్న న్యూ ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ భవన సముదాయాన్ని కూచిపూడి నేపథ్యంలో నిర్మించాలని, ఈ మేరకు డిజైన్లను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంబంధిత అధికారులను ఆదేశించారు. 2025 జూన్ నాటికి పనులు పూర్తి చేయాలన్నారు. ఉండవల్లిలోని తన నివాసంలో గన్నవరం ఎయిర్‌పోర్టు విస్తరణ పనులపై కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రవాణా శాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డితో కలిసి చంద్రబాబు సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత డిజైన్లు మార్చాలని, రాష్ట్ర సంస్కృతి ప్రతిబింబించే విధంగా ఇంటీరియర్ డిజైన్లు ఉండాలని నిర్దేశించారు. రాష్ట్రంలో కొత్తగా 5 చోట్ల ఎయిర్ స్ట్రిప్‌లు అందుబాటులోకి తేవాలనే యోచిస్తున్నట్లు తెలిపారు. మూలపేట, కుప్పం, దగదర్తి, తాడేపల్లిగూడెంతో పాటు అనంతపురం - తాడిపత్రి మధ్యలో ఎయిర్ స్ట్రిప్ తీసుకువచ్చే ఆలోచనలో ఉన్నామన్నారు. పౌర విమానయాన అధికారులు ప్రజంటేషన్ ద్వారా ప్రస్తుత పనుల పురోగతిని చంద్రబాబుకు వివరించారు. ఇప్పటి వరకు 58.50 శాతం పనులు పూర్తి అయినట్లు తెలిపారు. అదే విధంగా రూ.85 కోట్లతో నిర్మిస్తున్న ఎటిసి టవర్ పనులు 52 శాతం పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

కొత్త నాయకత్వాన్ని తయారు చేయండి

- నామినేటెడ్ నేతలతో పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నామినేటెడ్ పదవులు పొందిన నాయకులు..కొత్త నాయకత్వాన్ని తయారు చేయాలని జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ సూచించారు. మంగళగిరిలోని జనసేనపార్టీ కార్యాలయంలో శనివారం రెండో విడతలో నామినేటెడ్ పోస్టులు పొందిన నేతలతో ఆయన సమావేశమయ్యారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పులు, అవినీతి పునరావృతం కాకుండా పనిచేయాలని ఈ సందర్భంగా పవన్ సూచించారు. అన్ని సామాజిక తరగతులకు చెందిన ప్రజలు ఆదరిస్తేనే నాయకుడు అవుతారని, కుల,మత, ప్రాంతాలకు, రాజకీయాలకు అతీతంగా నడుచుకోవాలని, సామాన్యులకు అండగా నిలువాలని ఉద్బోధించారు. మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోలీస్ వ్యవస్థను బెదిరిస్తున్నారని పవన్‌కల్యాణ్ ఆరోపించారు. కాగా టిటిడి సభ్యులుగా బాధ్యతలు స్వీకరించిన బి మహేందర్‌రెడ్డి, అనుగోలు రంగశ్రీ, బి ఆనందసాయి విడిగా పవన్‌తో భేటీ అయ్యారు.

మోసపూరిత విధానాలను వ్యతిరేకించండి

- రెండో రోజూ కొనసాగిన సిపిఎం ప్రజాపోరు
- ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ
- గ్రామ, వీధి సమావేశాలు నిర్వహణ


ప్రజాశక్తి -యంత్రాంగం

కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా, ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఎం చేపట్టిన ప్రజాపోరు రెండోరోజు శనివారం కొనసాగింది. ఇంటింటికి కరపత్రాలను పంచుతూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 14 న జిల్లా కలెక్టరేట్ల వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ప్రజలను కోరారు. అధిక ధరలను నియంత్రించి, నిత్యావసర ధరలను అందుబాటులోకి తీసుకురావాలని, విద్యుత్ ట్రూ అప్ ఛార్జీల రద్దు, ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ నిర్ణయం ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పలువురు నాయకులు డిమాండ్ చేశారు.

కర్నూలు మండలం, ఇ.తాండ్రపాడు గ్రామంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు పర్యటించి, ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మోసపూరిత విధానాలను వ్యతిరేకించాలని కోరారు. ఒకే దేశం, ఒకే ఎన్నిక, ఒకే నాయకుడు ఉండాలని ఉద్దేశంతో జమిలి ఎన్నికలు తీసుకురావాలని చూస్తున్నారని, ఇది ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కడమేనని విమర్శించారు. వక్ఫ్‌బోర్డ్ భూముల సమస్యపై వివాదం చేస్తూ కార్పొరేట్ కంపెనీలకు ఆ భూములు అప్పచెప్పాలనే విధానం అవలంభిస్తున్నారని చెప్పారు. టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఒకటి మాత్రమే అమలు చేసి మిగతా వాటి గురించి మాట్లాడడం లేదని విమర్శించారు. కర్నూలు ఓల్డ్‌సిటీ ప్రాంతంలోని కవాడివీధి, రంగరాజువీధి, చిన్న మార్కెట్, వన్‌టౌన్ ప్రాంతాలలో ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు.

విశాఖ జిల్లా పరిధిలోని జివిఎంసి ఒకటో వార్డు కొత్తపేట, ఐదో వార్డు పరదేశిపాలెం ప్రాంతాల్లో సిపిఎం నాయకులు పాదయాత్ర నిర్వహించారు. 97వ వార్డు పరిధి వీరనగర్, 98వ వార్డు పరిధి అప్పన్నపాలెం ప్రాంతాల్లో ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన తెలిపారు. అనకాపల్లి జిల్లాలో పలుచోట్ల పోస్టర్లను ఆవిష్కరించారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని కోడెల శివప్రసాద్ స్టేడియం, చంద్రబాబునాయుడు కాలనీలో ఇంటింటీ ప్రచారం నిర్వహించారు. గుంటూరు జిల్లాలో తుళ్లూరు, దొండపాడు, అబ్బరాజుపాలెం, బోరుపాలెం, వడ్లమాను, పెదపరిమి, రాయపూడి, లింగాయపాలెం, వెలగపూడి, మల్కాపురం, మందడం,తాళాయి పాలెం, వెంకటపాలెంలో ప్రజాపోరు యాత్ర నిర్వహించారు. తిరుపతి జిల్లా పుత్తూరులో అంబేద్కర్ సర్కిల్ నుంచి సమీపంలోని పెట్రోల్ బంక్ వరకూ కరపత్రాలను పంపిణీ చేశారు. శ్రీకాళహస్తిలో ఎస్‌డికె నగర్, తొట్టంబేడు మండలంలోని బోనుపల్లి, కంచనపల్లి గ్రామాల్లో నాయకులు పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు.

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం భీమనపల్లి కాలనీ, అమలాపురం మండలం కుమ్మరి కాలవగట్టు ప్రాంతం, తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఆవ వాంబే కాలనీ, పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణంలోని 38వ వార్డు లంకపేట లో ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. తణుకులో కప్పల వెంకన్న సెంటర్, నరేంద్ర సెంటర్, గణేష్ చౌక్ వద్ద గ్రూప్ సమావేశాలు నిర్వహించారు. ఏలూరులో తంగెళ్లమూడి, తాపీమేస్త్రి కాలనీ, కుమ్మరిరేవు, లంకపేట, రాణినగర్, ఇజ్రాయిల్ పేట, ముస్లింబజార్, కండ్రిక గూడెం, చోడిదిబ్బ ప్రాంతాల్లో వీధి సభలు నిర్వహించారు. అనంతపురం జిల్లా గుంతకల్లు, శింగనమల, పుట్లూరు, రాయదుర్గం, గుత్తి తదితర ప్రాంతాలు, నెల్లూరు, విజయనగరం, ఎన్‌టిఆర్ జిల్లా ఏ. కొండూరు, కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులో ప్రజాపోరు యాత్ర సాగింది.



అనంతపురం జిల్లా గుంతకల్లులో ప్రజాసమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

సచివాలయాల వ్యవస్థను గాడిలో పెట్టాలి : బొప్పరాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులందరూ ఐక్యంగా కలిసి నడవాలని ఎపిజెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. విజయవాడ గాంధీనగర్ రెవెన్యూభవన్‌లో ఎపి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులసంస్థ రాష్ట్ర కార్యవర్గ సమావేశం శనివారం ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు వేల్పుల ఆర్లయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బొప్పరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్థంగా ఉన్న గ్రామ సచివాలయాల వ్యవస్థను ప్రభుత్వం గాడిలో పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఎపి గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థకు తాము ఎప్పుడూ అండగా ఉంటామన్నారు. ఈ సమావేశంలో జెఎసి అమరావతి నాయకులు కెపి చంద్రశేఖర్, సంగీతరావు, పొన్నూరు విజయలక్ష్మీ, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్‌వి రాజేష్, ప్రధాన కార్యదర్శి అనుపమ పాల్గొన్నారు.

11న రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయ దినోత్సవం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో


జాతీయ విద్యాదినోత్సవంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయ దినోత్సవాన్ని కూడా ఈ నెల 11న నిర్వహించనున్నారు. విజయవాడలోని ఎ కన్వెన్షన్ సెంటర్‌లో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేయనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హాజరుకానున్నారు. ప్రతి ఏటా సెప్టెంబర్ 11న జరగాల్సిన రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఈ ఏడాది వరదల కారణంగా నిర్వహించని సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జాతీయ విద్యా దినోత్సవం నాడే రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయ దినోత్సవం కూడా నిర్వహించి పాఠశాల విద్య, కళాశాల, సాంకేతిక విద్య, యూనివర్సిటీల విభాగాల నుంచి ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రభుత్వం పురస్కారాలు అందజేయనుంది.

విశాఖ నడిబొడ్డున గంజాయి సాగు

- కెజిహెచ్ కొండపై గుట్టుచప్పుడు కాకుండా పెంపకం
- ఇద్దరు అరెస్ట్, మరో ఇద్దరు పరారీ

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖ నగరం నడిబొడ్డున... అది కూడా కింగ్ జార్జి హాస్పటల్ (కెజిహెచ్) చెంతన వైద్య, నర్సింగ్ విద్యార్థులు ఉండే ప్రాంతంలో గంజాయి సాగు చేస్తున్న విషయం శనివారం విశాఖలో కలకలం రేపింది. సాధారణంగా ఏజెన్సీలో సాగయ్యే గంజాయిని విశాఖ వంటి మహానగరంలో, అందునా ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయినిగా ఉన్న కెజిహెచ్ కొండ పైభాగంలో నర్సింగ్ విద్యార్థుల హాస్టల్ వెనుక గుర్తు తెలియని వ్యక్తులు సాగు చేస్తున్నారన్న విషయం విస్మయం గొలిపింది. గంజాయి సాగు విషయం తెలుసుకున్న విశాఖ వన్‌టౌన్ పోలీసులు శనివారం సంబంధిత ప్రాంతంలో దాడులు నిర్వహించారు. అదే ప్రాంతంలో కోన ప్రేమ్ కుమార్, కోన అభికుమార్‌లను అరెస్టు చేశారు. ఈ యువకులిద్దరూ వన్ టౌన్ ఎగువగల రెల్లి వీధికి చెందినవారు. వీరిలో ప్రేమ్ కుమార్ రౌడీ షీటర్. ఈ సంఘటనతో సంబంధం కలిగిన సంపత్, దాసు పరారీలో ఉన్నట్లు వన్ టౌన్ సిఐ జిడి.బాబు మీడియాకు తెలిపారు. ఏజెన్సీ నుంచి వారు గంజాయి మొక్కలు తెచ్చి ఇక్కడ పెంచుతున్నట్లు తెలిసిందన్నారు. వారు పెంచుతున్న గంజాయి మొక్కలను, అమ్మకానికి సిద్ధం చేసిన పొడి గంజాయిని సీజ్ చేశామని చెప్పారు. పరారీలో ఉన్న ఇద్దరి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా... ఏజెన్సీ నుంచి కొన్ని గంజాయి మొక్కలను తీసుకొచ్చి దాదాపు ఏడాది క్రితం కెజిహెచ్ సమీపంలోని లేడీస్ హాస్టల్, ఆంధ్రా మెడికల్ కళాశాలతో పాటు నేవీ ఆధీనంలో ఉన్న మరికొన్ని ప్రాంతాల్లో కొందరు సాగు చేస్తున్నారన్న సమాచారంతో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఇటీవల కెజిహెచ్‌తోపాటు చుట్టుపక్కల ప్రదేశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ నేపథ్యంలోనే శనివారం పోలీసులు ఈ ప్రాంతాన్ని జల్లెడ పట్టి గంజాయి మొక్కలు ఉన్న ప్రాంతాన్ని గుర్తించారు. విశాఖ నగరంలో గంజాయి సాగు విషయం తెలుసుకుని ప్రజలు అవాక్కయ్యారు.



కెజిహెచ్ కొండపై సాగు చేసిన గంజాయి మొక్కలు

తక్షణమే డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ నియామకానికి సంబంధించిన డిఎస్సి నోటిఫికేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్రకమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వై రాము, జి రామన్న శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు తొలి సంతకాన్ని డిఎస్సి ఫైలుపైనే చేశారని, దీనికి తొలి ప్రాధాన్యత ఇచ్చి నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. సాకులు చెప్పి వాయిదాలు వేయడం సరికాదన్నారు. ఆరేళ్ల నుంచి డిఎస్సి నోటిఫికేషన్ లేదని పేర్కొన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం విడుదల చేస్తుందని నిరుద్యోగులు భావించి అత్యధిక సీట్లలో గెలిపించారని తెలిపారు. నిరుద్యోగుల నమ్మకాన్ని వమ్ము చేయొద్దని, వారు రోడ్లపైకి రాకముందే సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. పట్టభద్ర, ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలు త్వరలో ఉన్నాయని తెలిపారు. వీటిని దృష్టిలో పెట్టుకొని కాలయాపన చేయొద్దని పేర్కొన్నారు. నోటిఫికేషన్‌లో ఏ జిల్లాకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. ఒక జిల్లాకు ఒకే పేపర్ వచ్చే విధంగా పరీక్షలు నిర్వహించాలని కోరారు. నోటిఫికేషన్ ప్రకటించకపోతే నిరుద్యోగులతో కలిసి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయండి

- అంగన్‌వాడీల సదస్సులో నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమగ్రశిశు అభివృద్ధి పథకం (ఐసిడిఎస్) ప్రారంభమై 50 ఏళ్లయిన సందర్భంగా దేశ పురోభివృద్ధికి ఎంతో కీలకమైన ఐసిడిఎస్ పథకం సర్ణోత్సవాలు సంవత్సరమంతా నిర్వహించాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటి నిర్ణయించింది. యూనియన్ రాష్ట్ర సదస్సు విజయవాడలోని ఎంబివికెలో శనివారం ప్రారంభమైంది. అంగన్‌వాడీల 42 రోజుల సమ్మె విరమణ సందర్భంగా జరిగిన ఒప్పందాలను అమలు చేయాలని, మిని సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేయాలని రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సదస్సులో భాగంగా తొలిరోజు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన అనంతరం ఐసిడిఎస్‌కు బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తూవస్తున్నారని తప్పుబట్టారు. ఫ్రీ స్కూళ్లను దెబ్బతీయడానికి నూతన విద్యా విధానాన్ని అమల్జేస్తున్నారని తెలిపారు. ఐసిడిఎస్ లక్ష్యానికి తూట్లు పొడిచే నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబు తీసుకువచ్చిన నూతన పారిశ్రామిక విధానంలో కార్మికులు, ఉద్యోగుల ప్రస్తావనే లేదని, వీరు లేకుండా పరిశ్రమలు ఏర్పాటు సాధ్యమవుతుందా అని ప్రశ్నించారు. మరోవైపు దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రైవేటు పరం చేసేందుకు మోడీ ప్రయత్నిస్తున్నారని, 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లను యాజమాన్యాలకు అనుకూలంగా తీసుకువచ్చారని చెప్పారు.

మరోవైపు దేశాన్ని పురాతన సమాజం వైపు తీసుకువెళ్లేందుకు ప్రయత్నాలు ఉపందుకున్నాయని తెలిపారు. అధ్యక్ష తరహా పాలనా విధానాన్ని అమలు చేసేందుకు బిజెపి జమిలీ ఎన్నికలను తీసుకువచ్చిందని, ప్రాంతీయ పార్టీలు వాళ్ల స్వార్ధం కోసం దీనికి మద్దతు ఇస్తున్నాయన్నారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సి.హెచ్.నరసింగరావు కార్మికల సమస్యలపై సిఐటియు నిర్వహించిన పోరాటాలు, యూనియన్ విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా 42 రోజుల సమ్మెకు సంబంధించిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. సదస్సులో ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబిరాణి, ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, అన్ని జిల్లా కమిటీల బాధ్యులు, తదితరులు హాజరయ్యారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఐవి

అసెంబ్లీ జాయింట్ సెక్రటరీ విజయరాజు సస్పెండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అసెంబ్లీ జాయింట్ సెక్రటరీ విజయరాజును రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఇందుకు సంబంధించిన జివో 418ను అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర శనివారం విడుదల చేశారు. జ్యుడిషియల్ పరిధిలో ఉన్న రికార్డులు ట్యాంపరింగ్ చేయడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. విజయరాజును హెడ్‌క్వార్టర్స్‌ను విడిచి వెళ్లకూడదని తెలిపారు.



చెకుముకి సంబరాల్లో మాట్లాడుతున్న గేయానంద్

సైన్స్ పట్ల అభిరుచిని పెంచడమే చెకుముకి లక్ష్యం

- ప్రశ్నించేతత్వాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలి
- చెకుముకి రాష్ట్ర స్థాయి సంబరాల్లో డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి - పెందుర్తి (విశాఖపట్నం)

సైన్స్ పట్ల విద్యార్థుల్లో అభిరుచిని పెంచడమే చెకుముకి లక్ష్యమని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అన్నారు. విశాఖలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన రెండు రోజులపాటు తలపెట్టిన రాష్ట్ర స్థాయి చెకుముకి సంబరాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత జనవిజ్ఞాన వేదిక పతాకాన్ని వేదిక రాష్ట్ర అధ్యక్షులు గేయానంద్ ఆవిష్కరించారు. జాతీయ జెండాను స్థానిక పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపల్, జెవివి విశాఖ జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎన్.చంద్రశేఖర్ ఆవిష్కరించారు. సంబరాలను ఉద్దేశించి గేయానంద్ మాట్లాడుతూ చెకుముకి టాలెంట్ టెస్టులో రాష్ట్ర వ్యాపితంగా 4 లక్షల మంది విద్యార్థులు పాల్గొన్నారని, ఇదొక పెద్ద సైన్స్ ఉత్సవమని తెలిపారు. సైన్స్‌ను అర్థం చేసుకోవడం, దానిపట్ల ఉత్సుకతను కలిగించడం, పిల్లల్లో ప్రశ్నించేతత్వాన్ని పెంపొందించడం చెకుముకి ధ్యేయమన్నారు. విద్యార్థుల్లో జిజ్ఞాసను వెలికితీసేదిగా నేటి విద్యావ్యవస్థ లేదని తెలిపారు. అందుకే నోబెల్ బహుమతి దేశానికి రావడం గగనంగా ఉందన్నారు. వరంగల్ ఎన్ఐటి ప్రొఫెసర్ రామచంద్రయ్య మాట్లాడుతూ చెకుముకి వంటి టాలెంట్ టెస్టుల వైపు పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ మనం చేసే పనులే సమాజంలో గుర్తింపునిస్తాయని తెలిపారు. రాష్ట్ర నలుమూలల నుంచి హాజరైన విద్యార్థులు సైన్స్ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, ఎన్ఎస్‌టిఎల్ టెక్నికల్ డైరెక్టర్ జివి.మనోజ్ కుమార్, సైంటిస్ట్ విజయకుమార్, రాష్ట్ర సమతా పూర్వ కన్వీనర్ రాధారాణి, డాక్టర్ పద్మ, నిర్మల, జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామారావు, చెకుముకి కన్వీనర్ కెఎమ్ఎమ్ఆర్.ప్రసాద్, మురళీధర్, త్రిమూర్తులు, కె.శ్రీనివాసు, ఎస్‌వికె.పరశురామ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమాదేవి

అసమానతలు లేని సమాజం కోసం పోరాటం

- ఎస్ఎఫ్ఐ శిక్షణ తరగతుల్లో ఐద్వా కార్యదర్శి రమాదేవి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అసమానతలు లేని సమాజం కోసం పోరాటాలు నిర్వహించాలని ఐద్వా రాష్ట్రకార్యదర్శి డి రమాదేవి అన్నారు. ఎస్ఎఫ్ఐ విద్యార్థినుల శిక్షణ తరగతులు విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో శనివారం ప్రారంభమయ్యాయి. సంఘం గర్ల్స్ కో కన్వీనర్ నవిత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రమాదేవి హాజరై మాట్లాడారు. పసిబిడ్డ నుంచి వృద్ధుల వరకూ అత్యాచారాలు జరుగుతున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. డ్రగ్స్, మద్యం రోజురోజుకు పెరుగుతున్నాయని, వీటి మత్తులోనే నేరాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. వీటిని ప్రభుత్వం నివారించలేకపోతుందని విమర్శించారు. మహిళల రక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని కోరారు. సమాజంలో అన్ని రంగాల్లో తమదైన పాత్ర పోషిస్తున్న మహిళల పట్ల ఇంకా వివక్ష కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక కార్యకర్త విద్యా ఖన్నా మాట్లాడుతూ విద్యాలయాల్లో విద్యార్థినులకు రక్షణ కల్పించాలని కోరారు. శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకొని సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, ఎ అశోక్, నాయకులు అమూల్య, జ్యోతి, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికం.. మందగమనం

• పడిపోతున్న పట్టణ వినిమయం • పెరుగుతున్న కుటుంబ రుణ భారాలు • హెచ్చు వడ్డీ రేట్లతో ఒత్తిడి • స్టాక్ మార్కెట్లు కుదేలు..

ప్రజాశక్తి - బిజినెస్ డెస్క్

భారత ఆర్థిక వ్యవస్థలో మందగమనం ఛాయలు కొట్టచ్చినట్లు కనబడుతున్నాయి. ప్రపంచంలోనే అత్యధిక వేగంగా వృద్ధి చెందుతోన్నామని బిజెపి పాలక వర్గాల ప్రచారానికి.. వాస్తవ పరిస్థితులకు పొంతన లేకుండా పోయింది. దేశంలోని పట్టణ ప్రజల్లో వినియమం తగ్గడం, కార్పొరేట్ల ఆదాయాల్లోనూ పతనం చోటు చేసుకుంటుంది. అధిక వడ్డీ రేట్లు, హెచ్చు పన్నులకు తోడు కుటుంబ రుణ భారాలు పెరిగిపోతూ.. వ్యక్తిగత రుణాలు చెల్లించలేని పరిస్థితులు పెరుగుతున్నాయి. వెరసీ ఈ ప్రభావం కార్పొరేట్ కంపెనీల అమ్మకాలపై పడుతోంది. దీంతో ఇటీవల సెప్టెంబర్ త్రైమాసికంలో అనేక కంపెనీల ఆదాయాలు భారీగా పడిపోయాయి. మరోవైపు దలాల్ స్ట్రీట్ అమ్మకాల ఒత్తిడితో బెంబెలెత్తుతోంది. స్టాక్ మార్కెట్లలో పండుగ వాతావారణం ఆవిరై మదుపర్లు భారీ నష్టాలను ఎదుర్కోంటున్నారు. ఈ పరిణామాలన్నీ మాంద్యానికి సంకేతాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మధ్యతరగతి కొన లేరు..

ఆదాయాలు తగ్గడంతో పట్టణ వినిమయం భారీగా పడిపోతోంది. ముఖ్యంగా అధిక వడ్డీ రేట్లు, హెచ్చు ద్రవ్యోల్బణంతో చిన్న మొత్తాల రుణాలు పొందిన వారు తిరిగి సకాలంలో చెల్లించలేకపోతున్నారు. ఉద్యోగులు, కార్మికుల వేతనాల్లోనూ పెంపుదల అంతంత మాత్రమే ఉంటుంది. సెప్టెంబర్ త్రైమాసికంలో విత్తయేతర కార్పొరేట్ కంపెనీలు తమ సిబ్బంది వేతన వ్యయాలను 0.8 శాతమే పెంచాయి. ఇంతక్రితం జూన్ త్రైమాసికంలో 1.2 శాతం పెంపుదల ఉంది. దీని ప్రభావాలు ఇప్పుడు అన్ని రంగాలపై కనబడుతోందని నెస్లే ఇండియా సిఇఒ సురేష్ నారాయణన్ పేర్కొన్నారు. ప్రీమియం వినియోగం బలంగానే ఉన్నప్పటికీ.. మధ్యస్థ విభాగంలో ఒత్తిడి నెలకొందన్నారు. గడిచిన సెప్టెంబర్ త్రైమాసికంలో తమ అమ్మకాల్లో కేవలం 1.4 శాతం పెరుగుదల మాత్రమే ఉందన్నారు. గత రెండేళ్లలో ఇదే అత్యల్ప వృద్ధి రేటు అన్నారు. పండగ సీజన్‌లో స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్ (ఎస్‌యువి) విభాగంలో అమ్మకాలు పడిపోయి 7 లక్షల కార్లు నిల్వ ఉండిపోయిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మైక్రోఫైనాన్స్ రుణాల జారీలోనూ పతనం పెరిగి ంది. ఈ పరిణామాలు మధ్యతరగతి ప్రజల్లో ఆదాయాల పతనాన్ని, మందగమనాన్ని స్పష్టం చేస్తున్నాయి.

జిడిపి డౌన్..

ప్రపంచంలోనే వేగంగా పెరుగుతోన్న ఆర్థిక వ్యవస్థగా చెప్పుకుంటున్న భారత్‌లో అన్ని రంగాల కంపెనీల్లో మందగమనం వైరస్ క్రమంగా పుంజుకుంటుంది. బజాజ్ ఆటో, మారుతి సుజుకి, హిందుస్తాన్ యూనిలీవర్, నెస్లే తదితర సహా చిన్న బ్యాంక్‌లు, ఎన్‌బిఎఫ్‌సిలు ఆదాయాలను కోల్పోతున్నాయి. ఆర్థిక సంవత్సరం 2023-24లో 8.2 శాతం వృద్ధిని నమోదు చేసిన భారత్ ప్రస్తుత 2024-25 తొలి త్రైమాసికంలో జిడిపి 6.7 శాతానికి పరిమితమయ్యింది. రెండో త్రైమాసికంలో వృద్ధి రేటు అంచనాలను 7.2 శాతం నుంచి 7 శాతానికి తగ్గిస్తూ ఆర్‌బిఐ అంచనా వేసింది. 2024-25లో 7.2 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. భారత వృద్ధి 6.5 శాతానికి పరిమితం కావొచ్చని గోల్డ్‌మాన్ సాచే అంచనా వేసింది.

వాహన అమ్మకాలు డీలా..

ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులకు ప్రధాన గీటురాయిగా చూసే వాహన అమ్మకాల్లోనూ పతనం చోటు చేసుకుంది. ఆర్థిక మంత్రిత్వ శాఖ అక్టోబర్ 28న వెల్లడించిన రిపోర్ట్ ప్రకారం.. ఎఫ్‌ఎడిఎ గణంకాలను ఉదహరిస్తూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన ప్రథమార్థంలో వాహన అమ్మకాలు 2.3 శాతం తగ్గాయని వెల్లడించింది. రెండో త్రైమాసికంలో పట్టణ అమ్మకాల్లో తగ్గుదలనే ప్రధాన కారణమని పేర్కొంది. మరోవైపు ఎఫ్‌ఎంసిజి అమ్మకాల పెరుగుదల 2.8 శాతానికి క్షీణించాయి. ఈ రంగం గతేడాది ఇదే త్రైమాసికంలో 10.1 శాతం వృద్ధిని సాధించింది.

దలాల్ స్ట్రీట్‌లోనూ నిరాశలు..


గడిచిన నెల రోజులుగా దలాల్ స్ట్రీట్‌పై బేర్ పంజా కొనసాగుతోంది. అమ్మకాల ఒత్తిడితో రిటైల్ ఇన్వెస్టర్లు భారీ నష్టాలను చవి చూస్తున్నారు. భారత మార్కెట్ నుండి భారీగా ఎఫ్ఐఐలు తరలిపోవడమూ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కోంటున్న సవాళ్లకు నిదర్శనం. బెర్న్‌స్టెయిన్ ఇండియా స్ట్రాటజీ రిపోర్ట్ ప్రకారం.. "నిఫ్టీ 100లోని కంపెనీలు దాదాపు 48 శాతం తమ అంచనాలను కోల్పోయాయి. ఇది మార్చి 2020 తర్వాత అత్యధికం. ఇప్పుడు మార్కెట్లలో ఉత్సాహం (పార్టీ) ముగుస్తోంది. నిఫ్టీ 50 ఆల్‌టైం గరిష్టాల నుంచి 10 శాతం పతనమయ్యింది. ఇది మొత్తం ఆర్థిక వ్యవస్థతో ఏమి జరుగుతుందో అర్థం చేసుకోవడానికి ఓ కారణం. భారత్‌లోని హెచ్చు ద్రవ్యోల్బణం, తక్కువ వేతనాల పెరుగుదల మార్కెట్లపైనా ప్రతిబింబిస్తుంది. గతంలో ఏడాదికి 30 శాతం రాబడిని అందుకున్న ఇన్వెస్టర్లు వచ్చే ఏడాది ఒక్క అంకె స్థాయిలోనే రాబడి పొందే అవకాశం ఉంది." అని బెర్న్‌స్టెయిన్ రిపోర్ట్ పేర్కొంది.

రెండంకెల్లో షేర్ల పతనం

ఆర్థిక వ్యవస్థలో చోటు చేసుకుంటున్న బలహీనతల నేపథ్యంలో దలాల్ స్ట్రీట్‌లో దిగ్గజ కంపెనీల షేర్లు బేర్‌మంటున్నాయి. నిఫ్టీ50లో ఆల్‌టైం గరిష్టాలను చవి చూసిన స్టాక్స్ నేల చూపులు చూస్తున్నాయి. కొన్ని స్టాక్స్ అథోపాతాలానికి పడిపోతున్నాయి. దీంతో వీటిల్లో పెట్టుబడులు పెట్టిన సగటు రిటైల్ ఇన్వెస్టర్లు తీవ్ర ఆందోళనకు గురైతున్నారు. కొత్త పెట్టుబడులు పడిపోతున్నాయి. నవంబర్ 4 నాటి మార్కెట్ వివరాల ప్రకారం పరిశీలిస్తే అనేక కంపెనీల షేర్లు రెండంకెల స్థాయిలో క్షీణించాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్ ఈ ఏడాది ఆల్‌టైం గరిష్ట స్థాయి రూ.3,435 వద్ద నమోదు కాగా.. 16 శాతం పతనమై రూ.2,897కు పడిపోయింది. ఆసియన్ పేయింట్స్ స్టాక్ 15 శాతం విలువ కోల్పోయి రూ.2,915 వద్ద నమోదయ్యింది. ఇండుస్‌ఇండ్ బ్యాంక్ ఏకంగా 37 శాతం, మారుతి సుజుకి 19 శాతం, హీరో మోటో కార్ప్ 23 శాతం, టాటా మోటార్స్ 30 శాతం, యాక్సిస్ బ్యాంక్ 15 శాతం, హిందుస్తాన్ యూనిలీవర్ 17 శాతం, కొటాక్ మహీంద్రా బ్యాంక్ 11 శాతం, నెస్లే ఇండియా 19 శాతం, టిసిఎస్ 14 శాతం చొప్పున నష్టపోయాయి.

డిమాండ్ లేమీ..

గడిచిన రెండున్నరేళ్లలో ఆర్‌బిఐ ఒక్క సారి కూడా వడ్డీ రేట్లను తగ్గించలేదు. అంతక్రితం వరుసగా 2.50 శాతం మేర పెంచి రెపోరేటును 6.50 శాతానికి చేర్చింది. దీంతో రుణ గ్రహీతలపై తీవ్ర భారం పడుతోంది. మరోవైపు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్ట్ కాలంలో భారత సరుకుల ఎగుమతుల్లో కేవలం 1.1 శాతం పెరుగుదల మాత్రమే ఉంది. ఇది ఉద్యోగాల కల్పనకు ఏమాత్రం సరిపోదు. గడిచిన రెండు త్రైమాసికాల్లో డిమాండ్ లేమితో సిమెంట్, ఇనుము, ఉక్కు, రసాయనాల లాంటి ప్రధాన రంగాలు ప్రతికూల వృద్ధిని చవి చూడటం ఆందోళనకరం. తయారీ రంగంలోనూ డిమాండ్ సన్నగల్లింది. ఏడాది క్రితంతో పోల్చితే వినియోగదారుల్లో విశ్వాసం సన్నగిల్లిందని అనేక సర్వేలు చెబుతున్నాయి. ఈ పరిణామాలు ఆర్థిక వ్యవస్థలో తీవ్ర ప్రమాద ఘంటికలను మోగిస్తున్నాయని స్పష్టమవుతోంది.



దేవనకొండ మండలం కోటకొండ గ్రామంలో మాట్లాడుతున్న వి.వెంకటేశ్వర్లు

యురేనియం తవ్వనివ్వం

- తవ్వకాలు చేపట్టబోమని ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలి
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు


ప్రజాశక్తి- దేవనకొండ (కర్నూలు జిల్లా)

కర్నూలు జిల్లా దేవనకొండ మండలం కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్ట్‌లో యురేనియం తవ్వకాలు చేపట్టబోమని ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు గ్రామాలకు వచ్చి ప్రజలకు స్పష్టమైన హామీ ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. యురేనియం తవ్వకాల వల్ల నష్టపోయే గ్రామాల్లో ఆయన శనివారం పర్యటించారు. పి.కోటకొండ, గుండ్లకొండ గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టే చర్యలు చేపడుతోందని, కేవలం పత్రిక ప్రకటన ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని తెలిపారు. ప్రకటనల ద్వారా కాకుండా కలెక్టర్, ప్రభుత్వ పెద్దలు గ్రామాల్లో గ్రామ సభలు పెట్టి యురేనియం తవ్వకాలు జరపబోమని ప్రజలకు స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. తవ్వకాలు జరిగితే ఈ ప్రాంతం తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. రైతులు, వ్యవసాయ కార్మికులు భారీగా నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని చెప్పారు. కార్పొరేట్ కంపెనీలు, పెట్టుబడిదారుల లాభాల కోసం పేదల జీవితాన్ని ఫణంగా పెట్టడం దుర్మార్గమన్నారు. ఈ ప్రాంతంలో యురేనియంను తవ్వనివ్వబోమని తేల్చి చెప్పారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే ప్రతిఘాటిస్తామని హెచ్చరించారు. వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ, జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్, వృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకులు గురుశేఖర్, విద్యార్థి సంఘం నాయకులు అమర్, మండల నాయకులు సూరి, కౌలుట్ల, అస్లాం బాష, గ్రామస్తులు పాల్గొన్నారు.

డిసెంబర్‌లో లక్ష మందికి ఇళ్లు

- మంత్రి పార్థసారథి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



ప్రధానమంత్రి ఆవాజ్ యోజన 1.0 ద్వారా చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలో హౌసింగ్ శాఖ ద్వారా 50 శాతం ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేశామని, ఈ ఏడాది డిసెంబర్‌లో లక్షమందికి ఇళ్ల తాళాలను ఇచ్చేలా నిర్ణయించామని ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. శనివారం తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ఇసుక కొరత కారణంగా పూర్తి స్థాయిలో నిర్మాణాలు జరగలేదన్నారు. దీనిపై అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఇసుక కొరత లేకుండా హౌసింగ్ లే అవుట్లకు నేరుగా ఇసుకను రవాణా చేసేలా నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ఇందుకుగాను ఇసుక రవాణాకు సంబంధించిన బిల్లులను హౌసింగ్ శాఖ ద్వారా చెల్లించే విధంగా ఆదేశాలు ఇచ్చామని తెలిపారు.

అజ్ఞాతంలోకి అవినాష్‌రెడ్డి పిఎ రాఘవరెడ్డి

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

వైఎస్ఆర్ జిల్లా కడప ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి రాఘవరెడ్డిని అరెస్టు చేసేందుకు పోలీసులు శుక్రవారం పులివెందులకు వెళ్లారు. వైసిపి సామాజిక కార్యకర్త వర్రా రవీంద్రారెడ్డితో తప్పించుకొని తిరుగుతున్న సమయంలో ఆయనతో రాఘవరెడ్డి చాటింగ్ చేసినట్టు పోలీసులు గుర్తించారు. ఈ అంశంపై రాఘవరెడ్డిని అదుపులోకి తీసుకొని విచారించేందుకు పోలీసులు ఆయన ఇంటికి వెళ్లారు. విషయం తెలుసుకున్న రాఘవరెడ్డి ఇంటికి రాకుండా అజ్ఞాతంలోకి వెళ్లినట్టు సమాచారం. పులివెందుల అర్బన్ సిఐ జీవన్ రంగనాథ్‌లో వైసిపి లీగల్ అడ్వైజర్ ఓబుల్‌రెడ్డి మాట్లాడారు. రాఘవరెడ్డి వచ్చిన వెంటనే సమాచారం ఇస్తామని చెప్పడంతో పోలీసులు వెనుదిరిగారు.

వాగులో గల్లంతైన వారి మృతదేహాలు లభ్యం

ప్రజాశక్తి - అడ్డతీగల (అల్లూరి జిల్లా)

అల్లూరి జిల్లా అడ్డతీగల మండలం తిమ్మాపురం పంచాయతీ బొంగరాలపాడు ఇసుక ర్యాంపు వద్ద ఏలేరు వాగులో శుక్రవారం గల్లంతైన వారిలో మరో ఇద్దరి మృతదేహాలు శనివారం లభ్యమయ్యాయి. దీంతో ఈ ఘటనలో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం తూర్పు లక్ష్మీపురం గ్రామానికి చెందిన వీరమల్లు భూషణం, ఆయన కుమారుడు జైబాబు, అల్లుడు చిన్న గొంతియ్య, చింతా శ్రీనివాస్ శుక్రవారం ఉదయం ట్రాక్టర్‌కు ఇసుక లోడ్ చేస్తుండగా వాగులో మునిగిపోయిన విషయం తెలిసిందే. వీరిలో జైబాబు, చిన్న గొంతియ్య మృతదేహాలు శుక్రవారమే లభ్యమయాయి. మిగిలిన ఇద్దరి మృతదేహాల కోసం ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు గాలించగా భూషణం (52), చింతా శ్రీనివాస్ (16) మృతదేహాలు శనివారం లభ్యమయ్యాయి. వాటినిశవపంచనామా అనంతరం కుటుంబీకులకు అప్పగించినట్టు ఎస్ఐ వినోద్ తెలిపారు. బాధిత కుటుంబాలను ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్, రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి పరామర్శించారు.

తప్పుడు కేసులు బనాయించారు

- డిజిపికి ఎమ్మెల్యే చంద్రశేఖర్ ఫిర్యాదు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం (ప్రకాశం జిల్లా)

తాను యర్రగొండపాలెం ఎమ్మెల్యేనని కూడా చూడకుండా పోలీసులు తనపై తప్పుడు కేసులు బనాయించి ఇబ్బందులు పెడుతున్నారని ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన శనివారం డిజిపిని కలిసి ఫిర్యాదు చేశారు. అందజేశారు. ఈ సందర్భంగా మీడియాతో చంద్రశేఖర్ మాట్లాడుతూ.. తాను సెప్టెంబర్ నెలలో పోస్టు పెడితే ఈ నెలలో కేసు ఫైల్ అయినట్లు తన వాట్సాప్‌కు సమాచారం పంపడం సరికాదన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోనూ తనపై ఐదు కేసులు నమోదైనట్లు పోలీసులు చెబుతున్నారని పేర్కొన్నారు. కొందరైతే ఏకంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఎఫ్ఐఆర్ కాపీ తీసుకెళ్లమని చెప్పడం బాధాకరమన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ప్రశ్నించే హక్కు తనకు లేదా? అని ప్రశ్నించారు. యర్రగొండపాలెం, సిద్ధన్నపాలెంలో బాధితులపైనే కేసులు పెట్టారని, ఇదా మీరు చేసే న్యాయం..? ఇదా మీరు అమలు చేసే చట్టం.? అని ప్రశ్నించారు. పోలీస్ వ్యవస్థ కొంతమందికి కొమ్ము కాసే విధంగా వ్యవహరిస్తే ప్రజాస్వామ్యం ఖూనీ అయిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట మాజీ మంత్రులు ఆదిమూలపు సురేష్, అంబటి రాంబాబు తదితరులు ఉన్నారు.

ఫైళ్ల దగ్ధం కేసులో సిఐడి దూకుడు


పూర్వ ఆర్‌డిఒ మురళీ ఇంట్లో తనిఖీలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ (అన్నమయ్య జిల్లా)

అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో ఫైళ్ల దగ్ధం కేసు విచారణలో సిఐడి అధికారులు దూకుడు పెంచారు. ఈ కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న పూర్వ ఆర్‌డిఒ మురళీ నివాసాల్లో శనివారం సిఐడి అధికారులు తనిఖీలు చేశారు. మదనపల్లి పట్టణం ప్రశాంత్ నగర్‌లోని మురళీ నివాసంతోపాటు, తిరుపతిలో ఆయన కుమారుడు నివసిస్తున్న ఇంటిలో కూడా సిఐడి అధికారులు తనిఖీలు చేసి పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. మదనపల్లెలో సిఐడి సిఐ హేమంత్ కుమార్‌రెడ్డి బృందం పలు డాక్యుమెంట్లతోపాటు కంప్యూటర్ హార్డ్ డిస్క్‌లను తనిఖీ చేశారు. మురళికి అనుకూలస్తుడుగా ఉన్న విఆర్‌ఒ శేఖర్ ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నాడన్న ఆరోపణలతో ఆయన ఇంట్లో ఎసిబి సిఐ మోహన్ ప్రసాద్ బృందం సోదాలు చేసింది. వైసిపి ప్రభుత్వంలో ఫ్రీ హోల్డ్ భూములను నిషేధిత జాబితాలో నుంచి తొలగించడంలో మురళీ కీలక పాత్ర పోషించారనే అభియోగాలు ఉన్నాయి. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అనుకూలంగా వ్యవహరించారని, ఫోర్జరీ సంతకాలతో వైసిపి ప్రధాన నాయకులు పేదల నుంచి బలవంతంగా కొనుగోలు చేసిన భూములను ఫ్రీ హోల్డ్ జాబితాలో ఎక్కించడంలో మురళి కీలక పాత్ర పోషించారని ఆరోపణలతో ఇటీవల ఆయన సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. జూలై 21న మదనపల్లి సబ్ కలెక్టరేట్‌లో జరిగిన ఫైళ్ల దగ్ధం ఘటనను టిడిపి కూటమి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. అప్పట్లో రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమలరావు, అప్పటి సిఐడి చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ మదనపల్లికి చేరుకొని సంఘటన స్థలాన్ని పరిశీలించింది. సిఐడి అధికారులు రెండు నెలలపాటు కేసు దర్యాప్తు చేపట్టి ఎనిమిది మందిపై కేసులు నమోదు చేశారు. మురళితో పాటు మరో ఆర్‌డిఒ హరిప్రసాద్, కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజను సస్పెండ్ చేశారు. చాలా రోజుల వ్యవధి తరువాత మూడు రోజుల క్రితం సిఐడి అధికారులు మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని జల్లెడ పట్టి, పలు రికార్డులను పరిశీలించారు. శనివారం మరోమారు సిఐడి, ఎసిబి అధికారులు సోదాలు చేయడంతో సబ్ కలెక్టరేట్ ఫైళ్ల దగ్ధం కేసు మళ్లీ హాట్ టాపిక్‌గా మారింది.

తెలుగు రాష్ట్రాల మధ్య మరోసారి జలవివాదం

- సాగర్ వద్ద అధికారుల మధ్య వాగ్వావాదం



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తెలుగు రాష్ట్రాల మధ్య మరోసారి జల వివాదం నెలకొంది. నాగార్జున సాగర్ కెనాల్ రీడింగ్ కోసం తెలంగాణ సిబ్బంది శనివారం నాగార్జున సాగర్ డ్యాం వద్దకు వెళ్లగా ఆంధ్రప్రదేశ్ సిబ్బంది వారిని అడ్డుకున్నారు. అంతేగాకుండా తెలంగాణ అధికారులకు ఇక్కడ ఏం పని... ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని హుకుం జారీచేశారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇరు రాష్ట్రాల అధికారుల మధ్య వాగ్వావాదం జరిగింది. ఆంధ్ర అధికారుల తీరుపై కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పి తెలంగాణ అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు. గత ఏడాది తెలంగాణ ఎన్నికల పోలింగ్ రోజున రెండు రాష్ట్రాల పోలీసుల మధ్య ఘర్షణ జరిగింది. ఆంధ్ర పోలీసులు సగం డ్యామ్‌ను స్వాధీనం చేసుకున్నారు. రెండు రాష్ట్రాల మధ్య వివాదం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సిఆర్‌పిఎఫ్ బలగాలను సాగర్ డ్యామ్ వద్ద బందోబస్తు కోసం పంపింది. అప్పటి నుంచి సిఆర్‌పిఎఫ్ బలగాల పర్యవేక్షణలో డ్యామ్ వద్ద భద్రత కొనసాగుతోంది. జలవనరుల శాఖ లింగంగుట్ల ఎస్ఇ కృష్ణమోహన్ మాట్లాడుతూ.. నాగార్జునసాగర్ డ్యామ్‌పై ఇరు రాష్ట్రాల అధికారుల మధ్య ఎటువంటి జల వివాదమూ జరగలేదన్నారు. సాగర్ కుడి కాలువ రీడింగ్ విషయంలో కమ్యూనికేషన్ గ్యాప్ వలన ఇద్దరు ఉద్యోగుల మధ్య చిన్న వివాదం చోటుచేసుకుందని తెలిపారు. ఇద్దరు ఉద్యోగులతో మాట్లాడి సమస్య పరిష్కరించినట్లు చెప్పారు. వివాదం సద్దుమణిగిందని, చిన్న విషయాన్ని ఇరు రాష్ట్రాల గొడవగా చిత్రీకరించడం తగదన్నారు.

వలంటీర్లపై కక్ష వద్దు

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల్లో వలంటీర్లకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ కోరారు. విజయవాడలోని దాసరి భవన్‌లో శనివారం నిర్వహించిన 'వలంటీర్ల ఆవేదన-చంద్రన్నకు నివేదన' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ వలంటీర్ల సమస్యలపై త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి చర్చిస్తామన్నారు. వలంటీర్ల పట్ల కక్ష పూరితంగా వ్యవహరించడం సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబుకు సరికాదన్నారు. ఇప్పటి వరకూ 8 పర్యాయాలు మంత్రివర్గ సమావేశాలు నిర్వహించినా ఈ అంశంపై నిర్ణయం తీసుకోకపోవడం సమంజసం కాదన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం వలంటీర్లను విధుల్లోకి తీసుకుని, నెలకు రూ.10 వేలు వేతనం చెల్లించాలన్నారు. ఏపీ స్టేట్ వాలంటీర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు జి ఈశ్వరయ్య మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల లోపు వలంటీర్లకు న్యాయం చేయకపోతే 'చలో సిఎం క్యాంపు కార్యాలయం' కార్యక్రమాన్ని చేపడతామన్నారు. వలంటీర్లపై ఉపముఖ్యమంత్రి పవన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పి రాజేంద్ర అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి లంకా గోవిందరాజులు, రాష్ట్ర అధ్యక్షులు ఎం జగదీష్, సిపిఐ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐదో వారం తగ్గిన విదేశీ మారకం నిల్వలు



ముంబయి : వరుసగా ఐదో వారంలోనూ భారత విదేశీ మారకం నిల్వలు తగ్గాయి. నవంబర్ 1తో ముగిసిన వారానికి ఫారెక్స్ నిల్వలు 2.7 బిలియన్ డాలర్లు తరిగి పోయి 682.1 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. అంతకుముందు అక్టోబర్ 25తో ముగిసిన వారానికి కూడా ఫారెక్స్ నిల్వలు 3.4 బిలియన్ డాలర్లు పతనమై 634.8 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఫారెక్స్ రిజర్వు నిల్వల్లో కీలకమైన ఫారిన్ కరెన్సీ అసెట్స్ 3.9 బిలియన్ డాలర్లు క్షీణించి 589.84 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. పసిడి నిల్వలు 1.2 బిలియన్ డాలర్లు పెరిగి 69.75 బిలియన్ డాలర్లకు చేరాయి.

విమానాశ్రయానికి...ఇళ్ల స్థలాలకు !

- కాకినాడ జిల్లాలో ఉప్పుభూములు
- రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదన
- అనధికారికంగా ఆక్వా సాగు



గురజానపల్లి పెనుకుదురు మధ్యలో అక్రమంగా తవ్విని ఆక్వా సాగు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కాకినాడ జిల్లాలో ఉప్పు భూములు ఇప్పటికే పెద్ద ఎత్తున ఆక్రమణలోఉండగా, అరకొరగా మిగిలి ఉన్న భూములను సైతం ఇతర అవసరాలకు ప్రతిపాదిస్తున్నారు. గత ఎన్నికలకు ముందు ఇళ్ల స్థలాలకోసం ఈ భూములను కేటాయించే ప్రయత్నాలు జరిగాయి. తాజాగా కాకినాడ-కోనసీమ మధ్య నిర్మిస్తామంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన ఎయిర్‌పోర్టుకు కేటాయించాలని భావిస్తున్నారు. పెనుగుదురులో ఉన్న ఉప్పు భూములను అధికారులు మాస్టర్ ప్లాన్‌లో విమానాశ్రయానికి ప్రతిపాధించారు. గత ప్రభుత్వం కరప మండలం గురజానాపల్లిలోని సర్వే నెంబర్లు 53,54,56,150 లలో 168.87 ఎకరాల ఉప్పు భూములను ఇళ్ల స్థలాలకు ప్రతిపాదించింది. దీనికోసం ఈ భూములు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉండటంతో ఆ మేరకు నిర్దేశించిన మొత్తాన్ని కూడా చెల్లించినట్లు చెబుతున్నారు. ఎన్నికల కోడ్ రావడంతో పాటు, ఉప్పు భూముల్లో ఇళ్ల స్థలాలకు పనికిరావన్న అభిప్రాయంతో లబ్ధిదారులు ముందుకు రాలేదు. దీంతో ఆ ప్రక్రియకు బ్రేక్ పడింది. ఇప్పుడు ఆ భూములను రాష్ట్ర ప్రభుత్వం ఏం చెయనున్నదానిపై స్పష్టత లేదు పర్యావరణ పరంగా కీలకమైన ఉప్పు భూములను ఇతర అవసరాలకు మళ్లించడం, పెద్ద ఎత్తున ఆక్రమణలకు గురైనా పట్టించుకోకపోవడం పై స్థానికంగా ఆందోళన వ్యక్తమవుతున్నప్పటికీ స్పందన కనిపించడం లేదు. కాపాడాల్సిన అధికారులే అక్రమార్కులతో చేతులు కలుపుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

ఎక్కడెక్కడ....?

కాకినాడకు అతి సమీపంలో 216వ నెంబరు జాతీయ రహదారిని చేర్చి కేంద్ర ప్రభుత్వం అధీనంలో సుమారు 1,400 ఎకరాల ఉప్పు భూములు ఉన్నాయి. ఎక్కువగా కాకినాడ రూరల్ నియోజకవర్గం కరప మండలం పెనుగుదురులోని సర్వే నెంబర్ 201లో 566 ఎకరాలు, గురజనాపల్లి పరిధిలోని సర్వే నెంబర్ 202లో 561 ఎకరాలు ఉన్నాయి. మిగిలిన భూములు పాతర్లగడ్డ, ఉప్పలంక, తాళ్లరేవు మండలం చొల్లంగి పంచాయతీ పరిధిలో కొంత, పలు తీర ప్రాంతాల్లోనూ ఉన్నాయి.

అనధికారికంగా ఆక్వా చెరువులు

సాల్ట్ కమిషన్‌కు చెందిన ఈ భూముల్లో ఆయా గ్రామాలకు చెందిన 500 మందికిపైగా ఉప్పు సాగు చేసి కుటుంబాలను పోషించుకునేవారు. ఉత్పత్తి వ్యయం పెరగడంతో పలువురు ఉప్పు సాగుకు దూరమయ్యారు. ప్రస్తుతం 400 ఎకరాల్లో రైతులు ఉప్పును ఉత్పత్తి చేస్తున్నారని సాల్ట్ అధికారులు చెబుతున్నా వాస్తవానికి 200 ఎకరాల పరిధిలోనే ఉప్పు సాగు జరుగుతోందని సమాచారం. మరోవైపు 300 ఎకరాల్లో అనధికారికంగా రొయ్యల సాగు చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. వీటిల్లో 100 ఎకరాలు ఒక వ్యక్తి చేతిలోనే ఉన్నట్టు సమాచారం. 2012 వరకు ఎకరాకు కేవలం రూ.200 చొప్పున ఉప్పు పండించే రైతులకు లీజుకి ఇచ్చేవారు. 2013 జనవరి నుంచి ఎకరాకు రూ.2,600 చొప్పున పెంచారు. దీంతో ఉప్పు సాగు చేసే రైతులు సాగును వదిలేశారు.

రొయ్యలు, చేపలు సాగుచేసే కొంతమంది ఉప్పు రైతుల నుంచి అనధికారికంగా లీజుకు తీసుకొని ఆక్వా సాగు చేస్తున్నారు. పెద్ద మొత్తంలో ఆదాయం వస్తుండటంతో రాజకీయ నాయకుల అండదండలు కూడా అక్రమార్కులకు లభిస్తున్నాయి. . దీనిపై వివరణ కోరేందుకు ప్రయత్నించగా సాల్ట్ డిపార్ట్‌మెంట్ అధికారులు నిర్లక్ష్యంగా స్పందిస్తున్నారు. ఈ భూములకు సంబంధించిన వివరాలను ఇచ్చేందుకు కూడా వారు సిద్ధపడటం లేదు. నిబంధనల సాకు చూపి తప్పించుకునే ప్రయత్నిస్తున్నారు.

మట్టి తవ్వకాలు కూడా

ఈ ఉప్పు భూముల్లో ప్రతి సంవత్సరం మట్టి తవ్వకాలు కూడా అక్రమంగా సాగుతున్నాయి. ఎటువంటి అనుమతులు లేకుండానే అడ్డగోలుగా మట్టిని తవ్వేస్తున్నారు. వీటిని అడ్డుకునే నాధుడే కరువయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాల్ట్ అధికారులకు ఫిర్యాదులు అందుతున్నా పట్టించుకోవడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మట్టి మాఫియా అడ్డగోలు తవ్వకాలతో ఈ భూముల ఉనికి ప్రశ్నార్థకంగా మారుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నవంబర్‌లోనూ రూ.20వేల కోట్ల ఎఫ్ఐఐలు ఔట్



ముంబయి : భారత స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐ)లు తమ పెట్టుబడుల తరలింపును కొనసాగిస్తున్నారు. అక్టోబర్ నుంచి విక్రయాలకు దిగిన ఎఫ్ఐఐలు ప్రస్తుత మాసంలోనూ అదే బాటలో పయనిస్తున్నారు. గత నెలలో రూ.94,017 కోట్లను మార్కెట్ నుంచి బయటకు తీసుకెళ్లిన ఎఫ్ఐఐలు.. నవంబర్ మొదటి వారంలోనూ రూ.23,398 కోట్లను తరలించుకుపోయారు. కేవలం శుక్రవారం ఒక్క రోజే రూ.3,404 కోట్ల ఎఫ్ఐఐలను వెనక్కి తీసుకున్నారు. అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో అక్టోబర్ ప్రారంభం నుంచి ఎఫ్ఐఐలు పెద్ద ఎత్తున తరలిపోతున్నాయి. చైనా తీసుకున్న ఉద్దీపన చర్యల కారణంగా తమ అమ్మకాలను కొనసాగించారు. దీనికి తోడు కార్పొరేట్ ఫలితాలు నిరాశాజనకంగా ఉండటంతో క్రమంగా తమ పెట్టుబడులను తగ్గించుకుంటున్నారు.

కప్‌స్టోన్ సర్వీసెస్ అమ్మకాల్లో 31 శాతం వృద్ధి

హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో మానవ వనరుల సొల్యూషన్స్ సంస్థ కప్‌స్టోన్ సర్వీసెస్ అమ్మకాలు 30.94 శాతం పెరిగి రూ.168 కోట్లకు చేరాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.128 కోట్ల అమ్మకాలు జరిగాయి. క్రితం క్యూ2లో నికర లాభాలు 9.01 శాతం తగ్గి రూ.3.94 కోట్లకు పరిమితమయ్యాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.4.33 కోట్ల లాభాలు ప్రకటించింది.

హెచ్ఎస్‌బిసి ఇండియాతో మారుతి సుజుకి ఒప్పందం

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి తమ డీలర్ల ఫైనాన్స్ సొల్యూషన్స్ కోసం హాంగ్‌కాంగ్ అండ్ షాంగై బ్యాంకింగ్ కార్పొరేషన్ (హెచ్ఎస్‌బిసి) ఇండియాతో ఒప్పందం కుదర్చుకున్నట్లు తెలిపింది. ఈ భాగస్వామ్యంతో మారుతి సుజుకి 4,000 పైగా సేల్స్ అవుట్‌లెట్‌లో మూలధన అవసరాలను తీర్చనున్నట్లు తెలిపింది. డీలర్ భాగస్వాములకు వినూత్న ఫండింగ్ అవకాశాలను కల్పించనున్నట్లు ఆ కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పర్థో బెనర్జీ తెలిపారు.

లాభాల్లోకి సిగ్నేచర్ గ్లోబల్

న్యూఢిల్లీ : రియల్ ఎస్టేట్ కంపెనీ సిగ్నేచర్ గ్లోబల్ 2024-25 సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలో రూ.4.15 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.19.92 కోట్ల నికర నష్టాలు చవి చూసింది. అదే సమయంలో రూ.121.16 కోట్ల మొత్తం ఆదాయం ఉండగా.. గడిచిన క్యూ2లో రూ.777.42 కోట్ల ఆదాయాన్ని సాధించింది. ఇదే సమయంలో ముందస్తు అమ్మకాలు 184శాతం పెరిగి రూ.5780 కోట్లుగా నమోదయ్యాయి.

సంపాదకీయం

యుద్ధం రాస్తున్న డైరీ...

"...నేను డైరీ ఎందుకు రాద్దామనుకుంటున్నాననే విషయానికి వస్తా. నాకు స్నేహితులు లేరు. నన్ను మరింత స్పష్టంగా చెప్పనియ్యి. పదమూడేళ్ల బాలిక ఈ ప్రపంచంలో పూర్తిగా ఒంటరితనం అనుభవిస్తోందంటే ఎవరూ నమ్మరు..." అంటూ 1942 జూన్ 12న మొదలు పెట్టి, 1944 ఆగస్టు 1 వరకు... 26 నెలల పాటు తనను అనాథను చేసిన యుద్ధం మిగిల్చిన ఒంటరితనాన్ని ఒక డైరీలో రాస్తుంది ఓ అనాథ. డచ్ భాషలో రాసిన ఈ డైరీ 1947లో 'ద డైరీ ఆఫ్ ఎ యంగ్ గర్ల్' పేరుతో ప్రచురితమైంది. ఇలాంటి అనాథలు... రాయడానికి అవకాశంలేని విషాదగాథలు... కన్నీళ్లు మిగిల్చిన జీవితాలు... దిక్కుతోచని బతుకులు అనేకం. యుద్ధం, కరువు, వలసలు, సామాజిక హింస, పేదరికం, ప్రకృతి వైపరీత్యాలు, అంటువ్యాధులు వంటివి పిల్లలు అనాథలుగా మారడానికి కారణమౌతాయి. ప్రపంచవ్యాప్తంగా 18ఏళ్ల లోపు పిల్లలు 15.3 కోట్లమంది అనాథలుగా మారుతున్నారని యునిసెఫ్ వెల్లడించింది. 'ప్రపంచంలో ఎంతోమంది ఒక్క పూట తిండి కోసం ఎదురుచూస్తున్నారు. అదే సమయంలో మరెంతోమంది కన్నప్రేమను కోల్పోయి తల్లడిల్లుతున్నారు' అంటారు మదర్ థెరిసా.

రెండు ప్రపంచ యుద్ధాలు ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది చిన్నారులను అనాథలుగా మిగిల్చాయి. ఇది చరిత్ర రాసిన డైరీ. తాజాగా రష్యా- ఉక్రెయిన్ యుద్ధం మొదలై దాదాపు రెండేళ్లకుపైగా అయింది. గాజాపై ఇజ్రాయెల్ నరమేధం మొదలై ఏడాది దాటిపోయింది. ఈ దేశాల నుంచి లక్షలాది మంది వలసపోయారు. లక్షలాది జీవితాలు అతలాకుతలం అయ్యాయి. గాజాపై ఇజ్రాయెల్ దాడిలో చనిపోయినవారు కాకుండా... దాదాపు 19వేలకు పైగా చిన్నారులు అనాథలయ్యారని ఐరాస పిల్లల సంస్థ (యునిసెఫ్) నివేదించింది. ప్రపంచమంతా యుద్ధం గురించి, ఆర్థిక సంక్షోభం గురించే మాట్లాడుతోంది కానీ, యుద్ధం మిగిల్చిన చిన్నారుల గురించి, వారికి యుద్ధం చేసిన గాయాల గురించి... అనాథలుగా మారిన వైనం గురించి దృష్టి సారించాల్సిన సమయం ఇది. వారి భవిష్యత్ ఏమిటో అర్థంకాని దుస్థితిలో వారున్నారు. అలాగే, కరువు, వరదలు, విపత్తులు మిగిల్చిన అనాథలు మరికొందరు. అనాథలుగా మిగిలిన వారు అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి వుంటుంది. సరైన సంరక్షణ, పేదరికం, అనారోగ్యం, చదువు లేకపోవడం, దోపిడీకి గురవడం... వీరిని వేధించే ప్రధాన సమస్యలు. వీరెవరూ పుట్టుకతో అనాథలు కాదు. ఆధిపత్యం కోసం, మతవ్యాప్తి కోసం.. జాతి, భాష, ప్రాంతం వంటి వివక్షతలతో చెలరేగుతున్న యుద్ధాలు మిగిల్చిన అనాథలు వీరు. బంధువుల మధ్య పెరుగుతున్నవారు కొందరైతే... ఏ తోడూ లేకుండా అనాథలుగా గడుపుతున్నవారు మరికొందరు. ఏ కొద్దిమందో తప్ప... ఎక్కువమంది జీవితాలు దారితప్పి ఆగమైపోతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 100కోట్ల మందికి పైగా చిన్నారుల జీవితాలు కడు దుర్భరంగా మారాయి. ప్రతి పదిమందిలో తొమ్మిది మంది పిల్లలు వేధింపులకు గురవుతున్నారని డబ్ల్యుహెచ్ఓ ఆందోళన వ్యక్తం చేస్తోంది.

ఆండ్రూ జాక్సన్ వంటి ప్రపంచ నాయకులు, లియో టాల్‌స్టాయ్ వంటి రచయితలు, ఆరోన్ హెర్నాండెజ్ వంటి క్రీడాకారులు, మార్లిన్ మన్రో వంటి సెలబ్రిటీలు కూడా అనాథలుగానే తమ జీవితాలను ప్రారంభించి... ఉన్నత శిఖరాలను అధిరోహించారు. సంకల్పం వుంటే.. సాధించలేనిది లేదు. అనాథ పిల్లలు కూడా సమాజంలో అంతర్భాగమే. వారిని సంఘవిద్రోహ శక్తులుగా మారకుండా సమాజానికి ఉపయోగపడే విధంగా దారి చూపాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. అనాథ పిల్లల చదువు, సంరక్షణ బాధ్యతను ప్రభుత్వాలు తీసుకోవాలి. 'చిట్టితల్లుల బెదురు కళ్ళలో/ చెదిరిపోతున్న నిదుర కలలు/ ప్రపంచ శాంతి కాముకులకు/ కునుకు పట్టని రాత్రుల్ని/ బహూకరిస్తున్నాయి' అంటారొక కవి. అనాథలవుతున్న పిల్లల దుస్థితిని ఈ ప్రపంచానికి తెలియజెప్పడం కోసం, తల్లిదండ్రులు లేని పిల్లలకు అవగాహన కల్పించడం కోసం, వారి హక్కులను ప్రోత్సహించడం కోసం... ప్రత్యేకంగా ఒక రోజును ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం నవంబర్ రెండో సోమవారం 'ప్రపంచ అనాథల దినోత్సం' నిర్వహిస్తారు. 'కూలిన ప్రతి కష్టం దగ్గర/ నిశ్శబ్దంగా కూర్చుని చూస్తాను/ మొలకలాంటిదేదైనా/ కవితని ఎత్తుకుని పైకి లేస్తుందని' అంటారు కవయిత్రి మెర్సీ మార్గరెట్. చిన్నారుల జీవితాలకు భరోసానివ్వాలి. పిల్లలులేని తల్లిదండ్రులు అనాథ బిడ్డలను దత్తత తీసుకునే సత్‌సాంప్రదాయం పరిఢవిల్లాలి. అన్నిటికీ మించి అనాథల శ్రేయస్సు కోసం సమగ్ర చట్టం తేవాలి.

మహనీయుల మాట




విప్లవాన్ని తెచ్చేది మనుషులే,
కానీ ప్రతిరోజూ విప్లవ స్ఫూర్తిని
పొందే వారే ఆ పని చేయగలరు
- చె గువేరా



లౌకిక విధానమే దేశానికి శిరోధార్యం

విశ్లేషణ



తెలకపల్లి రవి

భారతదేశంలో భిన్నమతాల ఉనికి, లౌకిక రాజ్యాంగ సూత్రాల గురించి మతతత్వ రాజకీయ పార్టీలు పదే పదే అనేక విధాల చర్చలు వివాదాలు లేవనెత్తుతున్న నేపథ్యంలో అత్యున్నత న్యాయస్థానం గత నెలరోజుల్లోనూ మూడుసార్లు దీనిపై సానుకూల స్పష్టతనివ్వడం స్వాగతించదగింది. గతంలో రాజ్యాంగ పీఠిక, తర్వాత యుపి మదరసాల చట్టం, తాజాగా ఆలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ ... మూడు కేసుల్లోనూ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఇదే సంకేతాలు ఇచ్చారు. ఈ కేసుల తుది తీర్పులు రాలేదనుకున్నా రాజ్యాంగ నిర్దేశాలను మాత్రం వారు తేల్చిచెప్పారు. దక్షిణాదిన.. అందులోనూ తెలుగు రాష్ట్రాలలోనూ ఇటీవల కేవలం బిజెపి మాత్రమే గాక దానితో జట్టుకట్టిన జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ వంటివారు కూడా లౌకిక సూత్రాల అన్వయం గురించి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. వీటన్నిటి కారణంగా ఆరోగ్యకరంగా ఆలోచించేవారిలోనూ అనవసరమైన అనుమానాలు అవాంఛనీయమైన సందేహాలు లేవనెత్తే ప్రయత్నం జరుగుతున్నది. ఇలాటి ఆలోచనాధోరణి వున్నవారే వివిధ కారణాలతో పేర్లతో లౌకిక ప్రజాస్వామ్యాన్ని ప్రశ్నించేందుకు పరిపరివిధాల ప్రయత్నం చేయడం నిత్యకృత్యంగా మారింది. సరిగ్గా ఈ కారణంగానే ఉద్యోగ విరమణ చేసిన సిజెఐ చంద్రచూడ్, రాబోయే సిజెఐ సంజీవ్ ఖన్నాలతో సహా లౌకిక విలువల విషయంలో సానుకూల వ్యాఖ్యలు, తీర్పులివ్వడం ఆసక్తికరమవుతున్నది. సరళీకరణతో సహా వివిధ విషయాల్లో వివాదాస్పదంగా, విమర్శాపాత్రంగా తీర్పులిచ్చిన న్యాయమూర్తులు దేశ భవిష్యత్తు రీత్యా కీలకమైన లౌకిక సూత్రాల వరకైనా గట్టిగా సమర్థించుతూ మాట్లాడటం మంచిదే. అదే సమయంలో పాలక వర్గాలు మతాల మధ్య సంబంధాలను తమ రాజకీయస్వార్థంకోసం ఉపయోగించుకునే తీరును కూడా ఈ కేసులు విదితం చేస్తాయి.



> మైనార్టీ పెద్దలు ఏర్పాటు చేసిన సంస్థ కేవలం కేంద్ర చట్టం ప్రకారం ఏర్పడిందనే కారణంతో మైనార్టీ స్వభావం కోల్పోదని తేల్చింది. మైనార్టీల హక్కులకు సంబంధించిన 30వ అధికరణం లౌకిక విద్యకూ వర్తిస్తుందని తీర్పు రాసిన సిజెఐ చంద్రచూడ్ పేర్కొన్నారు. 30(10) అధికరణం వివక్షకు వ్యతిరేకంగానూ, ప్రత్యేక హక్కుల కోసమూ ద్విముఖ స్వభావం కలిగి వుంటుందన్నారు. అయితే తాము తమ సంస్కృతిని కాపాడుకోవడానికే దాన్ని ఏర్పాటు చేశామనేది మాత్రం ఆ వర్గానికి చెందిన వారే చెప్పవలసి వుంటుందని, ఇందుకోసం అప్పటి ఉత్తర ప్రత్యుత్తరాలు, పత్రాలు పరిశీలించాలని ధర్మాసనం అభిప్రాయపడింది.

మదరసాల చట్టం

రాజ్యాంగం 30వ అధికరణం మైనార్టీ మతాల భాషల వారికి స్వంత విద్యా వికాసాల కోసం సంస్థలు స్థాపించుకునే అవకాశం ఇస్తున్నది. అయితే అక్కడ మత సామరస్యం కోసం విద్యాభివృద్ధి కోసం పాఠ్యాంశాలు వుండాలని , మతపరమైన విద్యకు అవి పీఠాలు కారాదని పేర్కొంటున్నది. ఉదాహరణకు యుపి మదరసాలు ఎన్‌సిఇఆర్‌టి సిలబస్‌ను బోధించాలని వుంది. ముస్లిం మైనారిటీల విద్యావికాసం కోసం ఏర్పాటైన మదరసాల మీద మొదటి నుంచి సంఘ పరివార్ దాడి చేస్తూనే వుంది. మరో వంక ముస్లిం మతచాందసాల బోధనకు కూడా ప్రయత్నించే శక్తులు వాటి కోణంలో అవి పనిచేస్తుంటాయి, 2004 యుపి మదరసాల చట్టం ఈ సంస్థలను నియంత్రించేందుకు కొన్ని నిబంధనలు జారీ చేసింది. వాటిని అలహాబాద్ హైకోర్టు కొట్టి వేసింది. ఈ చట్టం భారత రాజ్యాంగ మౌలిక స్వభావమైన లౌకికతత్వ వ్యతిరేకం గనక చెల్లదని పేర్కొంది. అయితే సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ ధర్మాసనం ఉద్యోగ విరమణకు ముందురోజు దీనిపై తీర్పునిస్తూ ఒక చట్టం కేవలం రాజ్యాంగ మౌలిక స్వభావానికి విరుద్ధమనే కారణంతో కొట్టివేయడం కుదరదని, అందులోని నిబంధనలు రాజ్యాంగంతో ఎలా విభేదిస్తున్నాయో చెప్పాలని అభిప్రాయపడ్డారు. ఆ కారణంతో హైకోర్టు.. మదరసా బిల్లును కొట్టివేయడం కుదరదన్నారు. అయితే అదే సమయంలో వాటిలో విద్య నాణ్యత గురించి తగు నిర్ణయాలు తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి వుంటుందని ఈ రెంటినీ వేరుగా చూడాలని స్పష్టం చేశారు. పాఠ్యాంశాలు బోధన తీరు వంటి విషయాల్లో ప్రభుత్వం జోక్యం చేసుకోవచ్చునని చెప్పారు.

లౌకికతత్వం వద్దా?

ముందుగా అక్టోబరు 24న కాబోయే సిజెఐ సంజీవ్‌ఖన్నా నాయకత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం పీఠిక నుంచి లౌకికతత్వాన్ని తొలగించాలనే కోర్కెను తప్పు పట్టింది. బిజెపి మాజీ ఎంపి సుబ్రహ్మణ్య స్వామి, అశ్విన్ ఉపాధ్యాయ తదితరులు వేసిన పిటిషన్‌ను విచారించే సందర్భంలో తీవ్ర వ్యాఖ్యలే చేసింది. లౌకికతత్వం అనేది భారత రాజ్యాంగం మౌలిక స్వభావాల్లో ఒకటి. రాజ్యాంగం ఎప్పుడూ ఈ స్వభావాన్ని ప్రతిబింబిస్తున్నదని ఈ కోర్టు అనేక తీర్పులలో చెప్పింది. సమానత్వహక్కు, రాజ్యాంగం మూడవ భాగంలో పేర్కొన్న సౌహార్దత అనే పదం, హక్కులు చూస్తే లౌకికతత్వం రాజ్యాంగ మౌలిక లక్షణమని స్పష్టంగా తెలుస్తుంది అని జస్టిస్ సంజీవ్‌ఖన్నా వ్యాఖ్యానించారు. రాజ్యాంగ పరిషత్తు చర్చలలో ఈ పదం లేదనీ, 1976లో లౌకిక తత్వం, సోషలిజం అనే పదాలను 42వ సవరణ ద్వారా చేర్చారని పిటిషనర్లు వాదించారు. అయితే రాజ్యాంగ చర్చల సమయానికి మనకు ఫ్రెంచి రాజ్యాంగ నమూనా మాత్రమే వుందని, తర్వాత కాలంలో మన స్వంత నమూనా రూపొందించుకోగలిగామని జస్టిస్ ఖన్నా వివరించారు. ఇతర హక్కులు కూడా జోడించి మనం దాన్ని సమతుల్యం చేశామన్నారు. మీరు భారత దేశం లౌకిక దేశంగా వుండాలనుకోవడం లేదా?అని ప్రశ్నించారు. దేశం లౌకిక దేశంగానే వుండాలని అయితే ఈ పదాన్ని చేర్చడాన్ని మాత్రమే తాము సవాల్ చేస్తున్నామని పిటిషనర్లలో ఒకరైన బలరాం సింగ్ తరపున హాజరైన విష్ణుశంకర్‌జైన్ వాదించారు. అయితే సామ్యవాదం, లౌకికతత్వం అనే పదాలకు మనం ఇచ్చుకున్న అర్థం వేరని న్యాయమూర్తులు జవాబిచ్చారు. సమాన అవకాశాలు, దేశంలో సంపదను సమానంగా పంపిణీ చేయడం అన్న అర్థంలో కూడా తీసుకోవచ్చని జస్టిస్ ఖన్నా అన్నారు. ఆ రెండు పదాలు మన రాజ్యాంగ మౌలిక స్వభావంలో భాగమని కోర్టులు పదే పదే ప్రకటించాయని గుర్తు చేశారు. 1949 నవంబరు26న ఆమోదించిన పీఠిక ప్రకారం భారత ప్రజలు సోషలిస్టు లౌకిక రిపబ్లిక్‌గా అంగీకరించారని చెప్పడం తప్పవుతుందని స్వామి వాదించారు. వాటిని 1976లో కలిపారు గనకనే ప్రత్యేకంగా బ్రాకెట్లలో వుంచారని సమైక్యత, సమగ్రత అనే పదాలు కూడా సవరణతోనే చేర్చారని జస్టిస్ ఖన్నా చెప్పారు. ఈ కేసు విచారణ ఇంకా పూర్తి కాలేదు గానీ ముందే స్పష్టంగా చెప్పడం ద్వారా న్యాయమూర్తులు తమ ఆలోచనను వ్యక్తం చేశారనుకోవచ్చు.

ఆలీగఢ్ విశ్వవిద్యాలయం కేసు

ఇక సిజెఐ చంద్రచూడ్ ఉద్యోగ విరమణ చివరి ఘట్టంలో ఆలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయం(ఎఎంయు) తీర్పు వెలువడింది. ఈ విశ్వవిద్యాలయం మైనార్టీ సంస్థనా కాదా అన్నదే ఇక్కడ వివాదం. బ్రిటిష్ పాలకుల హయాంలో చట్టం ద్వారా ఏర్పడింది గనక ఎఎంయు మైనార్టీ సంస్థ కాదనేది పిటిషనర్ల వాదన.ఈ కేసు దీర్ఘకాలంగా వాయిదా పడుతున్నది, చాలా చరిత్ర కూడా వుంది. స్వాతంత్ర పోరాట కాలంలో 1877లో సయ్యద్ అహ్మద్ ఖాన్ మహమ్మదన్ ఆంగ్లో ఓరియంటల్ కాలేజీ పేరిట దీనిని ఏర్పాటు చేశారు.1920లో దాన్ని కేంద్ర చట్టం పరిధిలోకి తీసుకొచ్చారు. స్వాతంత్రానంతర కాలంలో ప్రతిష్టాత్మక విద్యాలయంగా ఆలీఘఢ్ విశ్వవిద్యాలయం విస్తరించింది. అయితే ఒక కేంద్ర విశ్వవిద్యాలయాన్ని మైనార్టీ సంస్థగా పరిగణించడం చెల్లదని 1967లో సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఎస్ అజీజ్ వర్సెస్ కేంద్రం కేసులో తీర్పునిచ్చింది. ఎమర్జన్సీ ఓటమి తర్వాత తిరిగివచ్చిన ఇందిరాగాంధీ 1981లో దాన్ని మైనార్టీ విద్యాసంస్థగా ప్రకటిస్తూ సవరణ చేసింది. అయితే అదే సమయంలో అన్ని వర్గాల విద్యార్థులకు ప్రవేశం వుంటుందని ఆ చట్టం పేర్కొంది. ఈ సవరణను 2006లో అలహాబాదు హైకోర్టు కొట్టివేసింది, అప్పటి యుపిఎ ప్రభుత్వం ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసింది. 2009లో ఎయంయు యాభై శాతం పిజి సీట్లను ముస్లింలకు రిజర్వు చేస్తూ కేంద్రం నిర్ణయించడం చర్చకు దారితీసింది. దీర్ఘకాల చరిత్ర గల కేంద్ర విశ్వవిద్యాలయంలో ఈ విధంగా మత ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించడం సరికాదని లౌకికవాదులు భావించారు. 1967 తీర్పు ప్రకారమైతే ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్ కాలేజీ, వెల్లూరు మెడికల్ కాలేజీ వంటి చాలా మైనార్టీ సంస్థల ఉనికికి ముప్పు కలుగుతుందంటూ కూడా పిటిషన్లు దాఖలైనాయి. అయితే 2016లో మోడీ ప్రభుత్వం మైనార్టీ హోదాపై వైఖరి మార్చుకుంది. దీనిపై విచారణను సుప్రీం కోర్టు 2019లో ఏడుగురు సభ్యుల ధర్మాసనానికి అప్పగించింది. ఇప్పుడు 4-3 తేడాతో వెలువడిన తీర్పు 1967నాటి తీర్పును కొట్టివేసింది.

మైనార్టీ పెద్దలు ఏర్పాటు చేసిన సంస్థ కేవలం కేంద్ర చట్టం ప్రకారం ఏర్పడిందనే కారణంతో మైనార్టీ స్వభావం కోల్పోదని తేల్చింది. మైనార్టీల హక్కులకు సంబంధించిన 30వ అధికరణం లౌకిక విద్యకూ వర్తిస్తుందని తీర్పు రాసిన సిజెఐ చంద్రచూడ్ పేర్కొన్నారు. 30(10) అధికరణం వివక్షకు వ్యతిరేకంగానూ, ప్రత్యేక హక్కుల కోసమూ ద్విముఖ స్వభావం కలిగి వుంటుందన్నారు. అయితే తాము తమ సంస్కృతిని కాపాడుకోవడానికే దాన్ని ఏర్పాటు చేశామనేది మాత్రం ఆ వర్గానికి చెందిన వారే చెప్పవలసి వుంటుందని, ఇందుకోసం అప్పటి ఉత్తర ప్రత్యుత్తరాలు, పత్రాలు పరిశీలించాలని ధర్మాసనం అభిప్రాయపడింది. సంస్థ ఏర్పాటు తర్వాత నిర్వహణ ఎవరి చేతుల్లోకి వెళ్లింది, ఎఎంయుకు మైనార్టీ హోదా వుంటుందా లేదా అనేది సాధారణ ధర్మాసనం నిర్ణయించాలని నిర్దేశించారు. అంటే ఈ కేసులో తుది నిర్ణయం జరగాల్సి వుంటుందన్నమాట. (అదే సమయంలో ముగ్గురు న్యాయమూర్తులు ఇందుకు భిన్నంగా మైనార్టీ తీర్పులిచ్చారు) సుప్రీంకోర్టు తీర్పుపై అలీగఢ్ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ నైమా ఖతూన్, అధ్యాపక ఉపాధ్యాయ సంఘాలు హర్షం వెలిబుచ్చాయి. తమ మైనార్టీ హోదాను కాపాడుకోవడానికి అవసరమైన పత్రాలు తమ దగ్గర వున్నాయని అన్నారు. మరో వంక బిజెపి నాయకులు ఈ హోదా సమస్య విచారణకు వచ్చినపుడు కేంద్రం తన వైఖరిని ఖచ్చితంగా చెబుతుందని ప్రకటించారు. జెఎన్‌యు వంటి చోట్ల నిర్బంధానికి పాల్పడిన కేంద్రం ప్రతి సందర్భంలోనూ ఎయంయును వివాదాస్పదం చేస్తూ బిజెపి ఆరెస్సెస్‌లు మత వివాదాలు రెచ్చగొట్టడానికి సహకరించింది. మొత్తంగానే యుజిసి నిధులు కోతకోయడంతో పాటు ఈ విశ్వవిద్యాలయానికి మరింత ఇబ్బందులు కలిగించింది. ఇలాటి పరిస్థితుల్లో సుప్రీంకోర్టు మళ్లీ ఈ అంశాన్ని ఎప్పుడు ఏ విధంగా విచారిస్తుందనేది ఒకటైతే... బిజెపి ఆరెస్సెస్‌ల పాత్ర ఎలా వుంటుందనేది చూడాల్సిందే. మౌలికంగా లౌకికతత్వ సూత్రాలను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు నొక్కి చెప్పడం మంచిదైనా తుది వాక్యం చెప్పబడలేదని గుర్తుంచుకోవలసి వుంటుంది. ★

మత రాజ్యాన్ని వ్యతిరేకించిన మౌలానా


నివాళి



ఎస్. వినయ కుమార్

'మనల్ని ఈ దేశంలో ఉండనిచ్చారు. కనుక మనం ఈ దేశ రక్షణ కోసం పోరాడాలి.' ఇదొక షార్ట్ ఫిలింలోని డైలాగ్. మృత్యుశయ్య పైనున్న ఓ తండ్రి...సైన్యంలో పనిచేసే తన కొడుక్కి ఇచ్చే సందేశమిది. హిందువులు భారత దేశంలో ఉండాలి. ముస్లింలు పాకిస్తాన్ వెళ్లాలన్న భావన లోంచి వచ్చిన డైలాగ్ అది. భారతదేశం కేవలం హిందువుల దేశం అన్న అవగాహన రాజ్యాంగ విరుద్ధమని ఆ షార్ట్ ఫిలిం తీసిన వారికి చెప్పినప్పుడు, అవునా ! మాకు తెలియదే అంటూ ఆశ్చర్యపోయారు. సంఘ్‌పరివార్ దుష్ప్రచారం వల్ల చాలామంది, ప్రత్యేకించి యువత ఈ తప్పుడు అవగాహనతో ఉన్నారు. పాకిస్తాన్ మాత్రమే మత ప్రాతిపదికన ఏర్పాటయిందనే విషయం వారికి తెలియదు. బ్రిటిష్ పాలకుల దుష్ట పన్నాగం వల్ల, వారి ప్రోద్బలంతో సాగిన మత విద్వేష ప్రచారం వల్ల జాతీయోద్యమ నాయకులు దేశ విభజనను ఆపలేకపోయారు. స్వాతంత్ర్యమా? దేశ విభజనా అన్న ప్రశ్న వలస పాలకుల నుండి వచ్చిపడింది. సావర్కర్ గొల్వాల్కర్, మహ్మదాలీ జిన్నాల రెండు జాతుల వాదనను కాంగ్రెస్ నాయకత్వం అంగీకరించపోయినా ఆ వాదనే దేశ విభజనకు కారణమైంది.

విభజన కోసం పట్టుపట్టిన జిన్నా ఒక రాజకీయ నాయకుడు, మతం పట్ల ఆసక్తి లేనివాడు. ఆహార్యంలో, ఆలోచనల్లో ఆంగ్లేయుడు. కాగా ఆనాటి కాంగ్రెస్ ముఖ్య నాయకుల్లో ఒకరైన మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఇస్లామిక్ పండితుడు. పాకిస్తాన్ ఏర్పాటును ఆయన గట్టిగా వ్యతిరేకించారు. మత ప్రాతిపదికపై దేశ సరిహద్దులు నిర్ణయించరాదని కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. అలా చేయడం ఖురాన్‌కు వ్యతిరేకం అన్నారు. మౌలానా నవంబర్ 11, 1888లో మక్కాలో పుట్టారు. ఆయన తండ్రి ప్రముఖ ఇస్లామిక్ పండితుడు, బెంగాల్ నుండి 1857 సిపాయి తిరుగుబాటు సందర్భంగా మక్కా వెళ్లి స్థిరపడ్డారు. మౌలానాకు బాల్యంలో ఆయనే చదువు చెప్పారు. ఆ తర్వాత వివిధ సబ్జెక్టుల్లోని పండితులు చదువు చెప్పారు. మౌలానా ఇండియాకు వచ్చి స్వాతంత్ర్య పోరాటంలో చేరారు. అరబ్బీతో పాటు ఇంగ్లీషు, పారసీ, ఉర్దూ, బెంగాలీ భాషల్లో ప్రావీణ్యం గడించాడు. కలకత్తా నుండి ఉర్దూలో 'అల్ హిలాల్' వార పత్రిక నడిపారు. అది స్వాతంత్ర్య పోరాటానికి మద్దతునిస్తూ, హిందూ ముస్లిం ఐక్యతను ప్రబోధించేది. బ్రిటిష్ పాలకులు ఆయన పత్రికను మూయించారు. స్వాతంత్రం తర్వాత నెహ్రూ మంత్రివర్గంలో విద్యాశాఖ మంత్రిగా ఉంటూ యుజిసి, ఐఐటి, ఐసిఎస్‌ఆర్ వంటి ఎన్నో గొప్ప సంస్థలను విశ్వవిద్యాలయాలను నెలకొల్పి దేశ నిర్మాణంలో ముఖ్య భూమిక పోషించారు. ఆధునిక విద్యావ్యాప్తికి కృషి చేశారు. పలుపుస్తకాలు రాశారు. 1992లో భారత ప్రభుత్వం ఆయనకు భారతరత్న బిరుదు ప్రకటించింది. మౌలానా అంటే పండితుడు కాగా, ఆజాద్ (స్వాతంత్ర్యం) ఆయన కలం పేర్లు.



రేపు 135వ జయంతి

యునైటెడ్ ప్రావియెన్స్ నుండి రాజ్యాంగ సభకు ఎన్నికైన మౌలానా ....రౌండ్ టేబుల్ సమావేశంలోనూ, బ్రిటిష్ పాలకులతో పలుదశల్లో జరిగిన చర్చల్లోనూ పాకిస్తాన్ ఏర్పాటును గట్టిగా వ్యతిరేకించారు. పాకిస్తాన్ ఏర్పడటానికి ముందు 1946 లో లాహోర్ నుండి వెలువడే ఉర్దూ పత్రిక 'చట్టాన్' కు ఇంటర్వ్యూ ఇస్తూ పాకిస్తాన్ ఏర్పడితే అది ఎంతటి దుస్థితిలోకి దిగజారుతుందో చెప్పారు. ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకొంటే ఆయన చెప్పిందే నిజమైంది. "పాకిస్తాన్ ఏర్పడినా దాని తూర్పు భాగం (ప్రస్తుతం బంగ్లాదేశ్) దాని వెంట ఉండదు. అసమర్థ పాకిస్తాన్ పాలకులు దేశాన్ని సైనిక నియంతత్వం వైపు తీసుకెళ్తారు. పాకిస్తాన్ ఏర్పాటుతో ముస్లింలకు గాని, ఇస్లాంకు గానీ ఏ ప్రయోజనమూ ఉండదు. పాకిస్తాన్ డిమాండ్ రాజకీయపరమైందే తప్ప మతపరమైంది కాదు. మతం ఆధారంగా దేశాల సరిహద్దులు నిర్ణయించేట్లయితే ఇస్లాం ఇండియాలోకి ప్రవేశించేదే కాదు." అని మౌలానా చెప్పారు.

మతం నమ్మకంపై తప్ప వంశపారంపర్యంగా రాకూడదని ఆయన అభిప్రాయం "యూదులు, పార్సీలు, హిందువుల తరహాలో భారతీయ ముస్లింలు కూడా ఇస్లాంను వారసత్వంతో సక్రమించేదిగా మార్చారు. పాకిస్తాన్ ఏర్పడితే అది మత స్వభావం గల ఘర్షణలను నిరంతరం ఎదుర్కొంటుంది. ఈరోజు చాలా మంది ఉలేమాలు జిన్నా వెంట ఉన్నారు. అన్ని యుగాల్లో, అన్ని కాలాల్లో ఉలేమాలు ఇస్లాంకు తలవంపులే తెచ్చిపెట్టారు." అని విమర్శించేవారు.

"పాకిస్తాన్ ఏర్పాటు ముస్లింలకు మంచి చేసేదైతే..... నేను కూడా పాకిస్తాన్ ఏర్పాటును సమర్థించే వాణ్ణి. నేను పాకిస్తాన్ డిమాండ్ వెనుక ఉన్న ప్రమాదాన్ని స్పష్టంగా చూస్తున్నాను. ఆ దుష్ట సంకల్పం పాకిస్తాన్నే కాదు, భారతదేశానికీ నష్టం చేస్తుంది. దేశంలోని ముస్లింలంతా పాకిస్తాన్ వెళ్తే అక్కడ చోటే ఉండదు. పశ్చిమ పాకిస్తాన్‌లో హిందువులు ఉండలేరు. వారిని బయటికి నెట్టేస్తారు. లేదా వారే బయటికొస్తారు. దాని దుష్ఫలితాలు ఇండియాలో కన్పిస్తాయి." ఆయన చెప్పారు.

దేశ విభజన తర్వాత ఇండియాలో ఉండే ముస్లింలు ఇబ్బందుల పాలవుతారని మౌలానా అభిప్రాయ పడ్డారంటే అందుకు ఒక సెక్షన్ కాంగ్రెస్ నాయకులపై ఆయనకు నమ్మకం లేకపోవడమే కారణమని భావించవచ్చు. కాంగ్రెస్ నాయకత్వం అవకాశ వాదంతో, మత శక్తులతో పలు సందర్భాల్లో రాజీపడింది. మత సామరస్యం మీద పైపై మాటలు తప్ప నిర్దిష్ట వైఖరి కాంగ్రెస్ దగ్గర లేకుండా పోయింది. బిజెపి బలపడగానే కాంగ్రెస్ చాటున ఉన్న మతతత్వ వాదులు బిజెపిలోకి జంప్ చేశారు. విడ్డూరమేమిటంటే.. వరుసకు మౌలానా మునిమనవరాలైన రాజ్యసభ మాజీ ఉపాధ్యక్షురాలు నజ్మా హెప్తుల్లా, కాంగ్రెస్ మాజీ ఎంపి ఎంజె అక్బర్, మరో నాయకుడు ఆరిఫ్ మహ్మద్ ఖాన్ పదవుల కోసం బిజెపిలో చేరారు. 'చట్టాన్' ఇంటర్వ్యూను వెతికి పట్టుకొని నేటి తరం ముందుంచిన ఆరిఫ్ మహమ్మద్ ఖాన్... ఇప్పుడు గవర్నర్‌గా ఉంటూ బిజెపికి పనిముట్టుగా మారి కేరళ ప్రభుత్వానికి పదే పదే మోకాలడ్డుతున్నారు. వివిధ సందర్భాల్లో ఎస్‌పి, బిఎస్‌పి, జెడియు, జెడిఎస్, అకాలీదళ్, వైసిపి, తెలుగుదేశం, జనసేన, ఏఐడిఎంకె వంటి పార్టీలు కూడా అవకాశవాదంతో బిజెపి కొట్టం కింద చేరిన సందర్భాలున్నాయి.

ఇస్లాం విదేశీ మతమని, ముస్లింలు దేశం వదలి వెళ్లాలని లేదా రెండవ తరగతి పౌరులుగా జీవించాలని సంఘ్ పరివార్ చెబుతోంది. భారత రాజ్యాంగ మౌలిక స్వభావాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వివిధ రాజకీయ పార్టీల వైఫల్యం ఇందుకు కారణమని చెప్పక తప్పదు. ముస్లింల్లో అభ్యుదయ శాస్త్రీయ దక్పథాన్ని తీసుకెళ్లే ప్రయత్నం జరగపోవడం కూడా ఒక పెద్ద లోపం.

బ్రిటిష్ పాలకులు కాంగ్రెస్ నాయకులను దీర్ఘకాలం జైళ్లలో ఉంచారు. దానివల్ల ముస్లింలకు జిన్నా తిరుగులేని నాయకుడు అయ్యారు. ముస్లిం లీగ్‌తో పాటు హిందూ మహాసభపై బ్రిటిష్ పాలకులు నిర్బంధం అమలు చేయలేదు. రెండు సంస్థలు స్వాతంత్రోద్యమం నుండి దూరంగా ఉండి పోయాయి. తన పార్టీలోని సాంప్రదాయవాదుల ప్రమాదాన్ని కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసింది. మతశక్తులకు మద్దతు ఇచ్చేవారు కాంగ్రెస్‌లో ప్రముఖ స్థానాల్లోనే ఉన్నారు.

1931లో ఉరిశిక్షకు గురైన స్వాతంత్ర్య వీరుడు భగత్‌సింగ్ మతశక్తుల పట్ల స్పష్టమైన హెచ్చరిక చేశారు. కాంగ్రెస్‌కు మాత్రం మహాత్మా గాంధీ హత్య తర్వాతే కొంత కనువిప్పు కలిగింది. సమాజాన్ని మతతత్వం విషతుల్యం చేసిన నేపథ్యంలో ఒక పిచ్చోడు చేసిన చర్యగా గాంధీజీ హత్యను నెహ్రూ పేర్కొన్నారు. అదే పటేల్ కూడా చెప్పారు. ప్రతి సందర్భంలోనూ పాకిస్తాన్ ఏర్పాటును గట్టిగా వ్యతిరేకించిన మౌలానా మాతృదేశంలోనే ఉందామనుకున్న ముస్లింలకు స్ఫూర్తిదాత అయ్యారు. ముస్లింలను రాజకీయ పార్టీలు ఓటర్లుగా కాదు దేశ పౌరులుగా చూడాలి.

వ్యాస రచయిత -ప్రజాశక్తి పూర్వ సంపాదకులు

జనవాక్యం

జనగణన నుంచి టీచర్లకు మినహాయింపు ఇవ్వాలి

దేశమంతటా పదేళ్లకోసారి జరిగే జనగణనను 2025 మొదటి త్రైమాసికంలో చేపట్టేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నట్లు వార్తా కథనాలు తెలియచేస్తున్నాయి. 2021లో జరగాల్సిన జాతీయ జనగణన కోవిడ్ కారణంగా వాయిదా పడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాల రూపకల్పనలో, నియోజక వర్గాల పునర్వ్యవస్థీకరణలో జనగణన ప్రాత్ర కీలకమైనది. కాబట్టి ప్రతీసారి జాతీయ జనాభా లెక్కల సేకరణ విధులు సాధారణంగా ఉపాధ్యాయులకు కేటాయిస్తారు. విధులు నిర్వర్తించే ఒక్కో ఉపాధ్యాయుడు దాదాపు 500 కుటుంబాల నుంచి వివరాలు సేకరించాల్సి ఉంటుంది. ఇందుకు ఉపాధ్యాయులకు దాదాపు నెల రోజులు సమయం పడుతుంది. దీంతో విద్యార్థులకు బోధనా సమయం కేటాయించలేరు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో కులగణన విధులు ఉపాధ్యాయులకు కేటాయించడంతో అక్కడ విద్యార్థులకు బోధనా సమయం వృధా అవుతున్నది. మార్చి, ఏప్రిల్ నెలల్లో విద్యార్థులకు పరీక్షల దృష్ట్యా ఈ విధుల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యామ్నాయ మార్గాలను చూడాలి.

- వాసిలి సురేష్, నెల్లూరు

వాహనాల కేసులను సత్వరమే పరిష్కరించాలి

చోరీకి గురి కాబడిన 251 వాహనాలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో స్వాధీనం చేసుకున్న ఏలూరు పోలీసులను ముఖ్యమంత్రి అభినందించారు. ఇలా స్వాధీనం కాబడిన వాహనాలు, పలు కేసుల్లో, వివాదాల్లో పట్టుబడిన వాహనాలు ఏళ్ళతరబడి పోలీస్ స్టేషన్ల వద్ద ఉండి, కేసులు పరిష్కారం కాక తుప్పుపట్టి పోతున్నాయి. చోరీకి గురికాబడిన వాహనాలను వాటి యజమానులకు తక్షణం అప్పజెప్పాలి. అలాగే వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాల కేసుల సత్వర పరిష్కారానికి పోలీసులు చొరవ చూపాలి. వాహన యజమానులు రాకపోయినా, సహకరించకపోయినా నిబంధనల మేరకు వాటిని వేలం వేయాలి. ముఖ్యమంత్రి అన్నట్టు అవి తుప్పుపట్టి పోతే ఎవరికీ ఉపయోగం లేదు?

- గరిమెళ్ల రామకష్ణ, ఏలూరు

మహిళలు, చిన్నారులపై నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

- హోం మంత్రి అనిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మహిళలు, చిన్నారులపై నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని హోంమంత్రి వంగలపూడి అనిత పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి శనివారం శాంతిభద్రతలపై ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా 'అదృశ్యం' కేసులలో గాలింపు చర్యలు వేగవంతం చేయాలని, అఘాయిత్యాలు జరగకముందే నివారణ చర్యలు చేపట్టాలని ఆమె ఆదేశించారు. ప్రత్యేక టాస్క్‌ఫోర్సులు, కోర్టులలో బాధితులకు త్వరగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఛార్జిషీటు వేయడం, నిందితుల అరెస్టులో జాప్యం లేకుండా చేసి నేరాలను నియంత్రించడంపై శ్రద్ధ చూపాలని నిర్దేశించారు. గంజాయి, డ్రగ్స్ నియంత్రణపైనా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈగిల్ వంటి యాంటీ నార్కోటిక్ టాస్క్ ఫోర్స్ బృందం అక్రమంగా రవాణా చేస్తున్న 25 వేల కేజీల గంజాయిని పట్టుకొన్న సిబ్బందిని ప్రశంసించారు. ఈ కేసుల్లో 373 వాహనాలను స్వాధీనం చేసుకోవడం, 2,237 మంది నిందితులను గుర్తించడంలో సిబ్బంది కృషి ఎంతో ఉందని చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో అసభ్య పోస్టులు పెట్టేవారిని ఉక్కుపాదం మోపాలన్నారు. అసభ్య పదజాలం, అశ్లీల పోస్టులతో పేట్రేగిపోతున్న కొందరిని ఇప్పటికే అరెస్ట్ చేశామని, మరికొందరికి



నోటీసులు జారీ చేశామని ఉన్నతాధికారులు హోంమంత్రికి నివేదించారు. ప్రత్యేక పోలీసు చట్టాలను ప్రయోగించి సోషల్ మీడియాలో ఉన్మాదుల్లా వ్యవహరించే వారిపై గుణపాఠం నేర్పేలా కఠిన చర్యలు చేపట్టాలని హోం మంత్రి ఆదేశించారు. డిజిపి కార్యాలయంతో సహా ప్రతి జిల్లాలో సోషల్ మీడియా సెల్‌ను ఏర్పాటు చేసి బాధితులకు అండగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సిఎం, డిప్యూటీ సిఎం, హోంమంత్రిని ట్యాగ్ చేసి సోషల్ మీడియాలో న్యాయం కోరే బాధితుల సమస్యలకు ప్రాధాన్యత ఇచ్చి వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో డిజిపి ద్వారకా తిరుమలరావు, ఇంటెలిజెన్స్ ఎడిజి లడ్హా, సిఐడి ఎడిజి రవిశంకర్, యాంటీ నార్కొటిక్ చీఫ్ రవిక్రిష్ణ, లా అండ్ ఆర్డర్ ఐజి శ్రీకాంత్, అన్ని జిల్లాల ఎస్పీలు, అదనపు ఎస్పీలు సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయంలో అర్జీలు స్వీకరించిన పల్లా శ్రీనివాస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్యలతో కలిసి గ్రీవెన్స్ నిర్వహించారు. తమపై అక్రమ కేసులు పెట్టి వేధించారని అనంతపురం జిల్లా ఎర్రప్పదొడ్డికి చెందిన గొల్ల గోవిందు, కృష్ణప్పలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు బుచ్చి రాంప్రసాద్, క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు మోజెస్ దాసు పాల్గొన్నారు. ఈ నెల 11 నుంచి 16వ తేదీ వరకు గ్రీవెన్స్ నిర్వహించే వారి జాబితాను టిడిపి విడుదల చేసింది.

మహిళలపై నేరాలు తగ్గాయి : పీతల సుజాత

గత వైసిపి ప్రభుత్వ పాలనతో పోల్చితే కూటమి ప్రభుత్వంలో మహిళలపై నేరాల సంఖ్య 25 శాతానికి తగ్గాయని టిడిపి నాయకులు, మాజీ మంత్రి పీతల సుజాత అన్నారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాబోయే రోజుల్లో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు వ్యాప్తి చేసేవారిని ఎవ్వరినీ వదిలే ప్రసక్తే లేదని ఆమె తెలిపారు.

చైనాలో ఇండొనేషియా నేత పర్యటన

- జిన్‌పింగ్‌తో సుబియాంతో భేటీ

బీజింగ్ : చైనా, ఇండోనేషియా సంబంధాల్లో కొత్త అధ్యాయం ఆరంభమవుతుందని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం చైనాలో పర్యటిస్తున్న ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబౌ సుబియాంతో శనివారం జిన్‌పింగ్‌తో సమావేశమయ్యారు. వీరిరువురూ పలు అంశాలపై చర్చలు జరిపారు. అక్టోబరులో అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన సుబియాంతో జరుపుతున్న తొలి విదేశీ పర్యటన ఇదే. స్వావలంబన, సంఘీభావం, సహకారం, పరస్పర సహకారం, సమాన అవకాశాలు కోసం ఇరు దేశాలు కలిసి పని చేయాలని నిర్ణయించాయి. ఇటీవలి కాలంలో ఇండోనేషియాలో సహజ వనరుల వెలికితీతతో చైనా కంపెనీలు పాలు పంచుకుంటున్నాయి. రెండు దేశాల మధ్య సంబంధాలు బలోపేతమవుతున్నాయని సుబియాంతో అన్నారు. మొత్తంగా ఆసియా ప్రాంత శాంతి, సుస్థిరతలకు, ప్రజల సంక్షేమానికి, ఇరు దేశాల ప్రజల పరస్పర లబ్ధికి కలిసి కృషి చేయనున్నట్లు తెలిపారు. అంతకుముందు బీజింగ్‌లోని గ్రేట్ హాల్ ఆఫ్ ది పీపుల్‌లో సుబియాంటోకు జిన్‌పింగ్ స్వాగతం పలికారు. చర్చల అనంతరం ఇరు దేశాల అధికారులు పలు మెమమోరాండాలపై సంతకాలు చేశారు. సముద్ర జలాల భద్రత, జల వనరుల సహకారం వంటి అంశాలపై అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకున్నారు. శుక్రవారం చైనా చేరుకున్న సుబియాంటో చైనా ప్రధాని లీ కియాంగ్‌తో కూడా సమావేశమయ్యారు. ఇక్కడ నుండి ఆయన అమెరికా వెళ్లనున్నారు. అటుపై పెరూ, బ్రెజిల్, బ్రిటన్‌ల్లో కూడా పర్యటించనున్నారు.



ఎస్‌పికి ఫిర్యాదు చేస్తున్న అంబటి, తదితరులు

ఏకపక్షంగా వైసిపి నేతల అరెస్టులు

- మాజీ మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టారన్న అభియోగంపై వైసిపి కార్యకర్తలు, నాయకులను పోలీసులు ఏకపక్షంగా అరెస్టు చేస్తున్నారని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. వైసిపి నాయకులపై టిడిపి వారు అసభ్య పదజాలంతో పోస్టింగ్‌లు పెట్టినా వారిపై ఏ విధమైన చర్యలూ లేవన్నారు. పోలీసుల తీరును నిరసిస్తూ అంబటి రాంబాబు ఆధ్వర్యంలో వైసిపి జిల్లా నాయకులు ఎస్పిని కలిసి ఫిర్యాదు చేశారు. మీడియాతో అంబటి మాట్లాడుతూ... సోషల్ మీడియా పోస్టులు అంటూ వేరే కేసులు పెట్టి అరెస్టు చేసి జైలుకు పంపుతున్నారని చెప్పారు. చిలకలూరిపేట వద్ద ఈ నెల నాలుగున తమ పార్టీ నాయకులు సుధారాణిని తీసుకువెళ్లి ఎనిమిదో తేదీ రాత్రి జడ్జి ముందు ప్రవేశపెట్టారన్నారు. తనను కొట్టారని జడ్జి ముందు సుధారాణి చెప్పారని, గాయాలను కూడా చూపించిందని తెలిపారు. పోలీసుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా తాము న్యాయపోరాటం చేస్తామన్నారు. అంబటి వెంట ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మేయర్ కావటి మనోహర్ నాయుడు, డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు, పార్టీ నాయకులు, తదితరులు ఉన్నారు.

వర్ధమాన దేశాలకు మరింత సాయం

- వాతావరణ మార్పులపై సంపన్న దేశాలకు యూఎన్‌ఈపీ సూచన

న్యూఢిల్లీ : వాతావరణ మార్పుల కారణంగా ఎదురవుతున్న సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సంపన్న దేశాలు వర్ధమాన దేశాలకు మరింత ఆర్థిక సాయాన్ని అందించాల్సిన అవసరం ఉన్నదని ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమానికి (యూఎన్‌ఈపీ) సంబంధించిన నివేదిక సూచించింది. ఈ నివేదికను ఈ నెల 7వ తేదీన విడుదల చేశారు. ప్రస్తుతం వర్ధమాన దేశాలకు అందుతున్న సాయం, అందాల్సిన సాయం మధ్య ఏటా 187-359 బిలియన్ డాలర్ల వ్యత్యాసం ఉన్నదని ఆ నివేదిక ఎత్తిచూపింది. 2021లో వర్ధమాన దేశాలకు సంపన్న దేశాలు 22 బిలియన్ డాలర్లు అందించగా అది 2022 నాటికి 28 బిలియన్ డాలర్లకు పెరిగింది. పారిస్ ఒప్పందం తర్వాత ప్రతి ఏటా ఈ సాయం పెరుగుతూనే ఉన్నప్పటికీ అది చాలదని నివేదిక అభిప్రాయపడింది.

2025 నాటికి సంపన్న దేశాల సాయం 38 బిలియన్ డాలర్లకు చేరాలని గ్లాస్గో వాతావరణ ఒప్పందం లక్ష్యంగా నిర్దేశించుకుంది. అయితే అప్పటికి వర్ధమాన దేశాలకు కనీసం 40 బిలియన్ డాలర్ల సాయం అయినా అందాలని, వ్యత్యాసాన్ని పూడ్చాలంటే ఇది అవసరమని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ అంటోనియో గుటెర్రస్ తెలిపారు. కాగా వర్ధమాన దేశాలపై రుణ భారం పెరిగిపోతోందని యూఎన్‌ఈపీ నివేదిక తెలిపింది. వాతావరణ మార్పులను ఎదుర్కొనే విషయంలో ప్రైవేటు పెట్టుబడులకు విస్తృత అవకాశాలు ఉన్నాయని, అయితే ప్రస్తుతం అవి ఆశించిన స్థాయిలో లేవని చెప్పింది. ఆర్థిక సాయాన్ని అందుకోవడంతో పాటు సామర్థ్యాన్ని పెంచుకోవడం, సాంకేతిక బదిలీలను బలోపేతం చేసుకోవడంపై వర్ధమాన దేశాలు దృష్టి సారించాలని సూచించింది. ముఖ్యంగా ఏదో ఒక సాంకేతికతను అందిపుచ్చుకోవడం కంటే దేశ అవసరాలను గమనంలో ఉంచుకోవాలని కోరింది.

వాతావరణ మార్పుల విషయంలో 87 శాతం దేశాలు ఒకే విధానాన్ని రూపొందించుకున్నాయి. కొన్ని దేశాలకు రెండు లేదా అంతకంటే ఎక్కువ విధానాలే ఉన్నాయి. వాతావరణ మార్పులు ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా అనేక సమాజాలను ధ్వంసం చేస్తున్నాయి. ముఖ్యంగా పేద దేశాలు వాటిని తట్టుకోలేకపోతున్నాయి. తుపానుల కారణంగా నివాస గృహాలు నేలమట్టం కావడం, అడవులలో కార్చిచ్చులు, భూమి కోత, కరువు కాటకాలు వంటి పరిణామాలు వాతావరణ మార్పుల కారణంగానే సంభవిస్తున్నాయని యూఎన్‌ఈపీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇంగర్ అండర్సన్ చెప్పారు. వాతావరణంలో సంభవిస్తున్న మార్పులతో ప్రజలు, వారి జీవనభృతి, వారు ఆధారపడే వనరులు..అన్నీ ధ్వంసం అవుతున్నాయని, దీనిపై ప్రపంచ నేతలు తక్షణమే చర్చించి చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని ఆయన హెచ్చరించారు.

వచ్చేవారం బాకులో సిఓపి-29 శిఖరాగ్ర సదస్సు

వాతావరణ మార్పులపై వచ్చే వారం అజర్‌బైజాన్ రాజధాని బాకులో సిఓపి-29 శిఖరాగ్ర సదస్సు జరగనుంది. ప్రతి యేటా జరిగే ఈ దస్సుల్లో కర్బన ఉద్గారాల తగ్గింపు, ఫైనాన్స్ స్కీమ్స్, ఫండింగ్ గురించి వివిధ దేశాల అధినేతలు హామీలు కురిపిస్తారు. లక్ష్యాలను ప్రకటిస్తారు. అవన్నీ కాగితాలకే పరిమితమవుతున్నాయి. అడుగు ముందుకు పడడం లేదు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ మళ్లీ ఎన్నికయ్యాక వాతావరణ మార్పులపై పారిస్ ఒప్పందం నుంచి తాము వెనక్కి వచ్చే అంశాన్ని పరిశీలిస్తామని సంకేతాలు ఇచ్చారు.దీంతో బాకు సదస్సులో ఎలాంటి పురోగతి ఉండే అవకాశం లేదని పరిశీలకులు భావిస్తున్నారు. యుద్ధాలు, కర్బన ఉద్గారాల ద్వారా భూగోళం వేడెక్కడానికి కారణమవుతున్న సంపన్న దేశాలు, పరిహారం చెల్లింపు విషయానికొచ్చేసరికి వర్ధమాన దేశాలపై భారాన్ని నెట్టేసే యత్నం చేస్తున్నారు. చర్చలు ప్రతిష్టంభనలో పడడానికి ఇదే ముఖ్య కారణం.

యుపిలో మరో దారుణం

- మైనర్ నీట్ అభ్యర్థిపై అత్యాచారం, బెదిరింపులు
- ఇద్దరు కోచింగ్ టీచర్లు అరెస్టు

లక్నో : ఉత్తర ప్రదేశ్‌లో మహిళలకు రక్షణ లేకుండా పోతోంది. మైనర్ అయిన నీట్‌కు కోచింగ్ తీసుకుంటున్న అభ్యర్థిపై ఆ కోచింగ్ సెంటర్‌కు చెందిన ఇద్దరు టీచర్లు అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ తరువాత కూడా ఆరు నెలల పాటు ఒక రూమ్‌లో బందీగా ఉంచి పలుమార్లు అఘాత్యాన్ని పాల్పడ్డారు. ఈ దారుణంపై బాధితురాలు తాజాగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కళ్యాణ్‌పూర్ ఎసిపి అభిషేక్ పాండే తెలిపిన వివరాల ప్రకారం రాష్ట్రంలోని ఫతేపూర్‌కు చెందిన బాధితురాలు కన్పూర్‌లో నీట్‌కు శిక్షణ ఇచ్చే ఒక కోచింగ్ సెంటర్‌లో చేరారు. ఒక సిటీ హాస్టల్‌లో ఉంటూ తరగతులకు వెళ్లేవారు. అయితే 2022 డిసెంబరున న్యూయిర్ పార్టీ పేరుతో బాధిత విద్యార్థిన్ని ఆ కోచింగ్ సెంటర్ టీచర్లు సాహిల్ సిద్ధికి, వికార్ పోర్వాల్ ఒక అపార్ట్‌మెంట్‌కు ఆహ్వానించారు. మిగిలిన విద్యార్థులు కూడా వస్తారని చెప్పారు. దీంతో ఈ విద్యార్థి అక్కడకు వెళ్లింది. అయితే అక్కడ ఎవ్వరూ లేకపోవడం గమనించి వెనక్కి వచ్చేయడానికి ప్రయత్నం చేసింది. అయితే ఆమెను సిద్ధికి బలవంతంగా లోపలకి తీసుకుని వెళ్లాడు. తరువాత ఆమెకు మత్తు మందు కలిపిన డ్రింక్ ఇచ్చి అత్యాచారానికి పాల్పడ్డారు. ఆపైగా ఈ దారుణాన్ని వీడియో తీసారు. తరువాత ఈ వీడియో చూపించి ఆమెపై బెదిరింపులకు దిగారు. సిద్ధికి ఫ్లాట్‌లో ఆరు నెలలు పాటు బందీగా ఉంచి అనేక సార్లు అత్యాచారానికి పాల్పడ్డారు. తరువాత అక్కడకు వచ్చిన ఆమె తల్లి కుమార్తెను ఫతేపూర్‌కు తీసుకుని వెళ్లిపోయారు.

ఈ ఘటన జరిగినప్పుడు విద్యార్థి వయస్సు 17 ఏళ్లు. అయితే పరువు పోతుందనే భయంతో పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. కాగా, రెండు నెలలు క్రితం సిద్ధికి మరో విద్యార్థితో అసభ్యకర చర్యలకు పాల్పడి అరెస్టయ్యాడు. ఇటీవలే బెయిల్‌పై విడుదలయ్యాడు. ఈ సంఘటనతో ఆమె ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిద్ధికి, వికార్ పోర్వాల్‌పై పోక్సో చట్టంతో పాటు బిఎన్ఎస్‌లోని సెక్షన్లు 328, 376(2)(ఎన్), 344, 506 కింద కేసు నమోదు చేశారు. అదుపులోకి తీసుకున్నారు.

ట్రంప్ రాకతో భారత్‌పై సుంకాల భారం !

- హెచ్చరిస్తున్న వాణిజ్య నిపుణులు
- హెచ్-1 బి వీసా నిబంధనల్లో మార్పు ?
- భారత ఐటి పరిశ్రమకు పెద్ద దెబ్బ

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడుగా ట్రంప్ అధికారంలోకి రానున్న వేళ భారత ఎగుమతిదారులు అధిక కస్టమ్స్ సుంకాలను ఎదుర్కొనే పరిస్థితులు వుండవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. అమెరికా ఫస్ట్ ఎజెండాను అనుసరించాలని కొత్త ప్రభుత్వం భావించినట్లైతే ఆటోమొబైల్స్, జౌళి, ఫార్మాస్యూటికల్స్ వంటి రంగాల ఉత్పత్తులకు అధిక సుంకాల బెడద తప్పదని వాణిజ్య నిపుణులు భావిస్తున్నారు. అలాగే హెచ్-1బి వీసా నిబంధనలను కూడా ట్రంప్ కట్టుదిట్టం వేస్తారని భావిస్తున్నారు. దీనివల్ల భారత ఐటి సంస్థలకు వ్యయం, అభివృద్ధి వంటి అంశాలు ప్రభావితమవుతాయని పేర్కొంటున్నారు. భారతీయ ఐటి ఎగుమతుల ఆదాయాల్లో 80శాతానికి పైగా అమెరికా నుండే వస్తోంది. వీసా నిబంధనల్లో మార్పులు వస్తే ముందుగా ప్రభావితమయ్యేది ఈ కంపెనీలే. భారత్‌కు అమెరికా అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా వుంది. వార్షిక వాణిజ్యం 19వేల కోట్ల డాలర్లు పైమాటే. చైనాకే కాకుండా, భారత్, ఇతర దేశాలకు కూడా టారిఫ్‌లను ట్రంప్ పెంచవచ్చని భావిస్తున్నట్లు గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జిటిఆర్ఐ) వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ వ్యాఖ్యానించారు. 2020లో భారత్‌ను పెద్ద మొత్తంలో టారిఫ్‌లను దుర్వినియోగం చేసే దేశంగా విమర్శించిన ట్రంప్ టారిఫ్ కింగ్‌గా భారత్‌ను అభివర్ణించారు. ఈ వ్యాఖ్యలు చూస్తుంటే రెండో పదవీ కాలంలో ట్రంప్ కఠినమైన చర్యలు తీసుకునే అవకాశం వుందన్నారు. ట్రంప్ అనుసరించాలనుకుంటున్న అమెరికా ఫస్ట్ ఎజెండాతో రక్షణాత్మక చర్యలు ఎక్కువవుతాయన్నారు. అయితే చైనా పట్ల అమెరికా కఠిన వైఖరి అనుసరించే అవకాశాలు వుండడం వల్ల భారత ఎగుమతిదారులకు కొత్త అవకాశాలు కూడా లభ్యమవుతాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన వెంటనే మేక్ అమెరికా గ్రేట్ అగైన్ (ఎంఎజిఎ) హ్యాష్ ట్యాగ్ వైరల్ అవడంతో వివిధ రంగాల్లో ట్రంప్ టారిఫ్‌లను పెంచుతారని కూడా భావించాల్సి వస్తోందని అంతర్జాతీయ వాణిజ్య నిపుణుడు విశ్వజిత్ ధర్ చెప్పారు. ట్రంప్ అధికారంలోకి రావడంతో రక్షణవాదానికి సంబంధించి భిన్నమైన శకం లోకి ప్రవేశిస్తున్నామన్నారు.

ఫెయిల్యూర్స్‌ను పాజిటీవ్‌గా తీసుకోవాలి

- ఎస్ఆర్ఐ వైద్య విద్యార్థులతో కేంద్ర మంత్రి పెమ్మసాని

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)

జీవితంలో ఫెయిల్యూర్ అనేది మనల్ని బలోపేతం చేసేలా ఉండాలని, దాన్ని పాజిటివ్‌గా తీసుకోవాలని రూరల్ డెవలప్‌మెంట్, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ విద్యార్థులకు సూచించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాలలో విద్యార్థులతో శనివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మన దేశంలో అత్యున్నత స్థాయికి చేరిన వారిలో ఎక్కువ మంది వైద్యులుగా కెరియర్ ప్రారంభించిన వారున్నారని, అలాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. నేడు ఎన్నో ప్రమాదకర రోగాలు ప్రజలను పీడిస్తున్నాయని, వాటిని అధిగమించడాన్ని ఒక ఛాలెంజ్‌గా తీసుకోవాలని అన్నారు. విద్యార్థులకు టైమ్ మేనేజ్మెంట్ చాలా ముఖ్యమని, టైమ్‌ని మనం మేనేజ్ చేయగలిగితే విజయం వరిస్తుందని, లేకుంటే టైమే మనల్ని మేనేజ్ చేస్తుందని పేర్కొన్నారు. తాను తొలిసారి మెడికల్ కాలేజీలో అడుగుపెట్టినప్పుడు అది ఒక ఛాలెంజ్‌గా భావించానని తెలిపారు. న్యూ బేసిక్ ఆఫ్ స్టడీబుల్ అవసరమని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కాలేజ్ అధికారులతో పాటు వైద్యులు తదితరులు పాల్గొన్నారు.



సాగు భూమికి పట్టాలివ్వాలంటూ...

సెల్ టవర్ ఎక్కిన దళిత రైతులు

ప్రజాశక్తి - కెవిబిపురం (తిరుపతి)

సాగుభూమికి పట్టాలివ్వాలంటూ కెవిబిపురం మండలం కళత్తూరు దళితవాడ రైతులు సెల్‌టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. చెట్టు పుట్ట కొట్టి ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలంటూ డిమాండ్ చేశారు. ఫారెస్టు ల్యాండ్‌కు ఆనుకుని వంద ఎకరాల రెవెన్యూ భూమి ఉంది. ఆ భూమిలో చెట్టుపుట్ట కొట్టి ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్నారు. తమ అధీనంలోని భూములకు పట్టాలివ్వాలంటూ ఏళ్ల తరబడి నిరసనలు తెలుపుతూనే ఉన్నారు. అప్పట్లో స్థానిక ఎంఎల్ఎ, ఎంపి గ్రామానికి చేరుకుని ఫారెస్టు వారితో మాట్లాడి దళితుల జోలికి వెళ్లొద్దని చెప్పడంతో సద్దుమణిగింది. అప్పటినుంచి దళితులు ఆ పొలాల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే ఫారెస్టు రేంజి అధికారి రాధికారెడ్డి ఆ భూములన్నీ ఫారెస్టు, రెవెన్యూకు సంబంధించినవని, సాగు చేయరాదని, ఒకవేళ ధిక్కరిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

50 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-చిట్వేలి : అన్నమయ్య జిల్లా చిట్వేలి మండలం అనుంపల్లి పోలీసు చెక్‌పోస్టు వద్ద 50 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు రైల్వేకోడూరు రూరల్ సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు. రాపూరు వైపు నుంచి చిట్వేలి వైపు వస్తున్న కారు చెక్‌పోస్టు వద్ద ఆపకుండా వెళ్లిపోవడతో పోలీసులు వెంబడించారు. కారును తనిఖీ చేయగా అందులో ఉన్న 50 కిలోల గంజాయి బయటపడింది. సుమారు రూ. పది లక్షల విలువ చేస్తుందని పోలీసులు తెలిపారు.

పాక్‌లో ఆడం.. : బిసిసిఐ

ముంబయి: ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీపై ఇంకా అనిశ్చితి కొనసాగుతూనే ఉంది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో పాకిస్తాన్ వేదికగా జరగాల్సిన ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడేందుకు భారతజట్టు పాకిస్తాన్‌కు వెళ్లాల్సి ఉండగా.. బిసిసిఐ అందుకు సుముఖంగా లేదు. ఈ క్రమంలో భారత జట్టు పాకిస్తాన్‌లో పర్యటించేది లేదని బిసిసిఐ మరోసారి స్పష్టం చేసింది. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలే ఇందుకు ప్రధాన కారణంగా బిసిసిఐ చెప్తోంది. భారత విదేశాంగ మంత్రి జై శంకర్ ఇస్లామాబాద్ పర్యటన అనంతరం బిసిసిఐ ఈ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో హైబ్రిడ్ మోడల్‌లో టోర్నీ జరపాలని బిసిసిఐ అంతర్జాతయ క్రికెట్ మండలి(ఐసిసి)ని కోరింది. భారత జట్టు ఆడే మ్యాచ్‌లకు దుబాయ్ వేదిక నిర్వహించాలని ప్రధానంగా డిమాండ్ చేస్తోంది. ఐసిసి బృందం శనివారం పాకిస్తాన్‌లో పర్యటించడానికి ముందు బిసిసిఐ ఈ ప్రకటన వెల్లడించింది. ఇక ఐసిసి బృందం పాకిస్తాన్‌లో టోర్నీ ఏర్పాట్లు, భారతజట్టు ఆడే స్టేడియంలను పరిశీలించనుంది. పాకిస్తాన్‌లో భారతజట్టు పర్యటిస్తే ఎదురయ్యే సమస్యలను ప్రధానంగా ఐసిసికి విన్నవించామని, అందువల్లే టోర్నమెంట్‌ను రెండు దేశాల్లో నిర్వహించాలని పట్టుబడుతున్నట్లు స్పష్టం చేశామని కేంద్ర ప్రభుత్వంతో ఆదేశాలతోనే ఏ నిర్ణయమైనా తీసుకుంటామని బిసిసిఐ స్పష్టం చేసింది.

హైబ్రిడ్ మోడల్‌కు అంగీకరించం: పిసిబి

లాహోర్: హైబ్రిడ్ మోడల్ ప్రతిపాదనను పాకిస్తాన్ క్రికెట్‌బోర్డు(పిసిబి) సుముఖంగా లేదు. మిగిలిన అన్ని జట్లు పాకిస్తాన్‌లో పర్యటిస్తుండగా.. బిసిసిఐ హైబ్రిడ్ మోడల్‌కు ప్రతిపాదించడమేమంటని ఐసిసి ముందు పట్టుబడుతోంది. శనివారం పిసిబి ఆఫీసులో ఈ విషయంపై స్పష్టత ఇస్తూ నఖ్వీ కీలక వ్యాఖ్యలు చేశాడు. 'గత రెండు నెలల నుంచి చాంపియన్స్ ట్రోఫీలో ఆడేందుకు పాకిస్తాన్‌కు టీమిండియా వెళ్లడం లేదని తెలిసింది. అయితే.. ఈ విషయంపై మా బోర్డు సభ్యులతో మాట్లాడాను. టోర్నీలో పాల్గొనేందుకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే రాత పూర్వకంగా సమర్పించాలి అని బిసిసిఐకి ఇప్పటికే మేము స్పష్టం చేశాం. ప్రస్తుతానికైతే హైబ్రిడ్ మోడల్‌పై ఎవరూ చర్చించడం లేదు. మేము హైబ్రిడ్ మోడల్‌కు అస్సలు అంగీకరించం. దుబాయ్‌లో టీమిండియా మ్యాచ్‌లు జరుగుతాయి అనే వార్త భారత మీడియా సృష్టి మాత్రమే. ఎందుకంటే.. ఇప్పటివరకూ ఐసిసి నుంచిగానీ బిసిసిఐ నుంచిగానీ మాకు ఎలాంటి సమాచారం అందలేదు' అని నఖ్వీ తెలిపాడు.

అన్ని వసతులు కల్పిస్తాం

'వచ్చే ఏడాది పాకిస్థాన్ వేదికగా చాంపియన్స్ ట్రోఫీలో ఆడేందుకు అన్ని జట్లు సుముఖంగా ఉన్నట్టు నఖ్వీ వివరించాడు. చాంపియన్స్ ట్రోఫీకి అర్హత సాధించిన అన్ని జట్ల బోర్డులతో నిరంతరం మాట్లాడుతూనే ఉన్నాను. పాకిస్తాన్ వచ్చి టోర్నీలో ఆడేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఆయా బోర్డులు చెప్పాయి. ఎవరైనా ఈ విషయాన్ని రాజకీయం చేస్తారని నేను అనుకోవడం లేదు. చాంపియన్స్ ట్రోఫీలో ఆడే అన్ని జట్లకు మేము అన్నిరకాల వసతులు కల్పిస్తాం' అని నఖ్వీ వెల్లడించాడు. షెడ్యూల్ ప్రకారం వచ్చే ఏడాది ఫిబ్రవరి 23న పాకిస్థాన్ గడ్డపై చాంపియన్స్ ట్రోఫీ జరగనుంది. టోర్నీ సమయం దగ్గర పడుతుండడంతో స్టేడియాల మరమ్మతు, సుందరీకరణ పనులను పిసిబి వేగవంతం చేసినట్లు వెల్లడించాడు.

ఆంధ్ర-ఉత్తరాఖండ్ రంజీ మ్యాచ్ డ్రా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్ర-ఉత్తరాఖండ్ జట్ల మధ్య విజయనగరంలోని చింతలవలస క్రికెట్ అకాడమీలో జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఉత్తరాఖండ్ జట్టు నిర్దేశించిన 321పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఆంధ్రప్రదేశ్ జట్టు నాల్గో, చివరిరోజు ఆట ముగిసే సమయానికి ఆరు వికెట్ల నష్టానికి 286 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోర్ వికెట్ నష్టానికి 8పరుగులతో చివరిరోజు ఆటను కొనసాగించిన ఆంధ్ర ఒక దశలో 4వికెట్ల నష్టానికి 140పరుగులు చేసి ఓటమి కోరల్లో నిలిచింది. ఆ దశలో కరణ్ షిండే(65)కి తోడు టీమిండియా ఆటగాళ్లు హనుమ విహారి(66), వికెట్ కీపర్ శ్రీకర్ భరత్(92) అద్భుత బ్యాటింగ్‌కు ఆదుకున్నారు. ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 146 పరుగులు చేయగా.. ఉత్తరాఖండ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 338, రెండో ఇన్నింగ్స్‌లో 129 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యతతో ఉత్తరాఖండ్‌కు మూడు పాయింట్లు దక్కాయి.

రెండోటెస్ట్‌లోనూ ఇండియా-ఎ ఓటమి

- ఆరు వికెట్ల తేడాతో నెగ్గిన ఆస్ట్రేలియా-ఏ జట్టు


మెల్‌బోర్న్: రెండో అనధికార టెస్టులోనూ ఇండియా-ఎ పరాజయాన్ని చవిచూసింది. మెల్‌బోర్న్‌లోని ఎంసిజి వేదికగా జరిగిన టెస్టులో ఆస్ట్రేలియా-ఎ జట్టు ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది. 168 పరుగుల లక్ష్యంతో శనివారం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా.. 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. వెబ్‌స్టర్ 46, శామ్ కోన్‌స్టాస్ 73 పరుగులు చేశారు. వీరు ఐదో వికెట్‌కు అజేయంగా 96 పరుగులు జోడించి ఆస్ట్రేలియా జట్టుకు విజయాన్ని అందించారు. అంతకుముందు ఇండియా-ఏ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 229 పరుగులకు ఆలౌటైంది. ఈ మ్యాచ్‌లో భారత్ తరపున జురల్ రాణించాడు. అతను రెండు ఇన్నింగ్స్‌లో హాఫ్ సెంచరీలు నమోదు చేశాడు. చాలా కూల్‌గా అతను తన బ్యాటింగ్ కొనసాగించాడు. సీనియర్ జట్టుకు అతను ఎంపికయ్యాడు. ఇండియన్ బౌలర్లలో ప్రసిద్ధి కృష్ణ ఒక్కడే రాణించాడు. రెండు ఇన్నింగ్స్‌లో కలిపి ఆరు వికెట్లు తీసుకున్నాడు.

స్కోరు బోర్డు(సంక్షిప్తంగా)...
ఇండియా-ఏ 161, 229 ఆస్ట్రేలియా-ఏ 223, 169/4

మహిళలకు తక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు

సమంత నటించిన హిందీ వెబ్‌సిరీస్ 'సిటాడెల్ : హనీ బన్నీ' అక్టోబరు 7న విడుదలైంది. ప్రస్తుతం సమంత ప్రమోషన్స్‌లో పాల్గొంటోంది. ఈ నేపథ్యంలో తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె సినిమాల్లో మహిళల పాత్ర గురించి మాట్లాడారు. మహిళా పాత్రలకు తక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని, మహిళలకు గుర్తింపు వచ్చేలా చేయడం నటిగా తన బాధ్యత అని అన్నారు. 'ఆడియన్స్‌ను తక్కువ అంచనా వేయకూడదు. వారు అన్ని విషయాలను గమనిస్తుంటారు. ఏం చేసినా బాధ్యతగా చేయాల్సి ఉంటుంది. అందుకే సినిమాల్లో పాత్రను ఎంచుకునే సమయంలో ఆచితూచి అడుగు వేస్తాను. ఎన్నో విషయాలు గురించి ఆలోచించి నిర్ణయం తీసుకుంటాను. ప్రస్తుత సమాజంలో మహిళలకు న్యాయమైన ప్రాతినిధ్యం ఉండాలని భావిస్తున్నాను. సినిమాల్లో రెండు, మూడు సన్నివేశాలకే పరిమితమయ్యే పాత్రలకు నేను దూరంగా ఉంటాను. 'సిటాడెల్ సిరీస్‌లో నటించడం సవాల్‌గా అనిపించింది. ఇందులో హీరోకు సమానమైన పాత్ర నాది. యాక్షన్ సన్నివేశాల్లోనూ హీరోతో సమానంగా చేశాను. అయితే, ఇలాంటి అవకాశాలు అరుదుగా వస్తుంటాయి. వాటికోసం నటీనటులు చాలా మంది ఎదురుచూస్తుంటార'ని చెప్పారు.





'డాకూ మహారాజా'గా బాలయ్య..!

బాలకృష్ణ హీరోగా నటిస్తున్న 109 సినిమా 'ఎన్‌బికె 109' టైటిల్‌తో షూటింగ్ జరుగుతోంది. దసరాకు టైటిల్, దీపావళికి టైటిల్ రివీల్ చేస్తామని గతంలో మేకర్లు ప్రకటించినా జరగలేదు. ఈసినిమా షూటింగ్ డిసెంబర్‌లో పూర్తి కావాల్సివుంది. ఇంకో రెండు, మూడు కీలక భాగాలను షూట్ చేయాల్సివుందని ఇటీవల చిత్ర యూనిట్ ప్రకటించింది. మరోవైపు బాలకృష్ణ, బోయపాటి శ్రీనివాస్ కాంబినేషన్‌లో 'అఖండ తాండవానికి' సినిమా తెరకెక్కుతోంది. ఈ చిత్రం కోసం 'డాకూ మహారాజా', 'సర్కార్ సీతారామ్' టైటిళ్ల పరిశీలనలో ఉన్నట్లుగా సమాచారం. 'డాకూ మహారాజా' పేరునే ఖరారు చేసే అవకాశాలు ఉన్నట్లుగా తెలిసింది.



ప్రభాస్‌తో పూరీజగన్నాథ్ సినిమా

హీరో ప్రభాస్‌తో డైరెక్టర్ పూరీ జగన్నాథ్ మూడోసారి కలిసి పనిచేయబోతున్నారు. ప్రభాస్ హీరోగా బుజ్జిగాడు (2008), ఏక్ నిరంజన్ (2009) వంటి చిత్రాలకు ఆయన దర్శకత్వం వహించారు. 'స్పిరిట్' చిత్రానికి పూరీ జగన్నాథ్ డైలాగులు అందించబోతున్నారు. ఆ సినిమా దర్శకుడు సందీప్ స్వయంగా అడగడంతో పూరీ జగన్నాథ్ అంగీకరించారు. సందీప్ స్టోరీకి పూరీ జగన్నాథ్ డైలాగులు రాస్తే అది మరింతగా రీచ్ అవుతుందన్నది మరో ఆలోచనగా చెబుతున్నారు. 'డబుల్ ఇస్మార్ట్' చిత్రం తర్వాత పూరీ జగన్నాథ్ దర్శకత్వం వహించే సినిమాపై ఇంకా స్పష్టత రావాల్సివుంది.




కోలీవుడ్ డైరెక్టర్‌తో తారక్ మూవీ

కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్‌కుమార్‌తో జూనియర్ ఎన్‌టిఆర్ ఒక ప్రాజెక్టు చేయబోతున్నారు. తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్‌కు జైలర్ వంటి బ్లాక్ బస్టర్‌ను ఆయన అందించారు. గతంలో దిలీప్‌కుమార్ డాక్టర్, జైలర్, బీస్ట్ వంటి సినిమాలు సత్తా చాటాయి. తాజాగా ఆయన నిర్మాతగా 'బ్లడీ బెగ్గర్' సినిమాను తెరకెక్కించారు. అనంతరం 'జైలర్ 2' సీక్వెల్‌ను తెరకెక్కించే పనిలో ఆయన ఉన్నారు. ఈ ప్రాజెక్టు అనంతరం తారక్ కోసం నెల్సన్ కొత్త ప్లాన్ రూపొందించినట్లు ఫిల్మ్ ఇండస్ట్రీలో చర్చలు జరుగుతున్నాయి. ఈ ఏడాదిలో ఎన్టీఆర్ నటించిన 'దేవర' సినిమా భారీ విజయాన్ని అందుకుంది. ఇండియన్ బాక్సాఫీసు వద్ద రూ.500 కోట్లు పైగానే కలెక్షన్లు రాబట్టి రికార్డు క్రియేట్ చేసింది. ఎన్‌టిఆర్ ఇప్పటికే 'దేవర 2', 'వార్ 2' సినిమాలు చేస్తున్నారు.

వివరాలు చెబితే రూ.5 లక్షలు బహుమతి

మంచు విష్ణు హీరోగా నటిస్తున్న కన్నప్ప సినిమా నుండి ప్రభాస్ ఫస్ట్ లుక్ లీక్ అయింది. తాజాగా ఈ విషయమై నిర్మాత, హీరో మంచు విష్ణు ఓ ప్రకటన విడుదల చేసారు. 'కన్నప్ప టీమ్ నుంచి అత్యవసర, హృదయపూర్వక విజ్ఞప్తి.. కన్నప్ప సినిమా నుంచి ఒక వర్క్ ఇన్ ప్రోగ్రెస్ ఇమేజ్ అనధికారంగా లీక్ అయినందుకు చాలా బాధ పడుతున్నాము. ఈ లీక్ మా కష్టాన్ని మాత్రమే కాకుండా, ఈ ప్రాజెక్టుకి నిరంతరం కృషి చేస్తున్న 2,000 మందికి పైగా విఎఫ్ఎక్స్ కళాకారుల జీవితాలను కూడా ప్రభావితం చేస్తోంది. లీక్ అయిన ఇమేజ్ ఫుటేజ్‌ను ఎవరైనా షేర్ చేస్తూ ఉంటే, ఆ దొంగల్ని పట్టుకోమని అభిమానులందర్నీ కోరుతున్నాము. దీనిని షేర్ చేయడం ద్వారా, చట్టపరమైన చర్యలకు గురి కావాల్సి ఉంటుంది. ఈ లీక్ చేసిన వారిని ఎవరైనా కనుగొంటే, వారికి రూ.5 లక్షల బహుమానంగా ఇస్తున్నాం. ఈ విషయం తెలుసుకున్న వెంటనే 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ ట్విట్టర్ అకౌంట్కు డైరెక్ట్‌గా మెసేజ్ పంపండి. ఈ సినిమా స్ఫూర్తిని కాపాడటంలో మాతో చేతులు కలపండి' అని పేర్కొన్నారు.



సిజెఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా రేపు బాధ్యతల స్వీకరణ

- రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణ స్వీకారం కార్యక్రమం
- నేటితో ముగియనున్న జస్టిస్ చంద్రచూడ్ పదవీకాలం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు 51వ ప్రధాన న్యాయమూర్తిగా (సిజెఐ) జస్టిస్ సంజీవ్ ఖన్నా సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుత సిజెఐ జస్టిస్ చంద్ర చూడ్ పదవికాలం ఆదివారంతో ముగియనుంది. దీంతో శుక్రవారం చివరి వర్కింగ్ డే కావడంతో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు నూతన సిజెఐగా సంజీవ్ ఖన్నా బాధ్యతలు చేపట్టనున్నారు. సోమవారం ఉదయం రాష్ట్రపతి భవన్ లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జస్టిస్ సంజీవ్ ఖన్నాతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. అనంతరం సుప్రీంకోర్టుకు చేరుకోనున్న జస్టిస్ సంజీవ్ ఖన్నా... కోర్టు నెంబర్ 1లో సిజెఐగా హోదాలో కేసులను విచారించనున్నారు. కాగా సిజెఐ జస్టిస్ చంద్రచూడ్ సిఫారసుల మేరకు సుప్రీంకోర్టు తదుపరి సిజెఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నాను నియమిస్తూ గత నెల 25న కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది.

మార్నింగ్ వాక్ వదులుకున్న నూతన సిజెఐ

నూతన సిజెఐగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ సంజీవ్ ఖన్నా తనకు అత్యంత ఇష్టమైన మార్నింగ్ వాక్ ను వదులుకున్నారు. భద్రతా, ఇతర కారణాల దృష్ట్యా రోజువారిగా లోధీ గార్డెన్ లో చేసే మార్నింగ్ వాక్ కు దూరం కానున్నారు. 1960 మే 14న జన్మించిన జస్టిస్ సంజీవ్ ఖన్నా, ఢిల్లీ యూనివర్శిటీలో లా పూర్తి చేశారు. 2005లో ఢిల్లీ హైకోర్టు అడిషనల్ న్యాయమూర్తిగా నియమితులయ్యారు. తరువాత ఏడాదినే శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2019 జనవరి 18న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి అందుకున్నారు. అలా సుప్రీంకోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా ఎదిగారు. ప్రస్తుత సిజెఐ చంద్రచూడ్, ఇతర సీనియర్ న్యాయమూర్తులతో కలిసి చారిత్రాత్మకమైన తీర్పులు ఇచ్చారు. ఇందులో ఎన్నికల బాండ్లు, ఆర్టికల్ 370 రద్దు, ఇవిఎంల వినియోగం వంటి తీర్పులు వెలువరించారు.

రేపటి నుండి అసెంబ్లీ

(మొదటిపేజీ తరువాయి)

లేదు. వ్యక్తిగత దూషణలు, విమర్శలకే సమావేశాలు పరిమితమవుతున్నాయి. చట్టసభలో ఉంటే అడిగిన ప్రశ్నలు, వాటికి ప్రభుత్వం ఇచ్చిన సమాధానాలు అధికారికంగా రికార్డు అవుతాయన్న సంగతి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తెలియనిదేం కాదు. అయినా, ఆయన తన నివాసం నుండే ప్రశ్నించడానికి మొగ్గుచూపుతున్నారు. దీంతో తాజా సమావేశాలు ఏకపక్షంగా మారనున్నాయి.

ప్రజలకు నష్టం

'అసెంబ్లీలో నాలుగు పార్టీలు మాత్రమే ఉన్నాయి. వాటిల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమిగా ఉంది. వైసిపి ఒక్కటే ప్రశ్నించే స్థానంలో ఉంది. అది కూడా సమావేశాలకు వెళ్లపోతే ప్రశ్నకు తావుండదు. అధికారపార్టీకి అడిగేవారు లేకపోతే ఆనందంగానే ఉంటుంది. వారికి తోచిన విధంగా సమావేశాలు జరుపుకుని వెళ్లిపోతారు. ఏమైనా కమ్యూనిస్టులు చట్టసభలో లేకపోవడం వల్ల జరుగుతున్న నష్టం ఏమిటో ఇప్పటికైనా అర్థం చేసుకోవాల్సి ఉంది.'

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

పదవులెందుకు?

'చట్టసభలకు ఎన్నికైన వారు అసెంబ్లీకి వెళ్లి సమస్యలను ప్రస్తావించాలి. అలా వెళ్లనప్పుడు వారికి పదవులెందుకు. వాటికి రాజీనామా చేయాలి. అసెంబ్లీని గౌరవించని వ్యక్తులు సభ్యులుగా ఉండటం ప్రజాస్వామ్యంలో మంచిది కాదు. సభకు వెళ్లనిపక్షంలో వైసిపి సభ్యులు రాజీనామాలు చేయాలి'

ఎపిసిసి అధ్యక్షులు వై.ఎస్.షర్మిల

ముఖం చాటేస్తున్నారు

'వైసిపి అవినీతిని ప్రశ్నిస్తారనే సమాధానం చెప్పుకోలేని స్థితిలో జగన్‌మోహన్‌రెడ్డి ముఖం చాటేస్తున్నారు. గెలిచినప్పుడు ప్రతిపక్ష హోదా ఉన్నప్పుడు అసెంబ్లీకి వెళ్లి సమస్యలపై పోరాడాలి.'

బిజెపి అధికార ప్రతినిధి పాతూరి నాగభూషణం

సభకు వెళ్లి మాట్లాడాలి

జగన్‌మోహన్‌రెడ్డి గత ప్రభుత్వంలో అనేక అవినీతి అక్రమాలకు పాల్పడ్డారు. ఇప్పుడు నీతి వాక్యాలు మాట్లాడటం సరికాదు. ప్రజలు ఎన్నుకున్న చట్టసభ ప్రతినిధిగా అతను సభకు వెళ్లాలి. తన అభిప్రాయం చెప్పాలి. సభను గౌరవించే లక్షణం లేనప్పుడు సభ్యుడుగా ఉండటం కూడా మంచిది కాదు. అలాగే ప్రస్తుత ప్రభుత్వం కూడా ప్రజానుకూలంగా ఏమీ ఉండటం లేదు. కనుక సభ్యులు అందరూ హాజరై సభ గౌరవాన్ని కాపాడాల్సిన అవసరం ఉంది.

మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

సామంతరాజులు కాదు

చట్ట సభలకు హాజరై ప్రజల సమస్యలపై చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే ప్రజా ప్రతినిధుల పని. శాసనసభకు హాజరు కాబోమని చెప్పడానికి వీళ్ల సామంతరాజులు కాదు. రాజ్యాంగంలో వీరికి ప్రత్యేకంగా డ్యూటీలు ఏమీ కేటాయించలేదు. సభలకు వెళ్లడం మాని మీడియాకు వాదనలు వినిపిస్తామనడం సరైంది కాదు. రాష్ట్రంలో అనేక సమస్యలు ఉన్నాయి...విభజన హామీలు అమలు చేయలేదు. రాజధాని అమరావతికి నిధులు లేవు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి వీటిపై సభలో చర్చించాల్సిన అవసరం ఉంది.

ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులు చలసాని శ్రీనివాసరావు

నోట్ల రద్దుకు ఎనిమిదేళ్లు

- ఇంకా వెంటాడుతున్న చేదు అనుభవాలు
- ఆర్థిక వ్యవస్థపై పెను ప్రభావం
- వ్యవసాయ, పారిశ్రామిక రంగాలపై కోలుకోలేని దెబ్బ
- ఉపాధి కోల్పోయి రోడ్డునపడ్డ కార్మికులు



న్యూఢిల్లీ : 2016 నవంబర్ 8వ తేదీ గుర్తుందా? ఆ రోజే ప్రధాని నరేంద్ర మోడీ పెద్ద నోట్ల రద్దును ప్రకటించారు. ఇది జరిగి ఎనిమిది సంవత్సరాలు గడిచినప్పటికీ ఆ చేదు అనుభవాలు ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. పెద్ద నోట్ల రద్దు పేరుతో రూ.500, రూ.1000 నోట్లను రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వం అంతకంటే పెద్దది అయిన రూ.2000 నోటును ప్రవేశపెట్టింది. ఇది మొదటి నుండీ విఫల ప్రాజెక్టేనని నిపుణులు తేల్చారు. పెద్ద నోట్ల రద్దుపై అధికార పార్టీలో కానీ, చివరికి క్యాబినెట్‌లో కానీ చర్చించలేదు. ఈ ప్రణాళికలో తప్పిదాలు ఉన్నాయని రిజర్వ్‌బ్యాంక్ డైరెక్టర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినా ఎవరూ పట్టించుకోలేదు. పెద్ద నోట్ల రద్దును, దాని పరిణామాలను ఇంకా ప్రజలు మరచిపోలేదు. అవి ఇప్పటికీ వారికి చేదు జ్ఞాపకాలే. పెద్ద నోట్లను జమ చేసేందుకు లేదా మార్చుకునేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో బ్యాంకుల వద్ద బారులు తీరారు. దేశంలో ఆర్థిక కార్యకలాపాలు దాదాపుగా నిలిచిపోయాయి. టోకెన్ల వంటి పురాతన కరెన్సీలను ప్రవేశపెట్టారు. కొత్త కరెన్సీ నోట్ల జారీలో అవినీతి చోటుచేసుకుంది. తగిన సన్నాహక చర్యలు తీసుకోకుండానే ప్రభుత్వం హడావిడిగా చేపట్టిన చర్య సమస్యలను సృష్టించింది. దీంతో ధ్వంసం చేసేందుకు సిద్ధంగా ఉన్న పాడైపోయిన కరెన్సీ నోట్లను ఆర్‌బిఐ తిరిగి చెలామణిలోకి తేవాల్సి వచ్చిన పరిస్థితి వచ్చింది.

ఆర్థికవేత్తలు ఏమన్నారు?

పెద్ద నోట్ల రద్దు కారణంగా అనేక మంది ఉద్యోగాలు పోగొట్టుకున్నారు. ఆర్థిక వృద్ధి కుంటుపడింది. ప్రారంభంలోనే రఘురామ్ రాజన్, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, అమర్త్యసేన్ వంటి ఆర్థికవేత్తలు ఈ నోట్ల రద్దును గట్టిగా వ్యతిరేకించారు. వివిధ కోణాలలో దానిని విమర్శించారు. పెద్ద నోట్ల రద్దు వాంఛనీయం కాదని వారందరూ స్పష్టం చేశారు. మన్మోహన్ సింగ్ ఈ చర్యను 'వ్యవస్థీకృత, చట్టబద్ధమైన దోపిడీ' అని అభివర్ణించారు. అమర్త్యసేన్ 'నిరంకుశ చర్య' అన్నారు.

బ్యాంకింగ్ వ్యవస్థపై ఒత్తిడి

పెద్ద నోట్ల రద్దు కారణంగా అనధికారిక రంగం బాగా దెబ్బతిన్నది. చిన్న, మధ్య తరహా సంస్థలన్నీ ఆర్థికంగా నష్టపోయాయి. జిడిపి వృద్ధి మందగించింది. ఉపాధి కల్పన జరగలేదు. డిమాండ్ లేకపోవడంతో ఉత్పత్తి కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఏదేమైనా పెద్ద నోట్ల రద్దు లక్ష్యం నెరవేరలేదు.

రద్దయిన నోట్లలో చాలా వరకూ తిరిగి వచ్చాయని ఆర్‌బిఐ చెబుతున్నప్పటికీ నల్లధనం మాత్రం బయటికి రాలేదు. పెద్ద నోట్ల రద్దు ప్రక్రియ బ్యాంకింగ్ వ్యవస్థపై కూడా తీవ్రమైన ఒత్తిడి తెచ్చింది. ప్రజలు తమ వద్ద ఉన్న నోట్లను బ్యాంకులలో డిపాజిట్ చేసేందుకు లేదా మార్చుకునేందుకు ప్రభుత్వం ఇచ్చిన వ్యవధి తక్కువగా ఉండడంతో బ్యాంకులు కూడా ఏమీ చేయలేక చేతులెత్తేసిన పరిస్థితి. సుమారు రెండు నెలల పాటు ఏ బ్యాంక్ వద్ద చూసిన బారులు తీరిన జనమే కన్పించారు.

డిజిటల్ లావాదేవీలు జరిగినా...

పెద్ద నోట్లు రద్దు చేయాలన్న ఆకస్మిక నిర్ణయం ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపింది. ఆర్థిక వృద్ధి రేటు నాలుగు సంవత్సరాల కనిష్ట స్థాయి 6.7 శాతానికి చేరింది. పారిశ్రామిక కార్యకలాపాలకు కూడా తీవ్ర అంతరాయం ఏర్పడింది. పెద్ద నోట్ల రద్దుతో నగదు లావాదేవీలు గణనీయంగా తగ్గిపోయాయని ఆర్‌బిఐ చెప్పుకుంది. కానీ ఇది కూడా అర్ధసత్యమే. పెద్ద నోట్ల రద్దు జరిగిన వెంటనే వినియోగ వస్తువుల అమ్మకాలు ఒక్కసారిగా 40 శాతం మేర పడిపోయాయి. గృహోపకరణాల మార్కెట్‌లో 80 శాతం వరకూ నగదు లావాదేవీలే జరిగాయి.

డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు ప్రకటించిన పథకాలు, ప్రత్యేక రాయితీలు, ప్రమోషన్లు వంటి చర్యలు పెద్ద నోట్ల రద్దు ప్రభావాన్ని తగ్గించలేకపోయాయి. రుతుపవనాలు ఆశాజనకంగా ఉండడం, ఉద్యోగులకు 7వ వేతన సంఘం సిఫార్సులు అమలు చేయడం వంటి చర్యల కారణంగా గృహోపకరణాల మార్కెట్ 30 శాతం వృద్ధి నమోదు చేసుకుంటుందని అందరూ అనుకున్నా అలా జరగలేదు.

అరకొర నగదుతో అవస్థలు

పెద్ద నోట్ల రద్దు కారణంగా దాదాపు అన్ని రంగాలపై ప్రతికూల ప్రభావం పడింది. ముఖ్యంగా భారీ స్థాయిలో నగలు లావాదేవీలపై ఆధారపడిన సంఘటిత, అసంఘటిత రంగాలు కోలుకోలేని దెబ్బ తిన్నాయి. నగదు కొరత అటు వినియోగదారులను, ఇటు వ్యాపారులను వేధించింది. నోట్ల రద్దు జరిగిన తర్వాత మొదటి నాలుగు నెలలలో చిన్న చిన్న వ్యాపారుల వ్యాపారాలు 50 శాతం వరకూ పడిపోయాయి. నగదు చెలామణి సాధారణ స్థితికి చేరడానికి, వ్యాపారాలు మామూలుగా జరగడానికి ఆరు నెలలు పట్టింది.

నగదు లభ్యత తగ్గడం వ్యవసాయ రంగంపై కూడా ప్రభావం చూపింది. ఎందుకంటే వ్యవసాయ ఉత్పత్తి ప్రక్రియలో కీలక పాత్ర పోషించేది నగదే. అనూహ్యంగా ఏర్పడిన నగదు కొరత ఆ రంగంపై అనేక విధాలుగా ప్రభావం చూపింది. వ్యవసాయ ఆదాయాలు పడిపోవడంతో ఉపాధి అవకాశాలు క్షీణించాయి.

ఢిల్లీలో కాల్పుల కలకలం

- ఒకరి మృతి, మరొకరికి గాయాలు

న్యూఢిల్లీ : 10 నిమిషాల వ్యవధిలోనే ఈశాన్య ఢిల్లీలో రెండు వేరువేరు ప్రాంతాల్లో కాల్పుల ఘటనలు జరగడం ఆందోళన కలిగించింది. ముగ్గురు వ్యక్తులు ఈ కాల్పులకు తెగించారు. ఈ కాల్పుల్లో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. శనివారం తెల్లవారు జామున 1 గంటల ప్రాంతంలో ముందుగా కబీర్ నగర్ ప్రాంతంలో స్కూటర్‌పై వెళుతున్న నదీమ్ అలియాస్ బాబీ అనే వ్యక్తిపై నిందితులు కాల్పులు జరిపారు. ఈ కాల్పులతో నదీమ్‌తో పాటు సమీపంలో ఉన్న షానవాజ్ అనే వ్యక్తికి కూడా గాయాలయ్యాయి. తరువాత నిందితులు నదీప్ స్కూటర్ మీదనే అక్కడ నుంచి పరారయ్యారు. 10 నిమిషాల వ్యవధిలోనే పక్కనే ఉన్న జ్యోతినగర్‌లోని ఒక ప్రదేశానికి వెళ్లి రాహుల్ అనే వ్యక్తి ఇంటిపై కాల్పులు జరిపారు. అయితే ఈ రెండో ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. కాగా కాల్పుల జరిగిన సమాచారం తెలుసుకున్న కబీర్ నగర్ చేరుకుని గాయాలతో ఉన్న నదీమ్, షానవాజ్‌ను ఆసుపత్రికి తరలించారు. నదీమ్ మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. షానవాజ్‌కు చికిత్స అందిస్తున్నారు.

డైరెక్ట్ వీసా పథకాన్ని రద్దు చేసిన కెనడా

- భారత విద్యార్థులకు పెద్ద ఎదురు దెబ్బ

టొరంటో : స్టూడెంట్ డైరెక్ట్ స్ట్రీమ్ (ఎస్‌డిఎస్)వీసా పథకాన్ని నిలిపేస్తున్నట్లు కెనడా ప్రభుత్వం గురువారం ప్రకటించింది. ఇది కెనడా వెళ్లాలనుకునే భారతీయ విద్యార్థులకు పెద్ద ఎదురుదెబ్బ. బయటి దేశాల విద్యార్థులకు నేరుగా వీసా మంజూరు చేసేందుకు ఉద్దేశించిన ఈ స్కీమును రద్దు చేయడంతో ఇక నుంచి కెనడా వెళ్లాలనుకునేవారికి వీసా దొరకడం దుర్లభమవుతుంది. భారత్‌తో సహా 13 దేశాల విద్యార్థులపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుంది. భవిష్యత్‌లో దరఖాస్తు చేసుకోబోయే విద్యార్థులు రెగ్యులర్ స్టడీ పర్మిట్ దరఖాస్తు ప్రక్రియను అనుసరించాల్సి వుంటుంది. ఎస్‌డిఎస్‌ను 2018లో ప్రవేశపెట్టారు. భారత్, చైనా, పాకిస్తాన్, ఫిలిప్పీన్స్, వియత్నాం, ఇతర అర్హత గల దేశాలకు చెందిన విద్యార్థులు కెనడాలో చదువుకోవడానికి ఎక్కువ ప్రయాసపడకుండా అవకాశాలను ఈ పథకం కల్పించేది ఏటా వేలాదిమంది విద్యార్థులు ఈ పథకం వల్ల లబ్ధి పొందేవారు. ముఖ్యంగా భారత్ విద్యార్థులకు బాగా ఉపకరించేది. కెనడాలో చదువుకునే వారిలో భారత విద్యార్థుల సంఖ్య అత్యధికంగా వుంటుంది. కాగా ఈ నిర్ణయాన్ని కెనడా ప్రభుత్వం సమర్ధించుకుంది. ఎస్‌డిఎస్‌ను తొలగించడం వల్ల విద్యార్థులందరికీ సమాన అవకాశాలకు కల్పించినట్లవుతుందని పేర్కొంది. ఈ మేరకు కెనడా ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ప్రకటన పేర్కొంది. నవంబరు 8 మధ్యాహ్నం 2గంటల వరకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈ పథకం నిబంధనలు వర్తిస్తాయి. ఇక ఆ తర్వాత దరఖాస్తు చేసుకునేవారు రెగ్యులర్ పథకం కిందకే వస్తారని పేర్కొంది.

సామ్రాజ్యవాదంపై ధిక్కారానికి చిహ్నం క్యూబా

- జెఎన్‌యులో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన సంఘీభావ సదస్సు



జెఎన్‌యులో క్యూబా సంఘీభావ సదస్సు

న్యూఢిల్లీ : దేశ రాజధానిలోని ప్రతిష్టాత్మమైన జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ (జెఎన్‌యు)లో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) అక్టోబర్ విప్లవ వార్షికోత్సవ రోజున క్యూబా సంఘీభావ సదస్సు నిర్వహించింది. పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. క్యూబన్ నేషనల్ అసెంబ్లీ సభ్యుడు, క్యూబన్ ఫైవ్‌లో ఒకరైన ఫెర్నాండో గోంజాలెజ్, భారత్‌లో క్యూబన్ ఎంబసీ చార్జ్ డీ అఫైర్స్ అబెల్ డెస్పాగిన్, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు, క్యూబా సంఘీభావ కమిటీ కన్వీనర్ ఎం.ఎ.బేబీ ప్రభృతులు పాల్గొని ప్రసంగించారు.

1960ల నుండి అమెరికా ఆర్థిక ఆంక్షల ఊబిలో చిక్కుకున్న క్యూబా ఎలా నలిగిపోతోందో వక్తలు వివరించారు. మొత్తంగా క్యూబా ఆర్థిక వ్యవస్థను, ప్రజల జీవన శైలిని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని, ప్రజల ఇబ్బందులు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్నాయని విమర్శించారు. అమెరికా సామ్రాజ్యవాద దురహంకారాన్ని తీవ్రంగా ఎదుర్కొనడం ద్వారా క్యూబా ప్రతిఘటనకు ఒక చిహ్నంగా మారిందని బేబీ పేర్కొన్నారు. క్యూబన్లపై అమెరికా ఆంక్షలు ఆర్థిక యుద్ధం తప్ప మరొకటి కాదని అన్నారు. అంతర్జాతీయ చట్టాలను ఏ మాత్రం గౌరవించకుండా అమెరికా వ్యవహరిస్తోందన్నారు. 1992 నుండి అత్యధిక మెజారిటీతో యుఎన్ జనరల్‌అసెంబ్లీ తీర్మానాలు ఆమోదించినా వాటిని పెడచెవిన పెడుతూ వస్తోందని విమర్శించారు. తీవ్రవాద దేశాల జాబితాలో క్యూబాను చేర్చడాన్ని ఆయన తీవ్రంగా నిరసించారు. ఇంతటి ప్రతికూల పరిస్థితుల్లోనూ క్యూబన్ల మొక్కవోని దీక్ష, ధృఢత్వాలను ప్రశంసించారు. అగ్ర రాజ్య సామ్రాజ్యవాదం ఉపయోగిస్తున్న అధునాతన ఆయుధాలు, ఆంక్షలన్నీ కూడా క్యూబన్ల నిబద్ధత, మనో ధైర్యం ముందు ఓడిపోయాయని అన్నారు.

15సంవత్సరాలు అమెరికా జైళ్లలో మగ్గిపోయిన క్యూబన్ ఫైవ్‌లో ఒకరైన ఫెర్నాండో గోంజాలెజ్ మాట్లాడుతూ, 1959లో క్యూబన్లు సాధించిన విప్లవంతో అమెరికాకు కంటి మీద కునుకు లేకుండా పోయిందన్నారు. యుద్ధం, తీవ్రవాదం వంటి మార్గాల ద్వారా క్యూబా విప్లవాన్ని నాశనం చేయడానికి ప్రయత్నించిందని, కానీ ఓడిపోయిందని అన్నారు. క్యూబా ఆర్థిక వ్యవస్థను నాశనం చేసి, ప్రజలను ఆకలిదప్పులతో, నిరాశా నిస్పృహలతో చంపేయాలని అమెరికా ప్రయత్నిస్తోందని, కానీ ఆరు దశాబ్దాలుగా ఆ కుయుక్తులను క్యూబన్లు తిప్పికొడుతున్నారని చెప్పారు. లాభాలు ఆర్జించే వ్యక్తులతో కాకుండా మానవత్వంతో కూడిన సమాజాన్ని క్యూబా విప్లవం నిర్మించిందని, అందువల్ల సామ్రాజ్యవాదుల నేరపూరితమైన ఆలోచనలేవీ అమలు కాబోవని గోంజాలెజ్ స్పష్టం చేశారు.

ఇజ్రాయిల్ ఊచకోతలో పిల్లలే సమిధలు

- ఐరాస మానవ హక్కుల సంస్థ వెల్లడి

న్యూయార్క్: అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ గత పదమూడు మాసాలుగా గాజాలో సాగిస్తున్న ఊచకోతకు బలైనవారిలో పిల్లలే అత్యధికంగా ఉన్నారని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల సంస్థ తాజాగా వెల్లడించింది. గాజా మంత్రిత్వ శాఖ ధ్రువీకరించిన మరణాలే ఇప్పటివరకు 43, 552కి చేరాయి. ఇవి కాకుండా శిథిలాల కింద సమాధి అయిన వారు మరో 10 వేల మంది దాకా ఉంటారు. ఈ సంవత్సరం ప్రారంభంలో సుప్రసిద్ధ సైన్స్ మ్యాగజైన్ లాన్సెట్ గాజాలో మృతుల సంఖ్య 1,86వేల పైమాటేనని అంచనా వేసింది. అమెరికా పంపిన టన్నుల కొద్దీ బాంబులను ప్రయోగించి ఇజ్రాయిల్ ఈ సామూహిక హత్యాకాండకు పాల్పడిందని ఆ వినేదిక వెల్లడించింది. గాజాలోని 60శాతానికి పైగా పౌర ఆవాసాలను కూల్చివేయడానికి ఈ బాంబులనే ఉపయోగించింది. ఇజ్రాయిల్ చర్య యుద్ధ నేరం కిందికే వస్తుందని మానవ హక్కుల కమిషన్ పేర్కొంది. ఇదివరకు ఇజ్రాయిల్ చేసిన దురాక్రమణ పూరిత దాడులకు, ప్రస్తుత దాడులకు తేడా ఏమిటంటే పిల్లలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం. ఆస్పత్రులపైన, శరణార్థి శిబిరాలపైన ఇజ్రాయిల్ దాడులు చేయడం. ఇది అంతర్జాతీయ చట్టాలను బాహాటంగా అతిక్రమించడమేనని పేర్కొంది. శుక్రవారం వెలువడిన మరో నివేదికలో గాజా స్ట్రిప్ మొత్తం భయంకరమైన కరువు కోరల్లో చిక్కుకుంది. గత నెలలో నెతన్యాహు ప్రభుత్వం జనరల్స్ ప్లాన్ పేరుతో తీసుకొచ్చిన విధానం గాజాలో జాతి నిర్మూలన పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. అమెరికాలో ఫాసిస్టు డొనాల్డ్ ట్రంప్ విజయం తరువాత ఆయన అండ చూసుకుని నెతన్యాహు మరింతగా పేట్రేగిపోతున్నాడు.

గాజా దాడుల్లో 26మంది మృతి
లెబనాన్‌లో కొనసాగుతున్న దాడులు

ఇజ్రాయిల్ ఆర్మీ కొనసాగిస్తున్న దాడుల్లో గాజాలో శనివారం 26మంది మరణించారు. వీరిలో మహిళలు, పిల్లలు వున్నారు. కాగా గత ఐదు వారాల నుండి ఉత్తర గాజాను పూర్తిగా దిగ్బంధించి, దాడులు కొనసాగిస్తున్న తరుణంలో తొలి సాయం ఆ ప్రాంతానికి చేరింది. గాజాలోని తూర్పు తుఫా ప్రాంతంలో ప్రజలకు ఆవాసంగా మారిన స్కూలుపై జరిగిన దాడిలో ఆరుగురు మరణించారని గాజా ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. మృతి చెందిన వారిలో ఇద్దరు స్థానిక జర్నలిస్టులు, గర్భవతి అయిన మహిళ, బిడ్డ వున్నారు. కాగా పాలస్తీనా ఇస్లామిక్ జిహాద్ మిలిటెంట్ గ్రూపు లక్ష్యంగా తాము దాడులు జరిపామని ఆర్మీ ప్రకటించింది. అంతకుమించి వివరాలు వెల్లడించలేదు. ఖాన్ యూనిస్ నగరంలోని శిబిరంపై జరిగిన మరో దాడిలో ఏడుగురు మరణించారు. ఆ శిబిరంలో నిర్వాసితులు తలదాచుకున్నారు. చనిపోయిన వారిలో ఇద్దరు మహిళలు, ఒక పిల్లవాడు వున్నారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. సురక్షిత ప్రాంతంగా ప్రకటించిన అల్ మావసి ప్రాంతంపై జరిగిన దాడిలో 9మంది మరణించగా, అనేకమంది గాయపడ్డారు. రోజుల వ్యవధిలోనే సరైన చర్యలు తీసుకోకపోతే పరిస్థితులు దారుణంగా తయారవుతాయని కరువు పరిస్థితులపై స్వతంత్ర సమీక్షా కమిటీ హెచ్చరించింది. ఇప్పటివరకు గాజా దాడుల్లో మరణించిన వారి సంఖ్య 43,552కి చేరగా, గాయపడిన వారి సంఖ్య 1,02,765కి పెరిగింది. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని అకాబా పట్టణంలో భవనాలకు సైనిక బలగాలు నిప్పంటించాయి. ఈ ఘటనలో ఒకరు మరణించారు. బీరుట్ నగరంపై 12కిపైగా దాడులు జరిగాయి.. ఈ దాడులతో పెద్ద పెద్ద భవంతులు కూడా నేలమట్టమై పోయాయి. ప్రాణాలు కాపాడుకోవాలంటే ఈ ప్రాంతాలను వదిలి పారిపోండి అంటూ ఆర్మీ ఆదేశాలు జారీ చేసిన కాసేపటికే దాడులు చోటు చేసుకున్నాయి. బీరుట్‌లోని లెబనాన్ యూనివర్శిటీ చుట్టుపక్కల తీవ్ర స్థాయిలో విధ్వంసం చోటు చేసుకుంది. లెబనాన్‌లో తీర ప్రాంత నగరమైన టైర్ నగరంలో తాజా దాడుల్లో ఏడుగురు మరణించారు. 46మంది గాయపడ్డారు.

కప్పట్రాళ్లలో తవ్వుతున్నాం

(మొదటిపేజీ తరువాయి)

తవ్వకాలు నిర్వహిస్తున్న ప్రాంతాల జాబితాను కేంద్రం జతపరిచింది.

4.10 లక్షల టన్నుల సామర్థ్యం

సెప్టెంబర్ 2023 నాటికి 4,10,122 టన్నుల యురేనియం నిల్వలను ఎఎండి కనుగొందని మంత్రి వివరించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, జార్ఖండ్,మేఘాలయ, రాజస్థాన్, కర్నాటక, ఛత్తీస్‌గడ్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్రల్లోని 47 ప్రాంతాల్లో ఈ నిక్షేపాలను కనుగున్నట్లు తెలిపారు. వీటిలో తవ్వకాలకు ఆటమిక్ ఎనర్జీ కమిషన్ సూత్రబద్ధ అనుమతి ఇచ్చిందని, యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యుసిఐఎల్) రాజ్యాంగ బద్ధంగా చేయవలసిన ఇతర కార్యక్రమాలను చేపట్టిందని తెలిపింది. ఈ పనులు వివిధ ప్రాంతాల్లో వివిధ దశల్లో ఉన్నాయని కేంద్ర మంత్రి రాతపూర్వకంగా తెలిపారు.

నామినేటెడ్ పదవుల జాబితా

వ్యక్తి పేరు	కార్పొరేషన్ పేరు	
కూడిపూడి సత్తిబాబు	శెట్టి బలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్	
మాల సురేంద్ర	గవర వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్	
రోనంకి కృష్ణంనాయుడు	కళింగ వెల్ఫేర్ అండ్, డెవలప్‌మెంట్	
దేవేంద్రప్ప	కురుమ వెల్ఫేర్, డెవలప్‌మెంట్	
ఆర్ సదాశివ	నాయిబ్రాహ్మణ వెల్ఫేర్ డెవలప్‌మెంట్	
సావిత్రి	రజక వెల్ఫేర్ డెవలప్‌మెంట్	
పాలవలస యశస్వి	తూర్పు కాపు	
కపట్రాల సుశీలమ్మ	వాల్మీకి, బోయ	
సిఆర్ రాజన్	వన్యకుల క్షత్రియ కోపరేటివ్ ఫైనాన్స్	
నరసింహ యాదవ్	యాదవ వెల్ఫేర్ డెవలప్‌మెంట్	
చిలకలపూడి పాపారావు	అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ డెవలప్‌మెంట్	
వీరంకి వెంకట గురుమూర్తి	గౌడ వెల్ఫేర్ డెవలప్‌మెంట్	
గండి బాబ్జి	ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ కోపరేటివ్ ఫెడరేషన్	
మంజులా రెడ్డి	ఎపి శిల్పారామం ఆర్ట్స్, క్రాఫ్ట్స్ అండ్ కల్చరల్ సొసైటీ	
నీలాయపాలెం విజయకుమార్	బయోడైవర్సిటీ బోర్డు	
జీవి రెడ్డి	ఫైబర్ నెట్ లిమిటెడ్	
మన్నవ మోహన్ కృష్ణ	టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్	
తేజస్వి పొడవాటి	కల్చరల్ కమిషన్	
పోలంరెడ్డి దినేష్ రెడ్డి	పర్యావరణ నిర్వహణ	
సుజయ్ కృష్ణ రంగారావు	అటవీ అభివృద్ధి కార్పొరేషన్	
గోనుగుంట్ల కోటేశ్వరరావు	గ్రంథాలయ పరిషత్	
డేగల ప్రభాకర్	ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్	
కెకె చౌదరి	ఖాదీ అండ్ ఇండస్ట్రీస్ బోర్డు	
చిల్లపల్లి శ్రీనివాసరావు	వైద్య సేవా సదుపాయాల సంస్థ అభివృద్ధి	
ప్రగడ నాగేశ్వరరావు	రహదారుల అభివృద్ధి	
మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి	వ్యవసాయ మిషన్	
ఆనం వెంకట రమణారెడ్డి	ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ ఆధారిటీ	
గొట్టిముక్కల రఘురామరాజు	బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వైజరీ	
సావల దేవదత్	ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ ఆధారిటీ	
రావి వెంకటేశ్వరరావు	వేర్ హౌసింగ్	
కావాలి గ్రీష్మ	మహిళ కోపరేటివ్ ఫైనాన్స్	
దోన్నుదొర	ఎపిఎస్ఆర్టీసి	విజయనగరం జోన్
రెడ్డి అప్పల నాయుడు	ఎపిఎస్ఆర్టీసి	విజయవాడ జోన్
సురేష్ రెడ్డి	ఎపిఎస్ఆర్టీసి	నెల్లూరు జోన్
పోలా నాగరాజు	ఎపిఎస్ ఆర్టీసి	కడప జోన్
సజ్జా హేమలతా	హ్యాండ్‌లూమ్ కోపరేటివ్ సొసైటీ	
గుమ్మడి గోపాలకృష్ణ	నాటక అకాడమీ	
సీతారామ సుధాకర్	ఎన్టీఆర్ వైద్య సేవ	
కొమ్మారెడ్డి పట్టాభిరామ్	స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ మిషన్	
స్వామినాయుడు ఆలాడ	అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ ఆధారిటీ	
టిసి వరుణ్	అనంతపూర్-హిందూపూర్ అర్బన్ డెవలప్‌మెంట్ ఆధారిటీ	
రూపానంద రెడ్డి	అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ ఆధారిటీ	
సలగల రాజశేఖర్ బాబు	బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ ఆధారిటీ	
తెంటు లక్ష్మీ నాయుడు	తెంటు లక్ష్మీనాయుడు	
కే హేమలత	చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ ఆధారిటీ	
తుమ్మల రామస్వామి	కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్	
సోమిశెట్టి వెంకటేశ్వర్లు	కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ ఆధారిటీ	
మట్టా ప్రసాద్	మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ ఆధారిటీ	
కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి	నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ ఆధారిటీ	
బొడ్డు వెంకటరమణ చౌదరి	రాజమండ్రి అర్బన్ డెవలప్‌మెంట్ ఆధారిటీ	
కోరికన రవికుమార్	శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ ఆధారిటీ	
ప్రణవ్ గోపాల్	విశాఖపట్నం మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ ఆధారిటీ	
ముస్తాక్ అహ్మద్	మైనార్టీస్ ఫైనాన్స్	
డూండీ రాకేష్	ఆర్యవైశ్య వెల్ఫేర్	
వి సూర్యనారాయణ	క్షత్రియ వెల్ఫేర్	
కొత్తపల్లి సుబ్బారాయుడు	కాపు వెల్ఫేర్	
ఉండవల్లి శ్రీదేవి	మాదిగ వెల్ఫేర్	
పెదపూడి విజయ్‌కుమార్	మాల వెల్ఫేర్	
కిడారి శ్రావణ్	గిరిజన కోపరేటివ్	

కేరళలో ప్రపంచ ఐటీ సదస్సు

- గార్ట్‌నర్స్ గ్లోబల్ ఐటి కాన్ఫరెన్స్ వేదికగా కొచ్చి

కొచ్చి : ప్రపంచ ఐటీ సదస్సుకు కేరళ సిద్ధం అయింది. అమెరికాలోని ప్రపంచ ప్రఖ్యాత సాంకేతిక, పరిశోధన, కన్సల్టింగ్ సంస్థ గార్ట్‌నర్ నిర్వహించే ఈ ఏడాది ప్రపంచ ఐటీ సదస్సు, ప్రదర్శనకు కొచ్చి వేదిక కానుంది. నవంబర్ 11 నుంచి 13 వరకు కొచ్చి గ్రాండ్ హయత్‌లో ఈ కార్యక్రమం జరగనుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. సాంకేతికతలో తాజా పరిణామాలను చర్చించడానికి ఈ రంగంలోని ప్రఖ్యాత నిపుణులచే అనేక సెషన్‌లు నిర్వహించనున్నారు. ఈ సదస్సు సందర్భంగా పరిశ్రమల శాఖ మంత్రి పి.రాజీవ్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అరుదైన నగరాల్లో మాత్రమే గార్ట్‌నర్ సదస్సులు నిర్వహిస్తారని, ఆ అవకాశం భారతదేశంలో కొచ్చికి రావడంతో ప్రతి మలయాళీ గర్వపడతారని అన్నారు.

తెలంగాణలో కుల గణన మొదలైంది

- మోడీ జీ దేశ వ్యాప్తంగా కులగణను మీరిక ఆపలేరు
- పార్లమెంట్ లో కుల గణన ఆమోదించి... 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని తొలగిస్తాం
- 'ఎక్స్' వేదికగా బిజెపికి నేతలకు రాహుల్ గాంధీ కౌంటర్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని రేవంత్ రెడ్డి సర్కార్ కుల గణనను ప్రారంభించిందని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఈ సమగ్ర డేటాను ఉపయోగించి రాష్ట్రంలోని అన్ని వర్గాల అభివృద్ధికి సంబంధించిన విధానాలను రూపొందిస్తామని వెల్లడించారు. త్వరలో మహారాష్ట్రలో కూడా ఇదే జరగనుందన్నారు. ఇకపై దేశ వ్యాప్తంగా జరగబోయే కులగణనను మోడీ జీ ఆపలేరన్నారు. ఈ మేరకు శనివారం సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా ప్రధాని మోడి, బిజెపిపై రాహుల్ గాంధీ కౌంటర్ ఇచ్చారు. దేశ వ్యాప్తంగా సమగ్ర కుల గణన చేపట్టడం బిజెపికి ఇష్టం లేదన్న సంగతి ఇప్పటికే ప్రజలందరికీ తెలిసిందని చెప్పారు. 'నేను మోడీ జీకి స్పష్టంగా చెప్పాలనుకుంటున్నా. దేశవ్యాప్తంగా కుల గణనను మీరు ఆపలేరు. త్వరలో పార్లమెంట్‌లోనే కుల గణనను ఆమోదించి... రిజర్వేషన్ల పై ఉన్న 50 శాతం పరిధిని బద్దలు కొడతాం' అని ట్వీట్ చేశారు. తెలంగాణ సర్కార్ చేపట్టిన కులగణన సర్వే పై కాంగ్రెస్ విడుదల చేసిన హింది సాంగ్ తో కూడిన వీడియోను ఈ ట్వీట్ కు అటాచ్ చేశారు. ఇందులో తెలంగాణ గవర్నర్ బిష్ణు శర్మ డేటాను సేకరిస్తోన్న అధికారులతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా కుల గణన సర్వే జరుగుతోన్న తీరు చూడవచ్చు.

మణిపూర్‌లో మరో మహిళ హత్య

ఇంఫాల్ : మణిపూర్‌లో మూడు రోజుల వ్యవధిలోనే మరొక మహిళను గుర్తుతెలియని వ్యక్తులు కాల్చి చంపారు. ఇంఫాల్ వ్యాలీలోని బిష్ణుపూర్ జిల్లాలో సైటన్ గ్రామంలో వరి పొలంలో ఇతరులతో కలిసి పనిచేస్తుండగా ఒక మహిళను కాల్చిచంపారు. సమారు 100 మీటర్ల దూరంలో ఉన్న కొండ మీద నుంచి జరిగిన కాల్పుల కారణంగా మహిళ మృతి చెందిందని స్థానికులు చెప్పారు. శనివారం ఉదయం 11 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. ఈ సమయంలో సంఘటనాస్థలానికి సమీపంలో ఉన్న బిఎస్ఎఫ్ సిబ్బంది ఎదురు కాల్పులు జరిపారు. సుమారు గంటపాటు ఎదురుకాల్పులు కొనసాగాయి. 'ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించాం. హింసాకాండను నివారించడానికి ఈ ప్రాంతంలో భద్రత పెంచాం' అని జిల్లా పోలీసు అధికారి తెలిపారు. ఈ నెల 7న జిరిబామ్ జిల్లాలో ఒక గిరిజన మహిళను సాయిధులు కాల్చిచంపిన సంగతి తెలిసిందే. కాగా, మణిపూర్‌లో గత ఏడాది మే 3 నుంచి జరుగుతున్న హింసాకాండా కారణంగా ఇప్పటి వరకూ 250 మందికి పైగా ప్రాణాలు కొల్పొయారు. 60 వేల మందికి పైగా నిరాశ్రయులయ్యారు. వీరంతా ఇంకా సహాయక శిబిరాల్లోనే తలదాచుకుంటున్నారు.



మీకోసం

శీతాకాలంలో పిల్లల మసాజ్‌కు ఆవనూనె వాడాలి. ఇది ఒంటికి సహజంగా వేడినివ్వడంతోపాటు ర్యాష్ వంటి చర్మ సమస్యలను కూడా దూరం చేస్తుంది. ఆవనూనె సాధ్యం కానప్పుడు వెన్న మీగడలతో కూడా మసాజ్ చేయవచ్చు.

జీవన సౌరభం

వెలిగే దీపమే ఇతర దీపాలను వెలిగించినట్లు నిరంతరం నేర్చుకునే వారే ఇతరులకు జ్ఞానాన్ని పంచగలరు.

రైలు బండి



బండి బండి రైలు బండి
రమ్యమైన రైలు బండి
చూడసక్కనైన బండి
చుక్ చుక్ చుక్ రైలు బండి

పాములాగా పరుగుతీస్తు
పట్టాలెక్కి తిరుగునండి
రంగు రంగు బోగీలతో
రమణీయ రూపమండి

అలుపించక సొలపించక
హాయినిచ్చు పయనమండి
దూరం ఎంతైన గాని
పదిలంగా చేర్చునండి

చెట్లూ చేమలు అడవులు
కొండలు కోనలు నదులు
అలవోకగ దాటుకుంటు
ఆహ్లాదం పంచునండి


భోజన ఫలహారాలు
శీతల పానీయాలు పండ్లు
బిస్కెట్టులు చాక్లెట్టులు
సకలం సమకూర్చునండి

పిల్లల ఆటలు పాటల
పెద్దల మాటల మూటల
ఆటవిడుపు పయనమండి
రైలులోనే సాధ్యమండి

రాత్రైనా పగలైనా
ఎండ వాన చలియైనా
గమ్యానికి చేర్చునండి
అదియే మన రైలు బండి

ప్రకృతి దృశ్యాలనెన్నో
పలకరిస్తూ పరుగులిడుతు
పయనం సాగించునండి
అలరించే శకటమండి

– నాగరాజు కామర్సు,
92480 93580.



లెక్క చేయండి

పిల్లలూ, ఇక్కడ బొమ్మలను అంకెలుగా గణించి లెక్కచేశాం. చివరి లైను జవాబు మీరు రాబట్టండి చూద్దాం.

జవాబు : 19

నేను గీసిన బొమ్మ





డి. రాజేష్,
6వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
రాంపూర్
నిజాంపేట, మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పెట్రోలు బంకుల్లో ఈ సేవలు అందుతున్నాయా?

మనం రోజూవారీ ఉపయోగించే పెట్రో ఉత్పత్తులు నాణ్యమైనవే వినియోగిస్తున్నామా? తప్పడు కొలత, కల్తీలతో మోసపోతున్నామా? ఈ విషయాన్ని ఆయా పెట్రోలు బంకుల్లోనే మనం నిర్ధారించుకోవొచ్చు. గ్యాస్, పెట్రోలు, డీజిల్, ఇతర పెట్రోలియం ఉత్పత్తులను విక్రయించే కొందరు వినియోగదారులను బురిడీ కొట్టిస్తుంటారు. పెట్రోలు వాహనంలో నింపుకునేటప్పుడు ఖచ్చితంగా పంపుపైన డిజిటల్ అంకెల్లో జీరో (సున్నా)ను గమనించిన తర్వాత మాత్రమే సరిచూసుకోవాలి. ఒక వేళ మోసం జరిగితే, ఆధారాలతో కేసు వేసి, జరిగిన నష్టానికి పరిహారం పొందొచ్చు. పెట్రోలు బంకుల్లో ఇంకా అనేక సేవలను మనం పొందవచ్చు.



ప్రతి బంకులోనూ ఐదు లీటర్ల బ్రాసు క్యాను తూనికలు, కొలతలశాఖ ముద్రతో ధృవపత్రంతో వెరిఫికేషన్ సర్టిఫికెట్‌తో ఉంచాలి. వినియోగదారులు కోరుకున్నప్పుడు ఆ ఐదు లీటర్ల బ్రాస్ క్యాన్‌తో కొలతలు సరిచూసుకోవచ్చు. అది వినియోగదారుడికి ఉన్న ప్రాథమ హక్కు. పెట్రోలు బంకులకు వెళ్లినప్పుడు లీటరు ధరపై అనుమానం ఉంటే ఆ బంకు నుంచే అక్కడ ఏర్పాటు చేసిన ఆర్ఎస్‌పి బోర్డుపై ఉన్న సెల్‌నంబరుకు మెసేజ్ పంపిస్తే మీరు ఉన్న బంకులో లీటరు ధర ఎంతో డైరెక్టుగా ఆయిల్ కార్పొరేషన్ నుంచే మీ ఫోన్‌కు వెంటనే మెసేజ్ వస్తుంది. అలాగే ద్విచక్ర వాహనాలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఉచితంగా మిషన్ ద్వారా ఆయిల్ మార్చుతారు. ఆయిల్ కొనుగోలు చేసినప్పుడు బిల్లు పొందొచ్చు. ఆ బిల్లులో తారీఖు, సమయం, ఎంత మొత్తం చెల్లించారు, క్వాలిటీ, డీలర్ ఫోన్ నంబరు, వ్యాట్‌నంబరు అన్నీ వివరాలు ఉండాలి. కొన్ని బంకుల్లో ఎప్పుడూ కంపెనీ వారు ఇచ్చే రివార్డు పాయింట్లు ప్రతి కొనుగోలుపైనా, పండుగలకు కంపెనీ వారు అందించే స్కీములు తదితర వివరాలను తెలుసుకోవచ్చు. బంకుల్లో ఎక్కడైనా వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది కలిగినా తెలియజేయటానికి ఆయా బంకు కంపెనీ సేల్స్ ఆఫీసర్ పేరు, ఫోన్ నంబరు కలిసి స్టిక్కర్లు లేదా బోర్డు ఉండి తీరాలి. దానిపైనున్న నంబరుకు ఫోన్ చేసి కలిగిన అసౌకర్యం గురించి తెలియజేస్తే తక్షణ చర్యలు తీసుకుంటారు.

పెట్రోలు : నాణ్యమైన పెట్రోలును బ్రాండెడ్ ఎక్స్‌పి 95 పెట్రోలుగా కూడా పిలుస్తుంటారు. దీనిని బి6 ఇంజన్లు కలిగిన కొత్తకార్లకు వాడతారు. పెట్రోలు నాణ్యతను తెలుసుకోవాలంటే వాట్‌మెన్ 2 కంపెనీ ఫిల్టరు పేపరుపై ఒక చుక్క పెట్రోలు వేస్తే పెట్రోలు కల్తీ ఉంటే అక్కడ మరక పడుతుంది. కల్తీ లేకపోతే మీరు చుక్క వేయకముందు ఎలా ఉంటుందో అలాగే ఉంటుంది.



డీజిలు : దీని నాణ్యత తెలుసుకోవాలంటే డెన్సిటీ చెక్ చేయాలి. తేడా వస్తే ఫిర్యాదు నమోదు చేయాలి. ప్రతి పెట్రోలు బంకులోనూ డెన్సిటీ రిజిస్టరు (డెన్సిటీ అంటే సాంద్రతను తప్పనిసరిగా ప్రతిరోజూ అన్ని వివరాలు నమోదు చేసి ఉంచాలి. దానిని ప్రతి వినియోగదారుడు అడిగి చూసుకునే హక్కు ఉంది.)

తాగునీరు : పెట్రోలు బంకుల్లో స్వచ్ఛమైన తాగునీరు, సామాన్య ప్రజల సౌలభ్యం కోసం ఉచితంగా అందించాలి. ఏ బంకులోనైనా తాగునీటి సౌకర్యాలు అందుబాటులో లేకపోతే మీరు ఆయిల్ కంపెనీలకు ఫిర్యాదు చేయొచ్చు.

ఫోన్ సేవలు : మీరు వెళ్లే మార్గంలో ఏదైనా సమస్యలో చిక్కుకున్నా, మీ వద్ద సెల్‌ఫోన్ పనిచేయకపోయినా భయపడాల్సిన అవసరం లేదు. ఏ పెట్రోలు బంకు నుంచైనా ల్యాండ్‌ఫోన్ సేవలు పొందొచ్చు.

మరుగుదొడ్లు : పెట్రోలు పంపుల వద్ద శుభ్రమైన మూత్రశాలలు అందుబాటులో ఉంచాలి. దీన్ని ఉపయోగించటాన్ని ఎవరూ అడ్డుకోరాదు. పెట్రోలు బంకులో సరైన బాత్‌రూమ్స్ వంటివి లేకుంటే మీరు ఆయిల్ కంపెనీకి ఫిర్యాదు చేయొచ్చు. మహిళలకూ, పురుషులకు వేర్వేరుగా బాత్రూమ్‌లు ఉండాలి.

అత్యవసర మందులు : ప్రతి పెట్రోలు బంకు వద్ద అత్యవసర మందులు (ప్రథమ చికిత్స కిట్టు) అందుబాటులో ఉండాలి. తద్వారా సాధారణ ప్రజలు అవసరమైనప్పుడు వాటిని ఉపయోగించుకోవచ్చు. ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లో ఆరోగ్యాన్ని రక్షించే మందులు ఉండాలి. దీనితోపాటు అన్ని మందులపై ఎక్స్పైరీ తేదీ కూడా ఉండాలి. ఈ పెట్టెలోని మందులు పాతవి కాకూడదు. ఎక్కడైనా ప్రథమ చికిత్స కిట్టు ఇవ్వటానికి నిరాకరిస్తే రాతపూర్వకమైన ఫిర్యాదు చేయొచ్చు.

నాణ్యత తెలుసుకునే హక్కు : వినియోగదారులకు పెట్రోలు, డీజిల్ నాణ్యత, పరిణామాన్ని తెలుసుకునే హక్కు కూడా ఉంది. పెట్రోలు పంపు యజమానులు దీనికి ఏర్పాట్లు చేయాలి. అలా చేయకపోతే ఫిర్యాదు చేయొచ్చు.

నోటీసు బోర్డు : పెట్రోలియం సంస్థ పేరు, సంప్రదింపు నంబరు రాసి పెట్రోలు బంకు యజమాని దానిని ప్రజలకు కనిపించేలా నోటీసు బోర్డు ఏర్పాటుచేయాలి. దీని ద్వారా వినియోగదారులకు పెట్రోలు బంకు యజమాని లేదా సంబంధిత సంస్థను సంప్రదించేందుకు అవకాశం లభిస్తుంది. ప్రతి పెట్రోలు బంకు వద్ద ప్రారంభం, ముగింపు సమయం నోటీసు ద్వారా తెలపాలి.

బిల్లులు ఇవ్వాలి : పెట్రోలు, డీజిల్ బిల్లు కొన్ని కారణాలతో బంకులో పనిచేసే వారు ఇవ్వటానికి నిరాకరిస్తే దాని గురించి కూడా ఫిర్యాదు చేయొచ్చు.

గాలినింపుకునే సౌకర్యం : బంకు యాజమాన్యాలు వాహనాల్లో గాలిని నింపటానికి ఎలక్ట్రానిక్ యంత్రాన్ని, గాలిని నింపటానికి ఒక వ్యక్తిని నియమించాలి. ఈ సదుపాయం ఉచితంగా అందించాలి.

పైన పేర్కొన్న సదుపాయాల్లో ఏవి మీకు అందుబాటులో లేకున్నా మీరు సెంట్రలైజ్డ్ పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదుచేయొచ్చు. లేదా పెట్రోలు బంకులో ఉన్న ఆయిల్ కంపెనీ సేల్స్ ఆఫీసర్ సెల్‌నంబరుకు వాట్సాఫ్ లేదా ఇమెయిల్ ఐడికి ఫిర్యాదు చేయొచ్చు.

నాణ్యమైన ఉత్పత్తులను సంబంధిత వాహనాలకు పరిమితిని తెలుసుకుని వాహన తయారీదారుల ప్రతిపాదిత ఆయిల్‌ను ఇంజన్‌కు అందించటం ద్వారా ఇంజన్ కాలపరిమితిని, రక్షణను కల్పించుకోవచ్చు.

అదే జోరు కొనసాగించాలి..!

- నేడు దక్షిణాఫ్రికాతో రెండో టి20
- రాత్రి 7.30గం॥లకు



గ్కెబెర్హా(సెయింట్‌జార్జ్): దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టి20లో ఘన విజయం సాధించిన టీమిండియా.. అదే ఊపులో రెండో వన్డేకు సిద్ధమైంది. దక్షిణాఫ్రికాతో సెయింట్ జార్జెస్‌లోని గ్కెబెర్హా మైదానంలో ఆదివారం 2వ టి20 జరగనుంది. తొలి టి20లో గెలిచిన ఉత్సాహంతో టీమిండియా బరిలో దిగుతుండగా.. ఓటమికి బదులు తీర్చుకోవాలన్న కసిలో దక్షిణాఫ్రికా ఉంది. డర్బన్ వేదికగా శుక్రవారం జరిగిన తొలి టి20లో సంజు శాంసన్ అద్భుత ఫామ్‌కి తోడు సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ తొలి టి20లో రాణించడంతో భారత్ 61పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ క్రమంలో ఈ రెండు జట్ల మధ్య జరిగే ఆసక్తికర పోరు జరగనుంది. ఈ టి20లోనూ నెగ్గి నాలుగు టి20ల సిరీస్‌లో 2-0తో ఆధిక్యాన్ని పెంచుకోవాలని టీమిండియా భావిస్తోంది. ఫస్ట్ టీ20లో కంగుతిన్న ప్రొటీస్.. ఈ మ్యాచ్‌లో నెగ్గి బోణీ కొట్టాలని చూస్తోంది. ఇరు జట్లు ఢీ అంటే ఢీ అంటుండటంతో మ్యాచ్ రసవత్తరంగా సాగడం ఖాయంగా కనిపిస్తోంది.

మరో ఛాన్స్ ఇస్తారా?

తొలి టీ20లో గ్రాండ్ విక్టరీ కొట్టడంతో రెండో మ్యాచ్‌లోనూ దాదాపుగా అదే జట్టుతో వెళ్లాలని భారత జట్టు మేనేజ్‌మెంట్ భావిస్తోంది. అయితే ఒక మార్పు మాత్రం జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. సంజూ శాంసన్‌కు తోడుగా మరో ఓపెనర్‌గా అభిషేక్ శర్మకు బదులుగా రమణ్‌దీప్ సింగ్‌ను తీసుకునే అవకాశాల్ని కొట్టిపారేయలేం. వరుస వైఫల్యాలతో ఇబ్బంది పడుతున్న అభిషేక్.. ఈ సిరీస్‌లోని మొదటి మ్యాచ్‌లో 7 పరుగులే చేసి పెవిలియన్‌కు చేరుకున్నాడు. దీంతో అతడి స్థానంలో రమణ్‌దీప్‌ను తీసుకునే అవకాశం ఉంది.

ప్రయోగాలకు నో

ఫస్ట్ డౌన్‌లో సారథి సూర్యకుమార్ యాదవ్, సెకండ్ డౌన్‌లో తిలక్ వర్మ ఆడతారు. మిడిలార్డర్‌లో ముందుగా హార్దిక్ పాండ్యా బ్యాటింగ్‌కు దిగుతాడు. ఆ తర్వాత రింకూ సింగ్, స్పిన్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ వస్తారు. ప్రధాన స్పిన్నర్లుగా తొలి మ్యాచ్‌లో ఆడిన వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్ ఎలాగూ జట్టులో ఉంటారు. పేస్ బాధ్యతల్ని అర్ష్‌దీప్ సింగ్, ఆవేశ్ ఖాన్ పంచుకుంటారు. ఒక్క అభిషేక్ మార్పు తప్పితే మిగతా ప్లేయర్లను కదిపే అవకాశాలు కనిపించడం లేదు. ఒకవేళ సిరీస్ గెలిస్తే ఆఖరి టీ20లో ప్రయోగాలు, కొత్తవారికి అవకాశాలు ఇవ్వొచ్చు.

అద్భుత ఫామ్‌లో సంజు..

వికెట్ కీపర్ శాంసన్ బంగ్లాదేశ్‌పై 47బంతుల్లో 111పరుగులు చేయగా.. దక్షిణాఫ్రికాపై 50బంతుల్లో 107పరుగులు కొట్టాడు. ఈ రెండు టి20ల్లో అతని స్ట్రయిక్ రేట్ 214, 236.127గా ఉంది. ఈ రెండు టి20ల్లోనే సంజు 218పరుగులు కొట్టడం విశేషం. అలాగే 82.57% పరుగులు ఫోర్లు, సిక్సర్ల రూపంలోనే వచ్చాయి. శాంసన్ 2015లో టి20ల్లో అరంగేట్రం చేసి ఇప్పటివరకు 28మ్యాచ్‌లు ఆడాడు. 2022లో ఐర్లాండ్‌పై చేసిన 77పరుగులే ఇప్పటివరకు అతని అత్యధిక స్కోర్. దీంతో రెండో టి20ల్లో సంజు బ్యాటింగ్‌పైనే అందరి దృష్టి నెలకొంది. ఇందులోనూ సంజు సెంచరీ కొడితే మరిన్ని రికార్డులు అతని పేర లిఖించడం ఖాయం.

రాష్ట్రస్థాయి అండర్ -14 వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-భోగాపురం (విజయనగరం జిల్లా)



పోటీల ప్రారంభ సూచికగా క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

స్కూలు గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జిఎఫ్) ఆధ్వర్యంలో 68వ రాష్ట్రస్థాయి అండర్ -14 వాలీబాల్ పోటీలు శనివారం విజయనగరం జిల్లా భోగాపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఫ్లాగ్‌మార్చ్ తర్వాత క్రీడాజ్యోతిని వెలిగించి బాల బాలికల తో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. మూడు రోజులపాటు జరిగే ఈ పోటీలకు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికగా 26 బాల బాలికల జట్లు హాజరయ్యాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థులు గొప్ప క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని, క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు, శ్రమ, పట్టుదల, ఓర్పు ఉండాలని సూచించారు. ఇందులో రాణించి, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. జిల్లా విద్యాశాఖ అధికారి మాణిక్యం నాయుడు మాట్లాడుతూ... విద్యార్థులకు చదువులతోపాటు క్రీడలు కూడా ఒక భాగమని, క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఐపిఇ జి.భానుమూర్తి రాజు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పాఠశాల క్రీడా పోటీల నిర్వహణకు ఈ ఏడాది ప్రభుత్వం సుమారు రూ.7.4 కోట్లను మంజూరు చేసిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు ఉద్యోగ నియామకాల్లో ఇస్తున్న రిజర్వేషన్‌ను రెండు నుంచి మూడు శాతానికి పెంచిందని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కష్ణంరాజు మాట్లాడుతూ ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన 12 మంది బాలురను, మరో 12 మంది బాలికలను డిసెంబర్లో వారణాసిలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తారని తెలిపారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68